www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

బుధవారం 08-01-2025

సంపుటి : 01 | సంచిక : 247 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్




డా॥ కాచం సత్యనారాయణ CMD



## దేశ రాజధానిలో మోగిన ఎన్నికల నగారా

- ఫిబ్రవరి 5న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు.. ప్రకటించిన ఈసీ
- ''ఓటింగ్‌లో మనం కొత్త రికార్డులు సృష్టిస్తున్నాం
- త్వరలోనే దేశంలో ఓటర్ల సంఖ్య 100కోట్లను దాటనుంది
- ఎన్నికల ప్రక్రియపై కొందరు ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారు
- ట్యాంపరింగ్ ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవి
- సీఈసీ రాజీవ్ కుమార్

2

## వివాదాస్పద స్వామీజీ ఆశారాంకు ఊరట



- మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన సుప్రీంకోర్టు
- అనారోగ్య కారణాల వల్ల మార్చి 31 వరకు బెయిల్ మంజూరు
- బెయిల్‌పై విడుదలైన ఆయన తన అనుచరులను కలవకూడదని కోర్టు ఆదేశం

2



కేటీఆర్ ను ఎట్టి పరిస్థితిలోనూ వదలకూడదని రేవంత్ రెడ్డి ప్రభుత్వం పట్టుదలగా ఉంది. ఫార్ములా ఈ-రేసు కేసులో కేటీఆర్ వేసిన క్వాష్ పిటిషన్ ను హై కోర్టు కొట్టేసి విచారణ సంస్థలకు మార్గం సుగమం చేసింది.దీంతో ఏసీబీ, ఈడీ దూకుడు పెంచాయి. ఏసీబీ ముందు తొమ్మిదో తేదీన, ఈడీ ముందు 16 న కేటీఆర్ విచారణకు హాజరు కావాల్సి ఉంది. దీంతో కేటీఆర్ ఏ క్షణమైనా అరెస్టు అవుతాడని వార్తలు వస్తున్నాయి.

# అరెస్టు ఖాయమేనా?

## కేటీఆర్‌ను ఎట్టి పరిస్థితిలోనూ వదలకూడదు

- పట్టుదలగా కాంగ్రెస్ ప్రభుత్వం
- హైకోర్టు క్వాష్ పిటిషన్ కొట్టివేయడంతో అప్రమత్తమైన రాష్ట్ర ప్రభుత్వం..
- సుప్రీంలో కేవియట్ పిటిషన్
- హైకోర్టు క్వాష్ పిటిషన్ కొట్టివేయడంతో విచారణ సంస్థలకు మార్గం సుగమం
- సుప్రీంకోర్టును ఆశ్రయించిన కేటీఆర్..
- ఇది ఆరంభం మాత్రమే.. న్యాయ వ్యవస్థపై పూర్తి విశ్వాసం ఉంది
- మీడియా సమావేశంలో కేటీఆర్



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో..**

ఫార్ములా ఈ రేసింగ్ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావుకు తెలంగాణ హైకోర్టులు చుక్కెదురైంది. ఏసీబీ నమోదు చేసిన కేసును కొట్టివేయాలంటూ కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు ధర్మాసనం డిస్మిస్ చేసింది. ప్రభుత్వ వాదనలతో న్యాయస్థానం ఏకీభవించింది. అలాగే మధ్యంతర ఉత్తర్వులను కూడా హైకోర్టు ఎత్తివేసింది. ఏసీబీ దర్యాప్తులో తాము జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. చట్ట ప్రకారం నడుచుకోవాలని, అందరికి రూల్ ఆఫ్ లా వర్తిస్తుందని హైకోర్టు వ్యాఖ్యలు చేసింది. కాగా, ఫార్ములా ఈ కార్ రేసింగ్‌లో నిధుల మళ్లింపు జరిగిదంటూ కేటీఆర్ సహా మరో ఇద్దరిపై ఏసీబీ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. కేటీఆర్‌ను ఏ1గా, ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్‌ను

మిగతా2లో...

తెలంగాణ హైకోర్టు సీజేను బాంబే హైకోర్టుకు

## బదిలీ చేయాలి

కేంద్రానికి సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు



2

బీపీఎస్సీ వ్యవహారంపై

## పాట్నా హైకోర్టుకు వెళ్లండి

పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీం కోర్టు నిరాకరణ



2

## జనవరి 13 నుంచి సంక్రాంతి సెలవులు

- ప్రకటించిన తెలంగాణ ఇంటర్ బోర్డు
- సెలవుల్లో విద్యార్థులకు కళాశాలలు ఎలాంటి తరగతులు నిర్వహించకూడదు
- అలా చేస్తే చర్యలు తీసుకుంటామన్న బోర్డు

2

మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి



## నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
| --- | --- |
| ₹ 114 | ₹ 136 |
| స్కిన్ | స్కిన్ లెస్ |
| ₹ 197 | ₹ 224 |



# మార్చి నెలాఖరుకు మెట్రోల డీపీఆర్‌లు పూర్తి చేయాలి

### ఏప్రిల్ నెలాఖరుకు టెండర్లు పిలవాలి

- మెట్రో మార్గాల భూ సేకరణను వెంటనే పూర్తి చేయాలి
- ఎలైన్‌మెంట్ రూపొందించేటప్పుడే క్షేత్ర స్థాయిలో సమగ్ర పరిశీలన చేయాలి
- శామీర్‌పేట్, మేడ్చల్ మెట్రోలు ఒకే చోట ప్రారంభమయ్యేలా చూసుకోవాలి
- హెచ్‌జీసీఎల్ కింద రేడియల్ రోడ్ల నిర్మాణం...
- మెట్రో, ఎలివేటెడ్ కారిడార్లు, రేడియల్ రోడ్లపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**విశ్వంభర,హైదరాబాద్ :** ఫ్యూచర్ సిటీ, శామీర్‌పేట్, మేడ్చల్ మెట్రో మార్గాలకు సంబంధించిన సమగ్ర వివరణాత్మక ప్రణాళికలు (డీపీఆర్ లు) మార్చి నెలాఖరు నాటికి పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మూడు మెట్రోల డీపీఆర్లకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఆమోదం పొంది ఏప్రిల్ నెలాఖరుకు టెండర్లు పిలవాలని సీఎం సూచించారు. హైదరాబాద్ నగరంలో మెట్రో విస్తరణ, రేడియల్ రోడ్ల నిర్మాణాలు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణాలపై తన నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం-ఫ్యూచర్ సిటీ మెట్రో (40 కి.మీ.), జేబీఎస్-శామీర్‌పేట మెట్రో (22 కి.మీ.), ప్యారడైజ్-మేడ్చల్ మెట్రో (23 కి.మీ.) మార్గాలకు సంబంధించి భూ సేకరణను వెంటనే పూర్తి చేయాలని సీఎం సూచించారు. ఎలివేటెడ్ కారిడార్ల విషయంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకోవాలన్నారు.

మిగతా2లో...

కనుమరుగవుతున్న కాంగ్రెస్ పార్టీ..

## నిరాశతో భౌతిక దాడులు

- పోలీసులను వెంట తీసుకొచ్చి బీజేపీ కార్యాలయంపై దాడి చేస్తారా?
- బీజేపీ తలచుకుంటే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు రోడ్లమీద తిరగలేరు
- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంపై దాడిని ఖండించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

2




## ప్రభుత్వ ప్రాధాన్యతల మేరకు అధికారులు పనిచేయాలి



- సన్న, చిన్న కారు రైతులకు ప్రయోజనాలు అందేలా చర్యలు చేపట్టాలి
- యాంత్రీకరణ, సూక్ష్మ సేద్య పరికరాలకు మరింతగా ప్రోత్సాహం అందించాలి
- డ్రోన్ల ద్వారా రైతుల వద్దకు వెళ్లి విక్రయించేలా రాష్ట్రంలో 3 ఆధునిక మార్కెట్లు
- వ్యవసాయ, అనుబంధ రంగాల ప్రగతిపై సచివాయలంలో మంత్రి తుమ్మల సమీక్ష

2






ప్రియాంక గాంధీపై వ్యాఖ్యలు చేస్తే..

## బీజేపీ ఎందుకు ఖండించలేదు?

- ఈ వ్యవహారంలో బీజేపీ అగ్రనాయకత్వం క్షమాపణ చెప్పాలి
- ఇలాంటి దిగజారుడు రాజకీయాలు చేయడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు
- మనది గాంధేయ వాదం.. దాడులు చేయడం కాంగ్రెస్ పార్టీ సంస్కృతి కాదు
- తెలంగాణలో ప్రజాపాలన కొనసాగుతోంది
- ప్రజల ధన, మాన ప్రాణాలను కాపాడటం మా బాధ్యత
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**విశ్వంభర, ఖమ్మం:** కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ ప్రియాంక గాంధీపై ఢిల్లీకి చెందిన బీజేపీ నేత రమేశ్ బిదూరీ చేసిన అనుచిత వ్యాఖ్యలను ప్రతిఒక్కరూ ఖండించాల్సిన అవసరం ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, మహిళల పట్ల గౌరవ మర్యాదలున్న అందరూ ప్రియాంక గాంధీపై చేసిన వ్యాఖ్యలు ఖండించాల్సిందేనని తేల్చి చెప్పారు. ఈ వ్యవహారంలో బీజేపీ అగ్రనాయకత్వం క్షమాపణ చెప్పాలని భట్టి డిమాండ్ చేశారు. ఇలాంటి దిగజారుడు రాజకీయాలు చేయడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. ఈ మేరకు ఖమ్మంలో నిర్వహించిన మీడియా సమావేశంలో

మిగతా2లో...

# అరెస్టు ఖాయమేనా?

మొదటిపేజీ తరువాయి

ఏ2గా, హెచ్ఎండీఏ విశ్రాంత చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిని ఏ3గా చేర్చుతూ ఏసీబీ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. అయితే ఏసీబీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలంటూ కేటీఆర్ హైకోర్టులో క్వాష్ పిటిషన్‌ను దాఖలు చేశారు. గతంలో రెండు సార్లు ఈ పిటిషన్‌పై హైకోర్టులో విచారణకు రాగా, కేటీఆర్‌ను అరెస్ట్ చేయవద్దంటూ న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది.తర్వాతి విచారణలో ఈ కేసుకు సంబంధించి న్యాయస్థానంలో సుదీర్ఘంగా వాదనలు జరిగాయి. సెక్షన్ 409 వర్తింపదని, కేటీఆర్‌పై పెట్టిన కేసులు ఏవీ కూడా వర్తించవని హైకోర్టుకు కేటీఆర్ తరపు న్యాయవాది వాదనలు వినిపించారు. ఎఫ్ఈవోతో ఒప్పందాలు కుదుర్చుకున్న సమయంలో ఎక్కడా అవినీతికి పాల్పడలేదని, అలాగే కేటీఆర్ లబ్ధిపొందినట్లు ఎలాంటి ఆధారాలు లేవని న్యాయస్థానం దృష్టికి కేటీఆర్ న్యాయవాది తీసుకెళ్లారు.మరోవైపు కేటీఆర్ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని, అందుకే ఆయనను ఏ1గా చేర్చామని ప్రభుత్వం తరపున న్యాయవాది వాదించారు. కేసు ప్రాథమిక విచారణ దశలోనే ఉందని, కేటీఆర్‌ను విచారిస్తే అసలు వాస్తవాలు బయటపడతాయని హైకోర్టుకు తెలిపారు. ఈ కేసు ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి గవర్నర్ అనుమతి పొందామని పేర్కొన్నారు. అలాగే ప్రాథమిక విచారణ తర్వాతే కేసును నమోదు చేసినట్లు చెప్పారు. ఈ కేసులో కేటీఆర్‌ది కీలక పాత్ర ఉందని, పూర్తి స్థాయిలో విచారణ జరపాలని క్వాష్ పిటిషన్‌ను డిస్మస్ చేయాలని అడ్వకేట్ జనరల్ వాదనలు వినిపించారు. ఇరు వాదనలు విన్న కోర్టు డిసెంబర్ 31న రిజర్వ్ చేస్తూ కేసును నేటికి వాయిదా వేసింది. అయితే ఈరోజు తీర్పు చెప్పిన హైకోర్టు ఈ కేసులో తాము జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది.

**లీగల్ టీంతో బీఆర్ఎస్ నాయకుల చర్చలు**

కెటీఆర్ అరెస్టవుతారని వార్తలు వస్తున్న నేపథ్యంలో బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన చెందుతున్నట్టు సమాచారం. ముఖ్యంగా బంజారాహిల్స్ నందినగర్ లోని కేటీఆర్ నివాసానికి హరీశ్ రావు, కవిత, మదుసూదనచారి, మాజీ మంత్రులు పువ్వాడ అజయ్ కుమార్, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర బీఆర్ఎస్ నేతలు, మరోవైపు కేటీఆర్ లీగల్ టీమ్ తో చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. కేటీఆర్ ను అరెస్ట్ చేయడానికి వస్తే.. ఏం చేయాలి అనే దానిపై బీఆర్ఎస్ నేతలు లీగల్ టీమ్ తో చర్చలు జరిపినట్లు సమాచారం. ఏసీబీ ఏం చేస్తుందనేది కూడా ఎప్పటికప్పుడు తెలుసుకునే ప్రయత్నం



చేస్తున్నారు.తన ఇంట్లో ఏసీబీ సోదాలు జరుగుతాయని సోమవారం ఉదయమే కేటీఆర్ మీడియాతో చెప్పటం గమనార్హం. ఆయన చెప్పినట్టుగానే ఏసీబీ అధికారులు సాయంత్రానికి ఆయన నివాసంలో సోదాలకు ఉపక్రమించటం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఫార్ములా ఈ రేసు వ్యవహారంలో కేబినెట్ ఆమోదం లేకుండానే డబ్బులు ముట్టజెప్పారంటూ పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఆ సమయంలో మంత్రిగా వ్యవహరించిన కేటీఆర్‌ను ఏ1గా ఏసీబీ చేర్చింది. విచారణకు పిలిచి ఆయన్ని అరెస్ట్ చేయవచ్చన్న భయం గులాబీ పార్టీ నాయకుల్లో మొదలైంది. ఈ నేపథ్యంలో సుప్రీం కోర్టుకు వెళ్లాలని కేటీఆర్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆలోచిస్తున్నారు.ఈ విషయమై కేటీఆర్ తన లీగల్ టీమ్ తో చర్చలు జరిపారు.

తెలంగాణ హైకోర్టు కేటీఆర్ క్వాష్ పిటిషన్ కొట్టివేసిన వెంటనే తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది.ఒకవైపు కేటీఆర్ లీగల్ టీంతో చర్చలు జరుపుతుండగానే ప్రభుత్వం సుప్రీం కోర్టులో కేవియట్ పిటిషన్ వేసింది. హైకోర్టు తీర్పును సుప్రీం కోర్టులో సవాల్ చేస్తాడని తెలిసిన ప్రభుత్వం కేవియట్ పిటిషన్తో ఆయనకు ప్రభుత్వం షాక్ ఇచ్చింది.తమ వాదనకు వినకుండా కేటీఆర్ పిటిషన్ పై ఎటువంటి నిర్ణయం తీసుకోవద్దని కేవియట్ పిటిషన్ వేసింది. కాబట్టి ఈ కేసులో ప్రభుత్వం ముందుగా తన వాదనలు వినిపించే అవకాశం కలుగుతుంది. కేవియట్ పిటిషన్ వేయడం వ్యూహాత్మకమైన చర్య అని న్యాయ నిపుణులు చెబుతున్నారు. ఇది కేసు విచారణలో కీలక పాత్ర పోషిస్తుంది.తెలంగాణ ప్రభుత్వం ఈ పిటిషన్‌ను దాఖలు చేయడం వల్ల కొన్ని ముఖ్యమైన ప్రయోజనాలు ఉన్నాయి. ఈ కేవియట్ దాఖలు చేయడం వల్ల కేటీఆర్ తరపున పిటిషన్ దాఖలైన సమయంలో మధ్యంతర ఉత్తర్వులు లేదా స్టే ఇచ్చే ముందు తెలంగాణ ప్రభుత్వ వాదనలు వినడం తప్పనిసరి అవుతుంది. ఏకపక్ష తీర్పు రాకుండా ఈ కేవియట్ ద్వారా నివారించే అవకాశం ఉంటుంది.హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు పొందడానికి కేటీఆర్ ప్రయత్నిస్తే కేవియట్ పిటిషన్ ద్వారా తక్షణమే జారీ అయ్యే అవకాశాలు సన్నగిల్లే అవకాశం ఉంటుంది. తెలంగాణ ప్రభుత్వం వాదనలు వినిపించిన తర్వాతే సుప్రీంకోర్టు నిర్ణయం తీసుకునే అవకాశం ఉంటుంది.

**సుప్రీంకోర్టును ఆశ్రయించిన కేటీఆర్..**

ఈ-కారు రేసు వ్యవహారంలో మాజీ మంత్రి, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను మంగళవారం తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. దీంతో హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ ఆయన సర్వోన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. కేటీఆర్ తరపున న్యాయవాది మోహిత్‌రావు ఈమేరకు సుప్రీంకోర్టు రిజిస్ట్రీలో పిటిషన్ వేశారు.

**ఇది ఆరంభం మాత్రమే.. న్యాయ వ్యవస్థపై పూర్తి విశ్వాసం ఉంది: కేటీఆర్**

తనపై పెట్టింది కక్ష సాధింపు కేసు అని తెలిసినా ఏసీబీ విచారణకు హాజరయ్యానని మాజీ మంత్రి, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. మంగళవారం హైదరాబాద్ నందినగర్‌లోని నివాసం వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు.''నాపై పెట్టింది అక్రమ కేసు, రాజకీయ ప్రేరేపిత కేసు. అవినీతిపరులకు అంతా అవినీతిగానే కనిపిస్తుంది. ఫార్ములా ఈ-రేస్ వ్యవహారంలో అరపైసా అవినీతి కూడా జరగలేదు. తెలంగాణ ఇమేజ్‌ను ఆకాశమంత ఎత్తుకు తీసుకెళ్లేందుకు ఫార్ములా రేస్ నిర్ణయం తీసుకున్నాం. హైదరాబాద్‌ను ప్రపంచపటంలో నిలిపేందుకు తీసుకున్న నిర్ణయం. ఏదో ఆశించి గూడుపుఠాణితో చేసిన పనికాదు. ఎలక్ట్రిక్ వాహనాలకు హైదరాబాద్‌ను కేంద్రంగా తీర్చిదిద్దాలనేది ఆలోచన. మీ మాదిరిగా దివాలాకోరు పనులు చేయాల్సిన అవసరం లేదు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని నాపై అక్రమ కేసు పెట్టారు. ఎలాంటి విచారణకు రావాలని పిలిచినా వస్తా. విచారణకు లాయర్లతో వస్తానంటే వద్దంటున్నారు. హైకోర్టు అనుమతిస్తే మా న్యాయవాదులతో కలిసి ఏసీబీ విచారణకు హాజరవుతా. సుప్రీంకోర్టులో కూడా న్యాయపోరాటం చేస్తాం. దుర్మార్గుల నుంచి చట్టపరంగా రక్షణ కోరుతున్నా. నా హక్కులకు భంగం కలిగేలా ప్రవర్తించారు. లగచర్ల కేసులో పట్నం నరేందర్‌రెడ్డి ఇవ్వని స్టేట్‌మెంట్ ఇచ్చినట్టు పోలీసులు బుకాయించారు. అందుకే న్యాయవాదుల సమక్షంలో విచారణ చేపట్టాలని హైకోర్టును ఆశ్రయిస్తాం.ఎల్లుండి కూడా లాయర్లతో అనుమతిస్తే విచారణకు వెళ్తా. ఈనెల 16న ఈడీ విచారణకు కూడా హాజరవుతా. ఏదో జరిగిందని కొందరు శునకానందం పొందుతున్నారు. విచారణను కొనసాగించాలని చెప్పిందే తప్ప కోర్టు నాకు శిక్ష వేయలేదు. నేను నేరం చేసినట్టుగానీ, తప్పు చేసినట్టు గానీ కోర్టు చెప్పలేదు. ఏం జరగబోతుందో కొందరు మంత్రులు ముందే చెబుతున్నారు. విచారణ సచివాలయంలో జరగదు.. మంత్రుల పేషీలో జరగదు. విచారణ ఎప్పుడైనా న్యాయస్థానాల్లోనే జరుగుతుంది. గతంలో మీకు ఇలాంటి అనుభవాలు ఎదురైతే కోర్టుకే వెళ్లారు. నేను ఏ తప్పూ చేయలేదు.. ఎలాంటి విచారణకైనా సిద్ధం. ఇది.. ఆరంభం మాత్రమే. భారత న్యాయ వ్యవస్థపై పూర్తి విశ్వాసం ఉంది. చివరికి న్యాయమే గెలుస్తుంది'' అని కేటీఆర్ అన్నారు.

ప్రియాంక గాంధీపై వ్యాఖ్యలు చేస్తే..

## బీజేపీ ఎందుకు ఖండించలేదు?

మొదటిపేజీ తరువాయి

భట్టి మాట్లాడారు.''క్షణికావేశంలో పలువురు యువజన కాంగ్రెస్ నాయకులు బీజేపీ కార్యాలయంపై దాడి చేశారని తెలుసుకున్నాను. వెంటనే సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌తో మాట్లాడాను. విషయం తెలియగానే సీఎం, పీసీసీ అధ్యక్షుడు కూడా ఖండించారు. సీఎం రేవంత్‌రెడ్డి కూడా చాలా స్పష్టంగా చెప్పారు. మనది గాంధేయ వాదం.. దాడులు చేయడం కాంగ్రెస్ పార్టీ సంస్కృతి కాదన్నారు. ఇదే కాదు.. ఏ రకమైన దాడులనూ కాంగ్రెస్ ప్రోత్సహించదు. తెలంగాణలో ప్రజాపాలన కొనసాగుతోంది. ప్రజల ధన, మాన ప్రాణాలను కాపాడటం మా బాధ్యత. లా అండ్ ఆర్డర్ విషయంలో ఎవరైనా ఒక్కటే. ఏ పార్టీ అయినా సరే.. ఎక్కడైనా అన్యాయం జరుగుతుందనిపిస్తే ప్రజల్లోకి వెళ్లాలి.. అభిప్రాయాలు వ్యక్త పరచాలి. ఇలాంటి దాడులకు మాత్రం దిగొద్దు. అసలు విషయం తెలుసుకోకుండా బీజేపీ నేతలు వ్యాఖ్యలు చేస్తున్నారు. పార్లమెంట్ సభ్యురాలు, ఒక మహిళపై భాజపా నేత ఇష్టానుసారం మాట్లాడితే.. బీజేపీ అగ్రనాయకత్వం ఏం చేస్తోంది? తప్పు ఎవరు చేసినా తప్పే.. ఇంత వరకు ఎందుకు ఖండించలేదు?అసభ్యంగా మాట్లాడిన బీజేపీ నేతను ఇప్పటికే పార్టీ నుంచి సస్పెండ్ చేయాల్సింది'' అని వ్యాఖ్యానించారు.

## ప్రభుత్వ ప్రాధాన్యతల మేరకు అధికారులు పనిచేయాలి

**విశ్వంభర, హైదరాబాద్:** అధికారులు ప్రభుత్వ ప్రాధాన్యతల మేరకు పనిచేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. వ్యవసాయ, అనుబంధ రంగాల ప్రగతిపై సచివాయలంలో మంత్రి సమీక్ష నిర్వహించారు. వ్యవసాయ శాఖ కార్యదర్శి ఎం.రఘునందనరావు, డైరెక్టర్ గోపి, ఉద్యానశాఖ డైరెక్టర్ యాస్మిన్ బాషా, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ ఉదయ్ కుమార్ తదితరులు హాజరయ్యారు. ఈ ఏడాది రబీ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో వివిధ అంశాలపై మంత్రి చర్చించారు. రైతులు, ప్రజాప్రతినిధులు, మంత్రుల నుంచి వచ్చే విజ్ఞప్తులను సత్వరమే పరిశీలించి చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. పరిష్కారంలో జాప్యంపై మంత్రి అసహనం వ్యక్తం చేశారు. సన్న, చిన్న కారు రైతులకు ప్రయోజనాలు అందేలా వ్యవసాయ యాంత్రీకరణ, సూక్ష్మ సేద్య పరికరాలకు మరింతగా ప్రోత్సాహం అందించాలన్నారు. ట్రేడర్లు రైతుల వద్దకు వెళ్లి విక్రయించేలా రాష్ట్రంలో 3 ఆధునిక మార్కెట్లు అధునాతన హంగులతో ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి సూచించారు. సంచార భూసార పరీక్ష కేంద్రాలను ఉమ్మడి జిల్లాకు ఒకటి చొప్పున ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వర్సిటీల్లో ప్రస్తుతం ఉన్న మౌలిక సదుపాయాల వృద్ధి, కొత్త భవనాల నిర్మాణాలకు బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. రైతు వేదికల నిర్వహణ ఖర్చుల విడుదలకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

### కనుమరుగవుతున్న కాంగ్రెస్ పార్టీ..

## నిరాశతో భౌతిక దాడులు

**విశ్వంభర, హైదరాబాద్:** బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంపై యూత్ కాంగ్రెస్ కార్యకర్తల దాడిని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఇలాంటి దుర్మార్గ రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ అయిన కాంగ్రెస్ పార్టీ.. తీరు మార్చుకోకపోతే పరిస్థితులు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. పోలీసుల సమక్షంలోనే కాంగ్రెస్ కార్యకర్తలు దాడికి పాల్పడటం దుర్మార్గమన్నారు.పోలీసులను వెంట తీసుకొచ్చి బీజేపీ కార్యాలయంపై రాళ్లు విసిరారని, పోలీసులు ఇలా వ్యవహరించడం ఎంత వరకు సమంజమని హైదరాబాద్ సీపీని ప్రశ్నించారు. బీజేపీ తలచుకుంటే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు రోడ్లమీద తిరగలేరని హెచ్చరించారు. రోజు రోజుకూ కనుమరుగవుతున్న కాంగ్రెస్ పార్టీ.. నిరాశతో భౌతిక దాడులకు దిగడాన్ని ప్రజలు క్షమించరన్నారు. ప్రజాస్వామ్యంలో హింసా రాజకీయాలు, భౌతిక దాడులకు తావు లేదన్నారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ ఎక్కడ ఉందని భాజపా ఎమ్మెల్యే రాజాసింగ్ ప్రశ్నించారు. దాడిపై సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

## తెలంగాణ హైకోర్టు సీజేను బాంబే హైకోర్టుకు బదిలీ చేయాలి

**ఢిల్లీ:** తెలంగాణ, బాంబే హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులను బదిలీ చేసేందుకు సుప్రీంకోర్టు కొలీజియం కేంద్రానికి సిఫారసు చేసింది. తెలంగాణ హైకోర్టు సీజేగా ఉన్న జస్టిస్ ఆలోక్ అరాధేను బాంబే హైకోర్టుకు, బాంబే హైకోర్టు సీజే జస్టిస్ దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయ్‌ను ఢిల్లీ హైకోర్టుకు బదిలీ చేయాలని కొలీజియం సిఫారసు చేసింది. 2023 జులైలో తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ఆలోక్ అరాధే నియమితులైన విషయం తెలిసిందే.అలాగే, పట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌ను సుప్రీంకోర్టు జడ్జిగా నియమించేందుకు సుప్రీంకోర్టు సీజే జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ఐదుగురు జడ్జిలతో కూడిన కొలీజియం సిఫారసు చేసింది. 2011 నవంబర్‌లో కేరళ హైకోర్టు జడ్జిగా నియమితులైన జస్టిస్ చంద్రన్.. ఆ తర్వాత పాట్నా హైకోర్టు సీజేగా పదోన్నతి పొందారు. 2023 మార్చి 29 నుంచి అదే హోదాలో కొనసాగుతున్నారు. కొలీజియం సిఫారసును కేంద్రం ఆమోదిస్తే.. సుప్రీంకోర్టులో మొత్తం జడ్జిల సంఖ్య 33కి చేరుకోనుంది.

## జనవరి 13 నుంచి సంక్రాంతి సెలవులు

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ ఇంటర్ బోర్డు సంక్రాంతి సెలవులు ప్రకటించింది. జనవరి 13 నుంచి 16 వరకు ఇంటర్ కళాశాలలకు సెలవులు మంజూరు చేస్తూ ప్రకటన విడుదల చేసింది. 17న తిరిగి కళాశాలలు ప్రారంభమవుతాయని పేర్కొంది. సంక్రాంతి సెలవుల్లో విద్యార్థులకు కళాశాలలు ఎలాంటి తరగతులు నిర్వహించకూడదని తెలిపింది. అలా చేస్తే చర్యలు తీసుకుంటామని బోర్డు స్పష్టం చేసింది. 11న (రెండో శనివారం), 12న (ఆదివారం) కావడంతో మొత్తంగా ఆరు రోజుల పాటు సెలవులు లభించాయి.



## దేశ రాజదానిలో మోగిన ఎన్నికల నగారా

**ఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలకు నగారా మోగింది. ఈ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం మంగళవారం ప్రకటించింది. 70 శాసనసభ స్థానాలున్న దిల్లీ కి ఒకే విడతలో ఫిబ్రవరి 5న ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపింది. ఫిబ్రవరి 8న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటించనున్నట్లు కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి రాజీవ్ కుమార్ వెల్లడించారు.

**ఢిల్లీ ఎన్నికల తేదీలివే..**

**నోటిఫికేషన్ విడుదల :** జనవరి 10
**నామినేషన్ల సమర్పణకు చివరి తేదీ:** జనవరి 17
**నామినేషన్ల పరిశీలన :** జనవరి 18
**నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ :** జనవరి 20
**పోలింగ్ తేదీ :** ఫిబ్రవరి 5
**ఓట్ల లెక్కింపు :** ఫిబ్రవరి 8

దిల్లీలో మొత్తం 1.55 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 2.08 లక్షల మంది తొలి ఓటర్లు ఉన్నట్లు సీఈసీ తెలిపారు. 13,033 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. అన్ని కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్‌ను అందుబాటులో ఉంచనున్నట్లు పేర్కొన్నారు. 85 ఏళ్లు పైబడిన వారికి ఇంటి నుంచే ఓటు వేసే సదుపాయాన్ని కల్పించనున్నట్లు తెలిపింది.

**ఈవీఎంలపై ట్యాంపరింగ్ ఆరోపణలపై ఈసీ స్పష్టత..**

ఈ సందర్భంగా ఈవీఎం ట్యాంపరింగ్, ఓటర్ల జాబితాలో అవకతవకలు అంటూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలపై సీఈసీ రాజీవ్ కుమార్ స్పష్టతనిచ్చారు. ''ఓటింగ్‌లో మనం కొత్త రికార్డులు సృష్టిస్తున్నాం. మహిళల భాగస్వామ్యం పెరుగుతోంది. త్వరలోనే దేశంలో ఓటర్ల సంఖ్య 100కోట్లను దాటనుంది. అయితే, ఎన్నికల ప్రక్రియపై కొందరు ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారు. ఓటరు జాబితాను సిద్ధం చేసే ప్రతి దశలో రాజకీయ పార్టీలతో సంప్రదింపులు జరుపుతూనే ఉన్నాం. ఇది పూర్తిగా పారదర్శకమైన ప్రక్రియ. ఓటరు జాబితాలో పేర్ల చేరిక, తొలగింపులకు సంబంధించి విధివిధానాలను పాటిస్తున్నాం. ఇందులో అవకతవకలకు ఆస్కారం లేదు'' అని రాజీవ్ కుమార్ వెల్లడించారు. ఈవీఎంలను హ్యాక్ చేసే అవకాశం లేదని కోర్టులు ఇప్పటికే 42 సార్లు తీర్పులు చెప్పాయని సీఈసీ ఈ సందర్భంగా గుర్తుచేశారు. ట్యాంపరింగ్ ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని అన్నారు. సాయంత్రం 5 గంటల తర్వాత పోలింగ్ శాతంలో భారీ మార్పులు ఉంటున్నాయంటూ చేస్తున్న ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. పోలింగ్ శాతాన్ని ఎవరూ మార్చలేరన్నారు.




## బీపీఎస్సీ వ్యవహారంపై పాట్నా హైకోర్టుకు వెళ్లండి

### పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీం కోర్టు నిరాకరణ

**ఢిల్లీ:** బిహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఇటీవల నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్షల్లో అవకతవకలు జరిగాయన్న ఆరోపిస్తూ అభ్యర్థులు భారీ ఎత్తున నిరసనలు చేస్తున్న విషయం తెలిసిందే. వ్యవహారంపై దాఖలు చేసిన పిటిషన్ విచారించేందుకు సుప్రీం కోర్టు నిరాకరించింది. దీనిపై పట్నా హైకోర్టును ఆశ్రయించాలని పిటిషనర్‌కు సూచించింది. డిసెంబర్ 13న బిహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (బీపీఎస్సీ) నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్షల్లో అవకతవకలు జరిగాయన్న వార్తలు మరోసారి తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీసింది. బీపీఎస్సీ కంబైన్డ్ కాంపిటేటివ్ పరీక్ష ప్రశ్నపత్రం లీకైనట్లు ఆరోపణలు వెల్లువెత్తడంతో వేలాదిమంది అభ్యర్థులు పట్నాలోని గాంధీ మైదాన్ వద్ద నిరసనకు దిగారు. ప్రిలిమినరీ పరీక్షను రద్దు చేసి.. మళ్లీ కొత్తగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. కాగా పరీక్షను రద్దు చేసే ప్రసక్తే లేదని అధికారులు తేల్చి చెప్పారు. ఈ క్రమంలో అభ్యర్థులు ఆందోళనల్ని ఉద్ధృతం చేయగా వారిని చెదరగొట్టేందుకు పోలీసులు జల ఫిరంగులు ప్రయోగించి.. లాఠీఛార్జి చేశారు. జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ విద్యార్థులకు పూర్తి మద్దతును ప్రకటిస్తూ జనవరి 2న ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. పట్నాలోని గాంధీ మైదాన్‌లో గత నాలుగు రోజులుగా ప్రశాంత్ కిశోర్ చేస్తున్న నిరవధిక నిరాహార దీక్షను పోలీసులు భగ్నం చేశారు.

## అవసరమైతే ప్రజల ఇళ్లలోనే ఉంటా: ఆతిశీ

**ఢిల్లీ:** ముఖ్యమంత్రిగా తనకు కేటాయించిన నివాసాన్ని కేంద్ర ప్రభుత్వం తాజాగా మరోసారి రద్దు చేసిందని ఢిల్లీ సీఎం ఆతిశీ విమర్శించారు. మూడు నెలల వ్యవధిలో ఇలా జరగడం ఇది రెండోసారని అన్నారు. మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. నివాసాన్ని రద్దు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం నుంచి సోమవారం కూడా నోటీసులు వచ్చాయని అన్నారు. ఇంటిని ఖాళీ చేయాల్సిందిగా అందులో పేర్కొన్నారని వివరించారు.తన కుటుంబ సభ్యులను బీజేపీ లక్ష్యంగా చేసుకుంటోందని ఆతిశీ ఆరోపించారు. '' నేను సీఎంగా ఎన్నికైన తర్వాత మా వస్తువులన్నింటినీ భాజపా కార్యకర్తలు రోడ్డుమీదకి విసిరేశారు. మా నివాసాలను భాజపా గుంజుకోవచ్చేమో కానీ, దిల్లీ ప్రజల అభివృద్ధి కోసం పని చేయకుండా మమ్మల్ని ఆపలేరు. అవసరమైతే.. దిల్లీ ప్రజల ఇళ్లలోనే ఉంటూ.. వాళ్ల కోసం పని చేస్తా'' అని అన్నారు.మరోవైపు ఫిబ్రవరి 5వ తేదీన దిల్లీ అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల సంఘం నిర్ణయించిన సంగతి తెలిసిందే. అదే నెల 8న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. దిల్లీలో మొత్తం 1.55 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 2.08 లక్షల మంది కొత్త ఓటర్లు ఉన్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. 13,033 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి, అన్ని కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్‌ను అందుబాటులో ఉంచనున్నట్లు పేర్కొంది. 85 ఏళ్లు పైబడిన వారికి ఇంటి నుంచే ఓటు వేసే సదుపాయాన్ని కల్పించనున్నట్లు తెలిపింది.

### మార్చి నెలాఖరుకు మెట్రోల డీపీఆర్లు

## పూర్తి చేయాలి

మొదటిపేజీ తరువాయి

ఎలైన్‌మెంట్ రూపొందించేటప్పుడే క్షేత్ర స్థాయిలో సమగ్ర పరిశీలన చేయాలన్నారు. మేడ్చల్ మార్గంలో ఎన్‌హెచ్ మార్గంలో ఇప్పటికే ఉన్న మూడు ఫ్లైఓవర్లను దృష్టిలో ఉంచుకొని మెట్రో లైన్ తీసుకెళ్లాలని సీఎం సూచించారు. ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణాన్ని సాధ్యమైనంత త్వరగా ప్రారంభించాలని సీఎం అధికారులను ఆదేశించారు. శామీర్‌పేట్, మేడ్చల్ మెట్రోలు ఒకే చోట ప్రారంభమయ్యేలా చూసుకోవాలని... అక్కడ అధునాతన వసతులు, భవిష్యత్ అవసరాలకు తగినట్లు భారీ జంక్షన్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ఆయా ప్రాంతాల వారు ప్రతి పనికి నగరంలోకి రానవసరం లేకుండా అక్కడే అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా ఆ జంక్షన్‌ను అభివృద్ధి చేయాలన్నారు. జంక్షన్‌కు సంబంధించిన పూర్తి ప్రణాళికను తయారు చేయాలని సీఎం ఆదేశించారు... హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్) కింద రేడియల్ రోడ్ల నిర్మాణం చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. సమీక్షలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (మౌలిక వసతులు) శ్రీనివాస రాజు, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, పురపాలక.. పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి దానకిశోర్, హైదరాబాద్ మెట్రో రైలు ఎండీ ఎన్.వి.ఎస్.రెడ్డి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాల కమిషనర్ శశాంక తదితరులు పాల్గొన్నారు.

## వివాదాస్పద స్వామీజీ ఆశారాంకు ఊరట



**ఢిల్లీ:** అత్యాచార కేసులో జీవితఖైదు అనుభవిస్తున్న వివాదాస్పద స్వామీజీ ఆశారాంకు ఊరట లభించింది. సుప్రీంకోర్టు ఆయనకు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అనారోగ్య కారణాల నేపథ్యంలో న్యాయస్థానం ఆశారాంకు మార్చి 31 వరకు బెయిల్ మంజూరు చేసింది. బెయిల్‌పై విడుదలైన ఆయన తన అనుచరులను కలవకూడదని కోర్టు ఆదేశించింది. అంతేకాక, ఆశారాం ఆస్పత్రికి వెళ్లేటప్పుడు భద్రత కల్పించాలే తప్ప ఆయన ఎక్కడికి వెళ్లాలో నిర్దేశించవద్దని పోలీసులను కోరింది. గుజరాత్ మోతేరాలోని ఆశారాం ఆశ్రమంలో పనిచేస్తున్న సమయంలో తనపై ఆయన పలుమార్లు అఘాయిత్యానికి పాల్పడినట్లు సూరత్‌కు చెందిన ఓ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేశారు. 2001 నుంచి 2006 మధ్య తనపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డారని ఆమె ఆరోపించింది. దీనిపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఆశారాంతో పాటు మరో ఏడుగురిపై కేసు నమోదు చేశారు.ఈ కేసులో గాంధీనగర్ సెషన్స్ కోర్టు ఆయనను దోషిగా తేల్చింది. మిగిలినవారికి సంబంధించి ఎలాంటి సాక్ష్యాధారాలు లేకపోవడంతో వారిని విడుదల చేశారు. అనంతరం ఆశారాంకు జీవితఖైదు విధిస్తూ తీర్పునిచ్చింది. కాగా.. జోధ్‌పూర్‌లోని ఆశ్రమంలో ఓ 16 ఏళ్ల బాలికపై అత్యాచారం కేసులోనూ ఆయన దోషిగా తేలారు. ఈ కేసులోనూ ఆయనకు జీవితఖైదు పడింది.

# బీజేపీ దిగజారుడు రాజకీయాలు చేస్తుంది

- బండి సంజయ్ కిషన్ రెడ్డిలు బీజేపీ కార్యకర్తలను రెచ్చగొట్టి,దాడులు చేయించారు
- అనుచిత వ్యాఖ్యలు చేసేది మీరే..రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసేది మీరేనా?
- ప్రియాంక గాంధీపై చేసిన వ్యాఖ్యలపై బీజేపీ అధిష్ఠానం సమాధానం చెప్పాలి
- కాంగ్రెస్ బలం ముందు బీజేపీ బలం సరిపోతుందా? : టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



**విశ్వంభర, హైదరాబాద్ :** బీజేపీ విలువలతో కూడిన రాజకీయాలు చేయకపోవడం దురదృష్టకరమని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి డిమాండ్ అన్నారు . గాంధీభవన్ లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ విలువలతో కూడిన రాజకీయాలు చేసే ప్రియాంక గాంధీ పై బీజేపీ నేత చేసిన అనుచిత వ్యాఖ్యలను తెలంగాణ బీజేపీ నాయకులు ఖండించాల్సింది పోయి,ప్రోత్సహించే విధంగా మాట్లాడటం సిగ్గుచేటన్నారు.

ప్రియాంక గాంధీ పై బీజేపీ నేత చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా యూత్ కాంగ్రెస్ నాయకులుబీజేపీ ఆఫీస్ ముట్టడికి ప్రయత్నించడం జరిగిందని తెలిపారు. ఈ ఘటనను పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఖండించడమే గాక మా యూత్ కాంగ్రెస్ కాంగ్రెస్ ను హెచ్చరించారని, కానీ బండి సంజయ్ కిషన్ రెడ్డిలు బీజేపీ కార్యకర్తలను రెచ్చగొట్టి, గాంధీభవన్ మీదికి పంపడం సరికాదన్నారు. కేంద్రమంత్రులుగా ఉండి కార్యకర్తలను సమన్వయం చేయాల్సింది పోయి, ప్రోత్సహించేలా వ్యవహరించారని, తప్పు ఎక్కడ జరిగిందో మీరే తెలుసుకోవాలని సూచించారు. అసలు బీజేపీ మాజీ ఎంపీ ప్రియాంక గాంధీని అవమానపరిచేలా మాట్లాడకపోతే ఏ గొడవ ఉండేది కాదని, అనుచిత వ్యాఖ్యలు చేసేది మీరే.. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసేది మీరేనా అని మండిపడ్డారు. మీరు రెచ్చగొడితే మా వాళ్లు రెచ్చిపోతారని, కాంగ్రెస్ బలం ముందు బీజేపీ బలం సరిపోతుందా అని సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రియాంక గాంధీపై చేసిన వ్యాఖ్యలపై బీజేపీ అధిష్టానం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇక ఈ ఘటనపై బీజేపీ నేతలు ఒక్కొక్కరు ఒక్కో విధంగా మాట్లాడుతున్నారని, బీజేపీ మహిళ నేతగా ఉన్న డీకే అరుణ ప్రియాంక గాంధీపై బిధూరీ చేసిన వ్యాఖ్యలను సమర్థిస్తారా అని ప్రశ్నించారు. ఇక రాజాసింగ్ గాంధీభవన్ ను పేలుస్తా అని మాట్లాడుతున్నారని, ముందు ఆయన బీజేపీ ఆఫీస్ లోకి ఎంట్రీ తెచ్చుకోవాలని, తర్వాత గాంధీభవన్ కు రావాలని జగ్గారెడ్డి ఎద్దేవా చేశారు.

డబుల్ బెడ్‌రూమ్ బాధితులకు

# న్యాయం చేయకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం

**- డిప్యూటీ కలెక్టర్‌కి వినతి పత్రం సమర్పించిన కార్మిక నాయకులు**



**విశ్వంభర, మహబూబ్‌నగర్:** 523 సర్వే నంబర్లో తమ భూముల్ని,పట్టా సర్టిఫికెట్లను ప్రభుత్వానికి సమర్పించి డబల్ బెడ్ రూంలు పొందుటకు అర్హులుగా నిర్ధారించబడిన వారికి తక్షణం డబల్ బెడ్ రూమ్ లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం జిల్లా డిప్యూటీ కలెక్టర్ మోహన్ రావుకి తెలంగాణ కార్మిక సంఘాల సమాఖ్య(టి ఎఫ్ టి యు )నాయకులు విజ్ఞాపన పత్రాన్ని సమర్పించారు.2018లో అప్పటి జిల్లా కలెక్టర్ రోనాల్డ్ రోస్ 523 సర్వే నంబర్ లోని పట్టా సర్టిఫికెట్లు కలిగిన లబ్ధిదారులందరూ తమ సర్టిఫికెట్లను ప్రభుత్వానికి స్వాధీనపర్చాలని ఆదేశించారు. ఆ విధంగా సర్టిఫికెట్లు స్వాధీన పరిచిన వారికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇస్తామని హామీ ఇచ్చారు. కలెక్టర్ గారి మాటల్ని నమ్మి ప్రజలు తమ పట్టా సర్టిఫికెట్లను ప్రభుత్వానికి స్వాధీనపరిచారు . ఈ విధంగా పట్టా సర్టిఫికెట్లు స్వాదీన పరిచిన వారిలో 887 మంది డబల్ బెడ్ రూమ్లు పొందుటకు అర్హులుగా నిర్ధారిస్తూ అధికారులు జాబితాను రూపొందించారు. కాని అర్హులకు డబల్ బెడ్ రూమ్ ఇవ్వకుండా మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆదేశానుసారం సొంత ఆస్తి మాదిరిగా డబల్ బెడ్ రూమ్ లను అర్హులు కాని వారికి పంచి పెట్టడం జరిగింది. అర్హులైన పేదలకు తీరని అన్యాయం చేశారు . అక్రమాలకు పాల్పడ్డ నాయకులపై, సంబంధిత అధికారులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని, అర్హులైన వారందరికీ తక్షణం డబల్ బెడ్ రూమ్ లు కేటాయించాలని, అర్బన్ మహబూబ్నగర్లో వేలాది ఎకరాల ప్రభుత్వ భూమి అక్రమాలకు గురై ఉంది వాటన్నిటిని ప్రజలకు పంచి డబల్ బెడ్ రూంలు నిర్మాణం చేసి ఇవ్వాలని, డబల్ బెడ్ రూమ్ కు 15 లక్షల రూపాయలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ టి ఎఫ్ టి యు నాయకులు వినతి పత్రాన్ని సమర్పించారు. తమ న్యాయమైన డిమాండ్ల యెడల ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని వారు విజ్ఞప్తి చేశారు. లేనియెడల ఈనెల 20 తారీకున మహబూబ్నగర్ అర్బన్ మండల తహసిల్దార్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున నిరసన తెలుపుతామని వారు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో టిఫ్టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖలీల్, ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి విజయకుమార్,పి యాదగిరి, జిల్లా నాయకులు జలాల్ పాషా తో పాటు ఇతర లబ్ధిదారులు పాల్గొనడం జరిగింది.

# ఢిల్లీలో పొగమంచు..
# 300 విమానాలు ఆలస్యం

**ఢిల్లీ:** ఉత్తరాదిలో దట్టమైన పొగమంచు కారణంగా విమానాలు, రైళ్ల సేవలకు ఆంటంకం కలుగుతోంది. దేశ రాజధానిలో ప్రతికూల వాతావరణం కారణంగా మంగళవారం 300 విమానాలు ఆలస్యంగా నడిచినట్లు అధికారులు వెల్లడించారు. అయితే, సాయంత్రం నుంచి దృశ్యస్పష్టత మెరుగుపడిందని, దీంతో అన్ని విమానాలు సాధారణంగానే రాకపోకలు సాగిస్తున్నాయని దిల్లీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు లిమిటెడ్ పేర్కొంది. విమానాల అప్‌డేటెడ్ సమాచారం కోసం ఆయా ఎయిర్‌లైన్స్‌ను సంప్రదించాలని ప్రయాణికులకు సూచించింది.అమృత్‌సర్, చండీగఢ్, పట్నా నగరాలకు వచ్చి పోయే విమాన సర్వీసులకు అంతరాయం కలుగుతున్నట్లు సమాచారం. దీంతో ఆయా మార్గాల్లో సేవలందించే విమాన సర్వీసులు ఎప్పటికప్పుడు అడ్వైజరీలు జారీ చేస్తున్నాయి. ఇదిలా ఉంటే, దిల్లీలోని ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు కార్యకలాపాలను డీఐఏఎల్ నిర్వహిస్తుంది. ఇక్కడ నుంచి నిత్యం 1300 విమాన సర్వీసులు రాకపోకలు సాగిస్తుంటాయి.

# రిటైర్మెంట్ తర్వాత హిమాలయాలకు..!

**- సీఈసీ రాజీవ్ కుమార్**




**న్యూఢిల్లీ:** కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పదవీ విరమణ తర్వాత తాను హిమాలయాలకు వెళ్లి కొన్ని నెలలు అక్కడే ఉంటానని వెల్లడించారు. తాను డీటాక్స్‌పై కావాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. ఫిబ్రవరి 18న రిటైర్మెంట్ కానున్న ఆయన.. దిల్లీ అసెంబ్లీ ఎన్నికలషెడ్యూల్ విడుదల సందర్భంగా పదవీ విరమణ తర్వాత ప్రణాళికలు ఏమైనా ఉన్నాయా? అని విలేకరులు అడిగిన ప్రశ్నకు ఇలా స్పందించారు.''నాకు కొంచెం ఏకాంతం, స్వీయ అధ్యయనం కోసం సమయం కావాలి. ఇందుకోసం మీ అందరికి దూరంగా వెళ్తా. హిమాలయాల్లో సుదూర ప్రాంతానికి వెళ్లి నాలుగు, ఐదు నెలలు అక్కడే ఉంటా. అనవసర అంశాల నుంచి పూర్తి విముక్తి పొందుతా'' అని రాజీవ్ కుమార్ పేర్కొన్నారు.

వ్యక్తిగత విషయాలు పంచుకున్న ఆయన.. తాను మున్సిపల్ స్కూల్లో చదువుకున్నానని చెప్పారు. చెట్టుకింద తరగతులు విన్న రోజులను గుర్తుచేసుకుంటూ.. ఏబీసీడీలను ఆరో తరగతిలో నేర్చుకున్నానని చెప్పారు. అందుకే అణగారిన వర్గాల చిన్నారులకు బోధించడం తనకెంతో ఇష్టమన్నారు. ఇదిలాఉంటే, రాజీవ్ కుమార్ బిహార్ కేడర్‌కు చెందిన 1984 ఐఏఎస్ అధికారి. కేంద్ర ఎన్నికల కమిషనర్‌గా సెప్టెంబర్ 2020లో బాధ్యతలు చేపట్టిన రాజీవ్ కుమార్.. మే 15, 2022 నుంచి సీఈసీగా కొనసాగుతున్నారు.

# 'హెచ్ఎంపీవీ'ని
# తేలిగ్గా తీసుకోవద్దు..



**బెంగళూరు:** దేశంలో హెచ్ఎంపీవీ కేసులు నమోదు కావడంపై ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. కర్ణాటకలో రెండు కేసులు వెలుగు చూడడంతో ప్రతిపక్ష బీజేపీ స్పందించింది. ఈ వైరస్‌ను అంత తేలిగ్గా తీసుకోవద్దని రాష్ట్రప్రభుత్వాన్ని హెచ్చరించింది. ''కొత్త వైరస్ పట్ల ప్రజలు భయాందోళనకు గురి కావొద్దనే ఉద్దేశంతోనే ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్ గుండూరావు మాట్లాడారు. కానీ, దాని ప్రభావం గురించి ఏం తెలియనప్పుడు హెచ్ఎంపీవీని తేలికగా తీసుకోవద్దు. ఈ వైరస్ చైనాలో బీభత్సం సృష్టిస్తోంది. అక్కడి చిన్నారులు ఆస్పత్రుల పాలయ్యారు. ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను అప్రమత్తం చేసింది'' అని ప్రతిపక్ష నేత ఆర్. ఆశోక విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు.

''ఈ అంటువ్యాధి వచ్చినప్పుడు కాకుండా రాకముందే జాగ్రతలు తీసుకోవాలి. ఈ వైరస్ ఊపిరితిత్తులపై ప్రభావం చూపుతున్నందున తగు జాగ్రత్తలు తీసుకోవాలి. హెచ్ఎంపీవీ ఎలా ఎదుర్కోవాలో తెలియజేయాలి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆక్సిజన్ సిలిండర్ల లభ్యత, ఐసీయూ బెడ్ల వంటి సదుపాయాలపై దృష్టి సారించాలి'' అని సూచించారు.

### మహారాష్ట్రలో రెండు హెచ్ఎంపీవీ వైరస్ కేసులు

కర్ణాటక, గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడుల్లో వైరస్ కేసులు వెలుగు చూశాయి. అయితే.. ఈ వైరస్ కొత్తదేమీ కాదని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా పేర్కొన్నారు. ఈ వైరస్‌ను 2001లోనే గుర్తించారని.. చాలా ఏళ్లుగా ఇది ప్రపంచవ్యాప్తంగా వ్యాప్తిలో ఉండదని తెలిపారు. ప్రస్తుత పరిస్థితిని ఎప్పటికప్పుడు ఆరోగ్యశాఖతో పాటు ఐసీఎంఆర్, ఎన్‌సీడీసీ నిశితంగా గమనిస్తున్నాయన్నారు.

# రైతాంగానికి భూభారతి ఒక భరోసా"

**- తెలంగాణ బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్**



**విశ్వంభర,హైదరాబాద్ :** రైతాంగానికి భూభారతి ఒక భరోసా లాంటి పథకం అని ఇది కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వేసిన మరొక ముందడుగు అని తెలంగాణ బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ అన్నారు. మంగళవారం ఆయన ప్రకటన విడుదల చేస్తూ 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రైతన్న సమస్యలను అర్థం చేసుకొని తప్పుల తడకగా ఉన్న ధరణిని రద్దు చేస్తామని ప్రకటించిందని, తమ ఎన్నికల మేనిఫెస్టోలో కూడా దాన్ని పొందుపరిచి ప్రజల సమక్షంలో దరిణిని బంగాళాఖాతంలో పడేస్తామని కాంగ్రెస్ పెద్దలు మాట్లాడినప్పుడు ప్రజల నుంచి విశేష స్పందన వచ్చిందని అన్నారు. ఫలితంగా ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం కొలువు దీరిందని ప్రజలకు ఇచ్చిన ఒక్కొక్క వాగ్దానాన్ని నెరవేర్చే క్రమంలో భాగంగా డిసెంబర్ 18న అసెంబ్లీలో ధరణిని రద్దు చేస్తూ దాని స్థానంలో నూతన ఆర్ఓఆర్ 2024 భూమాత బిల్లును తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. అసెంబ్లీలో దీని విధివిధానాలపై చర్చ జరిగిందని ధరణి కన్నా భూమాత మరింత మెరుగైందని అందుకే బిల్లు ఆమోదం పొందిందని అన్నారు.

తెలంగాణ మొత్తానికి భూ సర్వే చేయించాలనే అంశం ఆలోచింపజేసిందని, ఇది తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న మరొక నిరుపమానమైన చర్య అని అన్నారు. గత ధరణి పోర్టల్ లో రహస్యానికి చోటు ఉండేదని నిజానికి తెలంగాణ భూ సమాచార విషయంలో దాపరికాలు చారిత్రాత్మకంగా ఏమీ ఉండవని ఏ ఊరిలోకి వెళ్లిన ఈ భూమి ఎవరిది అని అడిగిన పూర్తి సమాచారం ప్రజల నోటితో చెప్పేస్తారని అటువంటి తెలంగాణలో భూవిషయంలో రహస్యం చేయడం వెనుక ఉన్న మతలబు ఎవరికీ అర్థం కాలేదని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. నేడు భూమాతలో ప్రతి విషయాన్ని నిర్భయంగా నిర్దిష్టంగా తెలుసుకునే అవకాశం కల్పించడం హర్షించదగ్గ విషయమని అన్నారు. రానున్న మూడు నెలల్లో మరిన్ని అంశాలను పొందుపరుస్తూ నిపుణుల నుండి మరికొన్ని సూచనలు సలహాలు తీసుకొని తెలంగాణ రైతాంగ సమస్యలు తీర్చేందుకు సులువైన మార్గాలను పొందుపరిచేందుకు ఈ ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. ప్రజల ఆశలను, ఆశయాలను చిగురింపచేశారని ప్రభుత్వం ప్రకటించిన విధంగా భూమాత పనిచేస్తే రైతులకు గొప్ప భరోసా కల్పించినట్లు అవుతుందని శ్రీకాంత్ గౌడ్ అన్నారు.

# ఆరోగ్య పరిరక్షణపై గీతంలో అంతర్జాతీయ సదస్సు



**విశ్వంభర, సంగారెడ్డి:** గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ, హైదరాబాద్ మరో అంతర్జాతీయ సదస్సు నిర్వహణకు సమాయత్తమవుతోంది. 'ఫార్మాస్యూటికల్, హెల్త్ సైన్సెస్ లో సమీకృత పోకడలు' అనే అంశంపై ఫిబ్రవరి 12 నుంచి 14 వరకు, మూడు రోజుల అంతర్జాతీయ సదస్సును నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని సదస్సు నిర్వాహకులు డాక్టర్ ప్రతీక్ పాఠక్, డాక్టర్ ఆశిష్ ఆర్ ద్వివేది మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. విశ్వవ్యాప్తంగా ఉన్న ప్రముఖ సంస్థల నుంచి గౌరవనీయమైన విద్యావేత్తలు, శాస్త్రవేత్తలు, పరిశోధకులను ఒకచోట చేర్చి, ఫార్మాస్యూటికల్, కెమికల్, బయోలాజికల్, హెల్త్ సైన్సెస్ లలో సమగ్ర పరిశోధనా పోకడల తాజా పురోగతులపై చర్చించనున్నట్లు తెలియజేశారు. ఆయా ప్రముఖుల వినూత్న ఆలోచనలను ఇతరులతో పంచుకోవడానికి ఒక వేదికను రూపొందించడం లక్ష్యంగా ఈ సదస్సును నిర్వహిస్తున్నామని చెప్పారు. సహజ, ఆరోగ్య శాస్త్రాలలో సమకాలీన పురోగతులు, సవాళ్లపై అమూల్యమైన అవగాహనను కల్పించడమే గాక, ఈ సదస్సులో ప్లీనరీ సెషన్ లు, కీలక ప్రసంగాలు, విశిష్ట నిపుణులతో చర్చలు ఉంటాయన్నారు.ప్రముఖ అంతర్జాతీయ వక్తలు అమెరికా (కాలిఫోర్నియా)లోని చాప్ మన్ విశ్వవిద్యాలయం ఫార్మసీ ప్రొఫెసర్ కీకావన్ పరంగ్, శ్రీలంకలోని వయాంబ విశ్వవిద్యాలయం ఆచార్యుడు డాక్టర్ ఎస్. జీవ తయాపరన్, సింగపూర్ లోని నాన్యాంగ్ సాంకేతిక విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ గావో యొంగ్గయ్, మలేషియాలోని అంతర్జాతీయ వైద్య విశ్వవిద్యాలయం ఆచార్యుడు డాక్టర్ త్యాగరాజన్ మాధేశ్వరన్, అమెరికాలోని సైటోమ్‌ఎక్స్ థెరప్యూటిక్స్ కు చెందిన డాక్టర్ రాఘవ శ్రీరామనేని, క్రోయేషియాలోని రూడర్ బోస్కావిక్ ఇన్ స్టిట్యూట్, ఇన్ఫర్మేషన్ అండ్ కంప్యూటింగ్ సెంటర్ కు చెందిన డాక్టర్ జురికా నోవాక్, దక్షిణ కొరియా చుంగ్ ఆంగ్ విశ్వవిద్యాలయం ఆచార్యుడు డాక్టర్ గంగరాజు గెడ్డ తదితరులు పాల్గొని తమ నైపుణ్యాలను సదస్యులతో పంచుకుంటారని వివరించారు. యువ శాస్త్రవేత్తలు తమ పరిశోనలను ప్రదర్శించడానికి, గుర్తింపు పొందేందుకు, ఉత్తమ పోస్టర్, బెస్ట్ ఓరల్ ప్రెజెంటేషన్, గౌరవనీయమైన యంగ్ సైంటిస్ట్ అవార్డులతో సహా ప్రతిష్ఠాత్మక అవార్డుల కోసం పోటీపడేందుకు కూడా ఈ సమావేశం ఒక అద్భుత అవకాశంగా నిర్వాహకులు పేర్కొన్నారు.ఫార్మాస్యూటికల్, హెల్త్ సైన్సెస్ లో సమగ్ర ధోరణులపై పరిశోధన పత్రాలను ఆహ్వానిస్తున్నామని, ఎంపిక చేసిన పత్రాలను స్కోపస్‌ఇండెక్స్డ్ జర్నల్ తో పాటు కాన్ఫరెన్స్ అబ్ స్ట్రాక్ట్ బుక్ లెట్ లో ప్రచురిస్తామని వారు తెలిపారు. అవసరమైన వారికి రోజువారీ అద్దె ప్రాతిపదికన వసతి సౌకర్యం కల్పిస్తామని తెలిపారు.

పేర్ల నమోదు, రుసుము, ఇతర వివరాల కోసం డాక్టర్ ప్రతీక్ పాఠక్, డాక్టర్ ఆశిష్ ఆర్ ద్వివేదిలను సంప్రదించాలని, లేదా healthcarenext2025@gitam.edu కు ఈమెయిల్ చేయాలని సూచించారు.


భారత్‌లో మైక్రోసాఫ్ట్

# 3 బిలియన్ డాలర్ల పెట్టుబడి


**: సీఈఓ సత్యనాదెళ్ల**

**బెంగళూరు:** ప్రముఖ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ భారత్‌లో భారీ పెట్టుబడి పెట్టనుంది. దేశంలో క్లౌడ్, కృత్రిమ మేధ సామర్థ్యాలను విస్తరించడం, డేటా సెంటర్ల విస్తరణ కోసం 3 బిలియన్ డాలర్లు పెట్టుబడిగా పెట్టనున్నట్లు కంపెనీ ఛైర్మన్, సీఈఓ సత్య నాదెళ్ల వెల్లడించారు. అలాగే, 2030 నాటికి 10 మిలియన్ల మందికి (కోటి మందికి) ఏఐ స్కిల్స్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రకటించారు. బెంగళూరు వేదికగా మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఈ మేరకు ఆయన ప్రకటన చేశారు.

ప్రస్తుతం భారత్ పర్యటనలో ఉన్న సత్య నాదెళ్ల సోమవారం ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. ఏఐ విషయంలో భారత్‌ను ఉన్నత స్థానంలో నిలిపేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ క్రమంలో బెంగళూరులో జరిగిన ఈవెంట్‌లో పెట్టుబడులపై ప్రకటన చేశారు. ఎప్పుడూ లేని స్థాయిలో భారత్‌లో 3 బిలియన్ డాలర్లు పెట్టుబడిగా పెడుతున్నందుకు సంతోషంగా ఉందని సత్య నాదెళ్ల తెలిపారు. ఈ పెట్టుబడి భారత్‌లో ఏఐ ఆవిష్కరణలకు ఊతం ఇస్తుందని తెలిపారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా నిలపాలన్న ప్రధాని మోదీ ఆలోచనల్లో కీలక భూమిక పోషిస్తుందన్నారు.







2020లో కరోనా దెబ్బకు ప్రపంచం అతలాకుతలమైంది. మరోసారి కొత్త మహమ్మారితో ఎలాంటి విధ్వంసం ఉంటుందోనని అందరూ భయపడుతున్నారు.చైనాలో పుట్టిన హ్యూమన్ మెటా నిమో వైరస్(హెచ్ఎంపీవీ) ఇప్పుడు భారత్‌ను తాకింది. కరోనాను మరచిపోకముందే హెచ్ఎంపీవీ కేసులు భారత్‌లో నమోదవుతుండటంతో సర్వత్రా భయాందోళనలు నెలకొన్నాయి. ఈ వైరస్ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది.. చైనా నుంచి ప్రపంచవ్యాప్తంగా వ్యాప్తి చెందుతున్న ఈ హెచ్ఎంపీవీ వైరస్ ఎంత ప్రమాదకరమో తెలుసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఈనేపథ్యంలో హెచ్ఎంపీవీపై విశ్వంభర ప్రత్యేక కథనం..

# మళ్లీ లాక్‌డౌన్ వస్తుందా?



## హెచ్ఎంపీవీ కలకలం.. భయాందోళనల్లో జనం..

### చైనాలో పుట్టి ప్రపంచాన్ని వణికిస్తున్న హ్యూమన్ మెటా నిమో వైరస్

### చైనాలో పెరుగుతున్న కేసులు.. సరిహద్దు దేశాల్లో ఆందోళన

### భారత్ లోనూ అడుగుపెట్టిన వైరస్..8 కేసులు నమోదు

ప్రాణాంతకమైన కరోనా మహమ్మారి వ్యాపించిన ఐదేళ్ల తర్వాత, మరో కొత్తరకం వైరస్ కేసులు చైనాలో నమోదవుతున్నాయి. ఈ కొత్త వైరస్ 14 ఏళ్ల లోపున్న పిల్లలపై ఎక్కువగా ప్రభావం చూపుతోంది.హ్యూమన్ మోటానిమో వైరస్ (హెచ్ఎంపీవీ) అనే కొత్త వైరస్‌కు చెందిన ఇన్‌ఫెక్షన్ కేసులు ఎక్కువగా ఉత్తర చైనాలో నమోదవుతున్నట్టు కథనాలు వస్తున్నాయి.ఈ వైరస్ సోకిన వ్యక్తులలో జలుబు, కోవిడ్-19 వంటి లక్షణాలు కనిపిస్తున్నాయని, ఇది వేగంగా వ్యాపిస్తోందని తెలుస్తోంది. చైనా సరిహద్దు దేశాలన్నీ దీనిపై తీవ్ర దృష్టిసారించాయి. అయితే, ప్రస్తుతం భయపడాల్సిన పరిస్థితి లేదని భారత ఆరోగ్య సేవల డైరెక్టర్ జనరల్ (డీజీహెచ్ఎస్) తెలిపారు.ఇదే సమయంలో, భారత కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ శనివారం డీజీహెచ్ఎస్ అధ్యక్షతన జాయింట్ మానిటరింగ్ గ్రూప్ సమావేశాన్ని ఏర్పాటు చేసింది.ఈ సమావేశంలో, విస్తృత స్థాయిలో చర్చలు జరిపిన తర్వాత, కొన్ని విషయాలను వారు అంగీకరించినట్లు తెలిసింది. చైనాలో ఈ పరిస్థితి సాధారణమైనదేనని, ఫ్లూ సీజన్‌లో హెచ్ఎంపీవీ ఒక సాధారణ వ్యాధి కారకమేనని పరిస్థితిని భారత ప్రభుత్వం నిశితంగా గమనిస్తోందని తెలిపింది.ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా సమయానికి అనుగుణంగా సమాచారాన్ని చేరవేయాలని చైనాను కోరింది.

**చైనా సరిహద్దు దేశాల్లో ఆందోళన**

చైనాలో ఇన్‌ఫ్లుయెంజా, ఇతర శ్వాసకోశ సంబంధిత వైరస్ కేసులు వ్యాపించడంపై ఇండోనేషియా ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆందోళన వ్యక్తం చేస్తూ ఓ ప్రకటన జారీ చేసింది.చైనాలో పరిస్థితి గురించి సోషల్ మీడియాలో వీడియోలు చక్కర్లు కొట్టగానే, ప్రజలు ఈ వైరస్ విషయంలో జాగ్రత్తగా ఉండాలని, మాస్క్‌లు ధరించడం, సోపుతో చేతులు కడుక్కోవడం వంటి ముందు జాగ్రత్తలు పాటించాలని ఆరోగ్య మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి విద్యావతి ప్రజలకు సూచించినట్టు ఇండోనేషియా వార్తా సంస్థ అంతారా పేర్కొంది. ''చైనాలో హెచ్ఎంపీవీ ఇన్‌ఫెక్షన్లు వ్యాపించడాన్ని ఇండోనేషియా పర్యవేక్షిస్తోంది. దేశంలోకి ప్రవేశించే మార్గాల వద్ద నిఘా వ్యవస్థను నిర్వహిస్తున్నాం. ఫ్లూ వంటి లక్షణాలతో విదేశాల నుంచి వచ్చే ప్రయాణికులను క్వారంటైన్‌లో ఉంచుతున్నాం'' అని తెలిపారు.హాంకాంగ్‌లో హెచ్ఎంపీవీ ఇన్‌ఫెక్షన్ కేసులు నమోదయ్యాయని, కానీ కొన్ని మాత్రమే రిపోర్టు అయినట్లు హాంకాంగ్ ఫ్రీ ప్రెస్ తెలిపింది.ఈ వైరస్ ఇన్‌ఫెక్షన్ కేసులు పెరగడం లేదని అక్కడి డాక్టర్లు పేర్కొన్నారు.

**'శీతాకాలంలో సహజమే'..**

ఉత్తరార్ధ గోళంలో శీతాకాలంలో శ్వాసకోశ సంబంధిత ఇన్‌ఫెక్షన్ కేసులు సహజమని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి మావో నింగ్ అన్నారు.''చైనాలో శీతాకాలంలో వచ్చే శ్వాసకోశ సంబంధిత వ్యాధుల నివారణ, నియంత్రణపై ఇటీవలే చైనా జాతీయ వ్యాధుల నియంత్రణ, నివారణ ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించి సమాచారం అందించింది'' అని తెలిపారు.గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది వ్యాధుల తీవ్రత, వ్యాప్తి తక్కువగా ఉందని పేర్కొన్నారు. చైనాకి సురక్షితంగా ప్రయాణించవచ్చని చెప్పారు.

**డాక్టర్లు ఏం చెబుతున్నారు?**

ఇది కొత్త వైరస్ కాదని దిల్లీలోని శ్రీ గంగా రామ్ హాస్పిటల్ పిడియాట్రిక్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన డాక్టర్ సురేష్ గుప్తా వార్తా సంస్థ పీటీఐకి చెప్పారు.''గత 20 ఏళ్లుగా ప్రజలకు ఈ వైరస్ తెలుసు. శీతాకాలంలో, ఈ ఇన్‌ఫెక్షన్ కేసులు నమోదవుతుంటాయి. ఇది ఫ్లూ వైరస్ లాంటిది. దీనికోసం, జలుబు, ఫ్లూలకు వాడే మందులు వాడాలి. అనారోగ్యంగా అనిపిస్తే, విశ్రాంతి తీసుకోవాలి. చాలా కేసుల్లో, ఈ ఇన్‌ఫెక్షన్‌కు ఆస్పత్రిలో చేరాలని సూచించం'' అని సురేష్ గుప్తా తెలిపారు.

**హెచ్ఎంపీవీ వైరస్ ఎలా పుట్టింది?**



200 నుంచి 400 ఏళ్ల క్రితం పక్షుల నుంచి ఈ వైరస్ పుట్టిందని సైన్స్ డైరెక్ట్‌లో ఉంది. కానీ, అప్పటి నుంచి ఈ వైరస్ పదేపదే మారుతోంది. ప్రస్తుతం పక్షులకు ఈ వైరస్ సోకడం లేదు.2001లో ఈ వైరస్‌ను మనుషుల్లో గుర్తించినట్టు అమెరికా ప్రభుత్వానికి చెందిన సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ (సీడీసీ) తెలిపింది.దీనివల్ల, జ్వరం, దగ్గు, ముక్కు దిబ్బడ, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తుతాయి.ఇన్‌ఫెక్షన్ పెరుగుతున్నప్పుడు, బ్రాంకైటిస్ లేదా న్యూమోనియాకు కూడా కారణం కావొచ్చు. ఈ వైరస్ ఇంక్యుబేషన్ పిరియడ్ సాధారణంగా మూడు నుంచి ఆరు రోజులు ఉంటుంది. అనారోగ్యం స్వల్ప కాలం లేదా దీర్ఘకాలం ఉండొచ్చు. ఇది ఇన్‌ఫెక్షన్ తీవ్రతను బట్టి ఉంటుంది.

**ఎలా సోకుతుంది?**

దగ్గు, ముక్కు కారడం వంటి సమయాల్లో విడుదలయ్యే లాలాజల కణాల ద్వారా ఈ వైరస్ వ్యాపిస్తుంది.షేక్ హ్యాండ్, కౌగలింత, ఒకరినొకరు తాకడం ద్వారా కూడా ఇది వ్యాపిస్తుంది.దగ్గు లేదా ముక్కు కారడం వల్ల ఏదైనా ఉపరితలంపై లాలాజల కణాలు పడినప్పుడు, వాటిని తాకిన చేతులతో ముఖం, ముక్కు, కన్ను,నోటిని ముట్టుకుంటే ఈ వైరస్ సోకుతుంది.

**జాగ్రత్తలు అవసరం**

ఈ హెచ్ఎంపీవీ వైరస్ కరోనా అంత ప్రాణాంతకం కాకపోవడం ఊరట కలిగించే విషయం. హెచ్ఎంపీవీ వైరస్ లక్షణాలు జలుబు, జ్వరం మాదిరిగానే ఉంటాయని డాక్టర్ స్టీఫెన్స్ చెప్పారు. హెచ్ఎంపీవీ వైరస్ పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని, భయపడాల్సిన అవసరం లేదని స్టీఫెన్స్ అంటున్నారు. దీనితో బాధపడుతున్న రోగులు కొంతకాలం విశ్రాంతి తీసుకోవాలని ఉపశమనం కలిగిస్తుందని అన్నారు. ఇప్పటికే శ్వాసకోశ వ్యాధి ఉన్నవారికి ఇబ్బందులు కలిగిస్తుందని స్టీఫెన్స్ పేర్కొన్నారు. అంతేకాకుండా రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న యువతపై కూడా ప్రభావం చూపుతుంది.

**వీరిపై ఎక్కువ ప్రభావం!**

అదే సమయంలో బ్రోన్కైటిస్, న్యుమోనియా వంటి వ్యాధులతో బాధపడేవారికి సులభంగా సోకుతుంది. బ్రోన్కైటిస్ అనేది ఒక రకమైన ఛాతీ ఇన్ఫెక్షన్, ఇది కొన్నిసార్లు బలహీనమైన రోగనిరోధక శక్తి వల్ల వస్తుంది. ప్రస్తుతం ఈ వ్యాధికి వ్యాక్సిన్ లేదని నిపుణులు చెబుతున్నారు. ఈ విషయంలో అప్రమత్తంగా ఉండటం చాలా ముఖ్యం. చిన్న పిల్లలు మరింత బలహీనంగా ఉంటారు. తల్లిదండ్రులు చాలా జాగ్రత్తలు తీసుకోవడం, సామాజిక దూరం పాటించడం అవసరం. అయితే హెచ్ఎంపీవీపై భయపడాల్సిన అవసరం లేదని ఎయిమ్స్ మాజీ డైరెక్టర్ రణదీప్ గులేరియా చెప్పారు. హెచ్ఎంపీవీ వైరస్‌ను తొలిసారిగా 2001లో గుర్తించారని అన్నారు. ఎప్పటి నుంచో ఇది కొనసాగుతోంది కానీ కరోనా అంత ప్రమాదకరం కాదన్నారు.

**పాత వైరస్సే!**

నాలుగేళ్ల క్రితం చైనాలో మొదలై ప్రపంచం మొత్తానికీ పాకి లక్షలాది ప్రాణాలు పోవడానికి కారణమైన 'సార్స్ కొవ్ 2' లాగా హెచ్ఎంపీవీ కొత్త వైరస్ కాదు. 2001లోనే గుర్తించిన 'కామన్ రెస్పిరేటరీ వైరస్' ఇది. చిన్నపిల్లల్లోనే కాదు.. రోగనిరోధక శక్తి సరిగ్గా లేకపోతే అన్ని వయసులవారిలో ఎగువ, దిగువ శ్వాసకోశ ఇన్ఫెక్షన్లకు కారణమవుతుంది. ఈ వైరస్ సోకితే.. జలుబులాంటి లక్షణాలు కనపడతాయి. ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో చలికాలంలో హెచ్ఎంపీవీ ఇన్ఫెక్షన్ కేసులు పెరుగుతుంటాయి. ఉదాహరణకు 2023లో ఆస్ట్రేలియాలో వారం వ్యవధిలోనే 1100కు పైగా కేసులు నమోదయ్యాయి. ఈ క్రమంలోనే చైనాలో కూడా చలి ఎక్కువగా ఉన్న ఉత్తరాది ప్రాంతాల్లో హెచ్ఎంపీవీ కేసులు పెరిగాయి. కరోనా సృష్టించిన విలయం నేపథ్యంలో.. చైనాలో హెచ్ఎంపీవీ కేసులు పెరుగుతున్నాయన్న వార్త ప్రపంచం మొత్తాన్నీ భయంలోకి నెట్టింది. ఇప్పటికే సీజనల్ వ్యాధిగా మారినందున.. హెర్డ్ ఇమ్యూనిటీ వచ్చేసి ఉంటుందని, ఇది కరోనాలాగా మహమ్మారిగా(పాండెమిక్) మారే ముప్పు లేదని వైద్యులు చెబుతున్నారు.

**కొవిడ్-19తో పోలిస్తే ఈ కొత్త వైరస్ ఎంతవరకు ప్రమాదకరం?**

కొవిడ్-19... యావత్ ప్రపంచం ఉన్నట్లుండి మందు లేని ఒక రోగం బారినపడితే ఎలా ఉంటుందో కళ్లకు కట్టినట్లు చూపించిన వ్యాధి అది. ప్రపంచదేశాలన్నీ మెడికల్ ఎమర్జెన్సీ బారినపడ్డాయి. మొదట ఆక్సీజన్ కోసం, తరువాత వ్యాక్సిన్ల కోసం ఎదురుచూడని మనిషి లేరు. కరోనా ఎంతోమందిని బలిగొంది. అయినవారిని చూస్తుండగానే కళ్ల ముందే తీసుకెళ్లిపోయింది. ఎవరిని ఎవ్వరూ ముట్టుకోలేని పరిస్థితి అది. ఇప్పుడు కొత్తగా వ్యాపిస్తున్న ఈ వైరస్ కూడా అంతే. ఒకరి నుండి మరొకరికి వ్యాపించే వైరస్ కావడంతో మళ్లీ పాత రోజులే వస్తాయా అనే భయం చాలామందిలో కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఆనాటి లాక్‌డౌన్లు, ఆకలి చావులు కళ్ల ముందు కదలాడుతున్నాయని జనం గుర్తుచేసుకుంటున్నారువాస్తవానికి హెచ్ఎంపీవీ వైరస్ ను గర్తించడం ఇదేం మొదటిసారి కాదు. 2001 లోనే తొలిసారిగా నెదర్లాండ్స్ లో చిన్న పిల్లలకు ఈ వైరస్ సోకినట్లు కనుగొన్నారు. మలేషియాలో 2023 లోనే 225 కేసులు నమోదయ్యాయి. గతేడాది మలేషియాలో 45 శాతం పెరిగి 327 కేసులకు చేరాయి. కానీ తాజాగా చైనాలో ఈ కేసుల సంఖ్య భారీగా పెరుగుతుండటమే ప్రస్తుత ఆందోళనకు కారణమైంది.

**హెచ్ఎంపీవీపై కర్ణాటక ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలు..**

జనసందడి ప్రదేశాల్లో అనవసరంగా తిరగరాదని, అప్పుడప్పుడు చేతులను సబ్బు, శానిటైజర్‌తో కడుక్కోవాలని, జ్వరం, దగ్గు, జలుబు ఉన్నవారు బయట తిరగకుండా ఇంట్లోనే ఉండి, చికిత్స పొందాలి.

వారు టవల్, దుస్తులను వేరుగా ఉంచుకోవాలి. బహిరంగ స్థలాల్లో తిరిగేటప్పుడు మాస్క్ తప్పనిసరిగా పెట్టుకోవాలి. బహిరంగ స్థలాల్లో ఉమ్మివేయరాదు. జలుబు, దగ్గు ఉంటే సొంత వైద్యం మానుకుని వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలి. ఇల్లు, చుట్టు ప్రక్కల ప్రదేశాల్లో కార్యాయాల్లో శుభ్రతను కాపాడుకోవాలి.పోషకాహారాన్ని సేవించాలి, పిల్లలు, వయో వృద్ధుల పట్ల జాగ్రత్త వహించాలి.



### భారత్ ఏమంటోంది?

చైనాలో హెచ్ఎంపీవీ ఇన్‌ఫెక్షన్ కేసులు పెరుగుతున్నట్లు కథనాలు రాగానే, భారత్‌లో కూడా దీనిపై ఆందోళనలు పెరిగాయి.అయితే, ఆందోళన చెందాల్సిన పరిస్థితి ఏమీ లేదని భారత ఆరోగ్య సేవల డైరెక్టర్ జనరల్ డాక్టర్ అతుల్ గోయల్ చెప్పారు.ఇప్పటి వరకు భారత్‌లో ఈ వైరస్ కేసులు నమోదు కాలేదని తెలిపారు.''శ్వాసకోశ సంబంధిత ఇన్‌ఫెక్షన్‌లో ఇది సాధారణమైన వైరస్. జలుబు, ఫ్లూ వంటి అనారోగ్యానికి ఇది కారణమవుతుంది. ఏడాది కంటే తక్కువ వయసున్న పిల్లల్లో, పెద్ద వారిలో ఈ ఇన్‌ఫెక్షన్ వల్ల ఫ్లూ వంటి లక్షణాలు కనిపిస్తాయి.'' అని చెప్పారు. ''ఇది తీవ్రమైన అనారోగ్యానికి దారితీయదు. భయపడాల్సిన అవసరం లేదు. శీతాకాలంలో, జలుబు, ఫ్లూ సాధారణం. ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకు ఆస్పత్రులు పూర్తి తరహాలో సిద్ధంగా ఉన్నాయి. డేటాను మేం నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. గత డిసెంబర్‌తో పోలిస్తే ఈ ఇన్‌ఫెక్షన్ సంఖ్య పెరగలేదు'' అని తెలిపారు.చైనాలో హెచ్ఎంపీవీ వైరస్ కేసులు పెరుగుతుండటంపై దృష్టి పెట్టినట్టు అంతకుముందు ఓ వార్తా సంస్థకు భారతీయ ఆరోగ్య శాఖ తెలిపింది.''హెచ్ఎంపీవీ వైరస్‌కు సంబంధించి చైనాలో శ్వాస కోశ సంబంధిత సమస్య కేసులు నమోదవుతున్నాయి. శీతాకాలంలో, శ్వాస సంబంధిత సమస్యలు భారత్‌లో కూడా వస్తుంటాయి. కానీ, ఇప్పటి వరకు ఈ కేసుల్లో ఎలాంటి పెరుగుదల లేదు'' అని ఇటీవల ఆరోగ్య మంత్రిత్వ శాఖ చెప్పింది.

**కేసుల నమోదుతో ఆందోళన**

చైనాలో హెచ్ఎంపీవీ కేసులు తీవ్రస్థాయిలో నమోదవుతున్నాయన్న ప్రచారం.. దానికితోడు మన దేశంలోనూ ఎనిమిది కేసులు నమోదయ్యాయన్న వార్తలతో జనంలో భయాందోళన వ్యక్తమవుతోంది. బెంగళూరు, మన దేశానికి సంబంధించి వైరస్ వ్యాప్తి అధికంగా లేకపోయినా, పాజిటివ్ కేసుల సంఖ్య అనూహ్యంగా పెరగకపోయినా.. ప్రసార మాధ్యమాలు, సోషల్ మీడియాలో దీనిపై ఆందోళనకర ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో మరీ భయపడాల్సిన అవసరం లేదని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. వైరస్ లక్షణాలు, ప్రస్తుత పరిస్థితి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేస్తున్నారు.

**అప్రమత్తమైన భారత్..**

చైనాలో హ్యూమన్ మెటాన్యూమో వైరస్ కేసులు పెరుగుతున్నప్పటి నుండే భారత్ అప్రమత్తమైంది. తాజాగా భారత్ లోనూ ఈ వైరస్ కేసులు నమోదవుతుండటంతో భారత వైద్య పరిశోధన మండలి ఈ విషయాన్ని మరింత సీరియస్ గా పరిగణిస్తున్నట్లు ప్రకటించింది. ఎటువంటి విపత్కర పరిస్థితినైనా ఎదుర్కోవడానికి భారత్ అన్నివిధాల సిద్ధంగా ఉందని ఇండియన్ మెడికల్ రిసెర్చ్ కౌన్సిల్ చెప్పింది. మరోవైపు దేశ రాజధాని ఢిల్లీ కేంద్రంగా రాకపోకలు సాగించే వారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది. ఇక్కడ వైరస్ వ్యాపించడం మొదలైతే దాని ప్రభావం అన్ని ప్రాంతాల కంటే ఎక్కువగా ఉంటుంది. ఆ ఇబ్బంది ఏ స్థాయిలో ఉంటుందో కొవిడ్ సమయంలోనే దేశమంతా చూసింది. అందుకే ఢిల్లీ సర్కార్ కూడా ఆరోగ్య శాఖను అప్రమత్తం చేసింది. అన్ని ఆస్పత్రులు సరిపడ ఆక్సీజన్ నిల్వలు ఉంచుకోవాలని, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాల్సిందిగా ఆదేశాలు జారీచేసింది.

**స్పందించిన తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు**

తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలు కూడా ఈ కొత్త వైరస్‌పై ఎప్పటికప్పుడు ఓ కన్నేసిపెట్టాయి. కేంద్ర ప్రభుత్వంతో ఆరోగ్య శాఖ సమన్వయం చేసుకుంటున్నట్లు తెలంగాణ పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డా బి రవిందర్ నాయక్ తెలిపారు. ఏపీ పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డా పద్మావతి కూడా ఇదే మాటన్నారు.

**వైరస్ వ్యాపించకుండా అడ్డుకోవడం ఎలా? తీసుకోవాల్సిన జాగ్రత్తలు:**

- దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు మీ నోరు, ముక్కును హ్యాండ్‌కర్చిఫ్ లేదా టిష్యూ పేపర్‌తో కవర్ చేసుకోండి.
- మీ చేతులను సబ్బుతో కడుక్కోవడం లేదా శానిటైజర్‌తో శుభ్రం చేసుకోవాలి.
- రద్దీగా ఉండే ప్రదేశాలకు వెళ్లకండి.
- జలుబు లాంటి ఫ్లూ సమస్యలతో బాధపడే వారి నుండి డిస్టన్స్ మెయింటెన్ చేయాలి.
- నీరు సమృద్ధిగా తాగండి. మంచి పౌష్టికాహారం తినండి.
- బయటి గాలి వచ్చేలా చక్కటి వెంటిలేషన్ ఉండేలా చూసుకోండి.
- ఒంట్లో నుస్తిగా ఉన్నట్లయితే బయట తిరగడం మానేయాలి.
- కంటి నిండా నిద్ర ఉండేలా చూసుకోవాలి.
- చేయకూడని పనులు:
- షేక్ హ్యాండ్ చేసుకోవడం మానేయాలి.
- వాడిన టిష్యూ పేపర్స్, కర్చీఫ్స్ రెండోసారి వాడకూడదు.
- ఫ్లూతో బాధపడుతున్న వారికి కొంత డిస్టెన్స్ ఉండేలా చూసుకోండి.
- తరచుగా నోరు, ముక్కు, కళ్లలో తాకకూడదు.
- బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మివేయరాదు.
- డాక్టర్‌ను సంప్రదించకుండా సొంతంగా మందులు వాడొద్దు.

**మళ్లీ లాక్‌డౌన్ వస్తుందా?**

ఇండియాలో మళ్లీ లాక్ డౌన్ వస్తుందా? ప్రస్తుత పరిస్థితి చూస్తోంటే చాలామందికి కలుగుతున్న సందేహం ఇది. ఇదే విషయమై అప్పుడే మీడియాలో, సోషల్ మీడియాలో రకరకాల కథనాలు కూడా ప్రారంభమయ్యాయి. ఇండియాలో లాక్‌డౌన్ వస్తుందా అనే ప్రశ్నకు ఇప్పటికిప్పుడైతే సమాధానం చెప్పలేం. ఎందుకంటే ఈ హ్యూమన్ మెటాన్యూమో వైరస్ వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారిని చావు అంచుల వరకు తీసుకెళ్లే ప్రమాదం ఉంది.అయితే, 2001 నాటి లాన్సెట్ గ్లోబల్ హెల్త్ డేటా ప్రకారం ఈ వైరస్ కారణంగా చనిపోయిన వారి సంఖ్య 1 శాతమే ఉంది. ఇకపై కూడా ఈ వైరస్ కారణంగా మరణాల సంఖ్య ఆ ఒక్క శాతానికే పరిమితమైతే ప్రపంచానికి ఈ వైరస్ పెద్ద సవాలుగా కనిపించకపోచ్చు.అయితే, ఇక్కడ ఒక సమస్య ఉంది. 2001 నాటి పరిస్థితులు ఇప్పుడు లేవు. కరోనావైరస్ వ్యాప్తి తరువాత ప్రపంచ జనాభా ఆరోగ్య పరిస్థితుల్లో పెనుమార్పులు జరిగాయి. కరోనా కొంతమందిని మరీ వీక్ చేసింది ఇంకొంతమంది ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించి వ్యాధి నిరోధక శక్తిని పెంచుకున్నారు. వ్యాధినిరోధక శక్తి లేని వారిపై ఈ వైరస్ ఈజీగా ఎటాక్ చేస్తుందని నిపుణులే చెబుతున్నారు. అందుకే ఇకపై హెచ్ఎంపీవీ కేసులు పెరిగితే పరిస్థితి ఎలా ఉంటుందనే ప్రశ్నలకు కాలమే సమాధానం చెప్పాలి.

### భారత్‌లో పెరుగుతున్న హెచ్ఎంపీవీ కేసులు

హెచ్ఎంపీవీ కేసులతో పెద్దగా భయపడాల్సిన అవసరం లేదంటున్నప్పటికీ ఈ కేసుల సంఖ్య భారత్‌లో క్రమేపీ పెరగడం మాత్రం ఆందోళన కల్గిస్తోంది. ఇప్పటివరకూ దేశ వ్యాప్తంగా 8 కేసులు నమోదయ్యాయి. నిన్న(సోమవారం) ఒక్కరోజే నాలుగు కేసులు నమోదు కాగా, నేటి(మంగళవారం) ఉదయానికి ఆ సంఖ్య డబుల్ అయ్యింది. తాజాగా మరో నాలుగు కేసులు చేరడంతో అమ్మో హెచ్ఎంపీవీ ఏం చేస్తుందనే భయం మాత్రం జనాల గుండెల్లో భయం పుట్టిస్తోంది. తాజాగా మహారాష్ట్రలో కేసులు నమోదయ్యాయి. రాష్ట్రంలోని నాగ్‌పూర్‌లో మరో రెండు కేసులు నమోదు కావడంతో ఈ కేసుల సంఖ్య భారత్లో ఎనిమిదికి చేరింది. ఇప్పటివరకు కర్ణాటక, గుజరాత్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో ఈ కేసులు నమోదు కాగా, అది ఇప్పుడు మహారాష్ట్రకు పాకడంతో కాస్త కలవరం ఎక్కువైంది.

### చైనాలో పెరుగుతున్న కేసులు..

సోషల్ మీడియాలో ఇటీవల చక్కర్లు కొట్టిన వీడియోల్లో, చైనాలో చాలా మంది రోగులు ఆస్పత్రుల వద్ద ఇబ్బంది పడుతున్నట్లు కనిపించింది. ఫ్లూ వంటి లక్షణాలు ఈ రోగుల్లో కనిపిస్తున్నట్లు ఆ వీడియోల్లో పేర్కొన్నారు.ఆ తర్వాత, చైనాలో ప్రజలకు మరోసారి కొత్త వైరస్ ముప్పు పొంచి ఉందనే ఆందోళనలు పెరిగాయి. ఐదేళ్ల క్రితం ప్రపంచాన్ని వణికించిన కరోనా వైరస్ కూడా చైనాలోని వూహాన్‌లో పుట్టిందని నమ్ముతున్నారు.చైనా ప్రభుత్వ వార్తా వెబ్‌సైట్ గ్లోబల్ టైమ్స్ పేర్కొన్న వివరాల ప్రకారం, ఉత్తర చైనాతో పాటు బీజింగ్, నైరుతి నగరం చాంగ్‌కింగ్, దక్షిణ చైనాలోని గ్వాంగ్‌డాంగ్ నగరంలో హెచ్ఎంపీవీ కేసులు నమోదవుతున్నట్లు తెలుస్తోంది. శీతాకాలంలో శ్వాసకోశ సంబంధిత వ్యాధుల కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ఒక పైలట్ నిఘా వ్యవస్థను ప్రారంభిస్తున్నట్లు చైనా ఆరోగ్య సంస్థలు పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఈ నిఘా వ్యవస్థ గురించి మాట్లాడుతూ, గుర్తు తెలియని కారణాలతో వచ్చే న్యూమోనియా కేసులను పర్యవేక్షిస్తామని చైనా జాతీయ వ్యాధుల నియంత్రణ, నివారణ అధినేత లి జెంగ్‌లాంగ్ చెప్పారు.చైనాలో డిసెంబర్ మూడో వారంలో, శ్వాసకోశ సంబంధిత వ్యాధుల వల్ల ఇబ్బంది పడుతున్న వారి సంఖ్య తీవ్రంగా పెరిగిందని చైనా ప్రభుత్వం ఓ ప్రకటన జారీ చేసిందని రాయిటర్స్ తన కథనంలో పేర్కొంది.నమోదవుతున్న కేసుల్లో రైనో వైరస్, హ్యూమన్ మోటానిమోవైరస్ (హెచ్ఎంపీవీ) ఇన్‌ఫెక్షన్ కేసులు ఎక్కువగా ఉన్నట్టు రాయిటర్స్ తన రిపోర్టులో పేర్కొంది.ఈ ఇన్‌ఫెక్షన్ కేసులు ఎక్కువగా ఉత్తర ప్రావిన్స్‌లలో నమోదవుతున్నాయి. 14 ఏళ్ల లోపున్న చిన్నారులు ఎక్కువగా దీనికి ప్రభావితులు అవుతున్నారు.హ్యూమన్ మెటానిమో వైరస్ మూలం గురించి ఇప్పటి వరకు ఎలాంటి సమాచారం లేదని ఈ రిపోర్టు పేర్కొంది.

### కరోనాలాంటి భయం


ఈ వైరస్ పిల్లలపై ఎక్కువగా ప్రభావం చూపుతుందని ఆస్ట్రేలియా ప్రజారోగ్య విభాగానికి చెందిన డాక్టర్ జాక్వెలిన్ స్టీఫెన్స్ అంటున్నారు. ముఖ్యంగా దగ్గు, జలుబు, న్యుమోనియా వంటి సమస్యలతో బాధపడే పిల్లలు. కరోనా వంటి జాగ్రత్తలు కూడా దీనికి అవసరమని ఆయన అంటున్నారు. ఒకే ఒక తేడా ఏమిటంటే కరోనావైరస్ పిల్లలను ఎక్కువ బాధితులుగా మార్చలేదు, కానీ ఈ వైరస్ చిన్న పిల్లలు, వృద్ధులకు ఎక్కువగా హాని కలిగిస్తుందని స్టీఫెన్స్ అన్నారు. చైనాలో ఈ వ్యాధి బారిన పడిన వారు పెద్ద సంఖ్యలో ఆసుపత్రులకు చేరుకుంటున్నారని, అందుకే ప్రపంచవ్యాప్తంగా కరోనా వంటి మహమ్మారి భయం ఉందన్నారు. అయితే దీనిపై చైనా విదేశాంగ మంత్రి మావో నింగ్ ను ప్రశ్నించగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు.

### వైద్య నిపుణులు ఏమంటున్నారంటే..

హెచ్ఎంపీవీ విషయంలో జరుగుతున్న ప్రచారం హడలెత్తిస్తోందని... కానీ మరీ అతిగా భయాందోళన అవసరం లేదని వైద్య నిపుణులు అంటున్నారు. గత యాభై, ఆరవై ఏళ్లుగా ఈ వైరస్ వ్యాప్తిలో ఉందని.. ఇది కరోనా తరహాలో మహమ్మారిలా మారే ప్రమాదం లేదని వారు చెబుతున్నారు. మాస్కులు, శానిటైజర్లు వంటివి వినియోగించడం, పరిశుభ్రత పాటించడం ద్వారా ఈ వైరస్‌కు దూరంగా ఉండవచ్చని అంటున్నారు. అలాగని నిర్లక్ష్యం వహించవద్దని, తగిన అప్రమత్తతతో మసలుకోవాలని స్పష్టం చేస్తున్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు, రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు మాత్రం జాగ్రత్తగా ఉండాలని చెబుతున్నారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు

**ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**



**విశ్వంభర, భూపాలపల్లి:** అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రజా ప్రభుత్వ ఏకైక లక్ష్యమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మంగళవారం భూపాలపల్లి నియోజకవర్గం మొగుళ్లపల్లి మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన మొత్తం 36 మంది కళ్యాణలక్ష్మీ మరియు షాదీముబారక్ లబ్దిదారులకు రూ.36,04,176 విలువైన చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వంలో పేద ప్రజలందరికీ న్యాయం జరుగుతుందని తెలిపారు. ప్రజాపాలనలో అర్హులైన వారికి అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. మహిళలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందన్నారు. గత ప్రభుత్వం పదేళ్లు అధికారంలో ఉండి ఏమీ చేయలేక, ప్రజా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే దిగజారుడు ఆరోపణలు చేస్తున్నారని ఎమ్మెల్యే ఆరోపించారు. రూ.7 లక్షల కోట్ల అప్పుల్లో ఉన్నా రాష్ట్రాన్ని పాలిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వంలో ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు రోజుకు 18 గంటల కష్టపడుతున్నట్లు తెలిపారు. మొగుళ్లపల్లి మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపులే పాఠశాలను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు స్థానిక కాంగ్రెస్ నేతలతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదుల్లో తిరుగుతూ విద్యార్థుల సమస్యలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు వారి ఎదుర్కొంటున్న సమస్యలను విని, వాటిని త్వరలోనే పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. ప్రధానంగా నీటి సమస్య ఉందని విద్యార్థులు తెలుపగా, మిషన్ భగీరథ డీఈఈ సంధ్యకు ఎమ్మెల్యే ఫోన్ చేసి మిషన్ భగీరథ నీటిని రెగ్యులర్ గా ఇచ్చేలా చూడాలని కోరారు. అనంతరం ఈడబ్ల్యూఐడీసీ ఏఈ జీవన్‌కు ఎమ్మెల్యే ఫోన్ చేసి స్కూల్లో స్టూడెంట్స్ ఎదుర్కొంటున్న సమస్యలు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన ఎస్టిమేట్స్‌లను వేసి తీసుకురావాలని ఆదేశించారు.

## పోలింగ్ కేంద్రాల వారిగా వివరాల వెల్లడి



**విశ్వంభర, భూపాలపల్లి:** భూపాలపల్లి జిల్లా ఓటర్ల తుది జాబితా-2025 ను కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాల వారీగా వివరాలను సోమవారం జిల్లా కలెక్టర్ వెల్లడించారు. నూతన జాబితా తయారీలో భాగంగా గత సంవత్సరం ఆగస్టు 20వ తేది నుంచి అక్టోబరు 18వ తేది వరకు బీఎల్ఓ(బూత్ లెవల్ ఆఫీసర్) ఇంటింటి సర్వే నిర్వహించారు. మృతులు, వలస ఓటర్ల తొలగింపుతో పాటు, ఈ ఏడాది జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన యువతకు కొత్తగా ఓటుహక్కు కల్పించేందుకు ఫాం-6 దరఖాస్తులు స్వీకరించారు. రెండు నెలల పాటు కొనసాగిన సర్వేతో పాటు.. ఆన్లైన్లో వచ్చిన దరఖాస్తులపై విచారణ చేపట్టారు. ఆయా వివరాలతో గతేడాది అక్టోబరు 29న ఓటరు ముసాయిదా జాబితా విడుదల చేశారు. దీనిపై వచ్చిన అభ్యంతరాలతో పాటు కొత్తగా మార్పులు, తొలగింపునకు వచ్చిన అర్జీలను విచారించి తుది జాబితా 6వ తేదీ సోమవారం ప్రచురించినట్లు భూపాలపల్లి జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు.

## ఘనంగా ఆశా డే కార్యక్రమం



**విశ్వంభర, మహబూబాబాద్:** ఆశా డే కార్యక్రమాన్ని మంగళవారం కురవి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాతా శిశు సంరక్షణ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సారంగం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కురవి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని గర్భిణీ స్త్రీలను ప్రభుత్వ ఆసుపత్రి ప్రసవాలకు ప్రోత్సహించాలని అదేవిధంగా సాదారణ ప్రసవాలను ప్రోత్స హించుటకు గర్భిణీ స్త్రీలను మరియు వారి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో గత నెలలో జరిగిన అబార్షన్ల పై సమీక్షించి క్షేత్రస్థాయిలో ఆశా కార్యకర్తలు మరియు ఆరోగ్య కార్యకర్తలు మొదటి కాన్పులో ఆడపిల్లలు ఉండి రెండోసారి గర్భం దాల్చిన వారిపై గట్టి నిఘా ఉంచాలని, సికిల్ సెల్ ఎనీమియా స్క్రీనింగ్ కేసులను 100 శాతం పూర్తి చేయాలని, వ్యాధి నిరోధక టీకాలను 100 శాతం చేయాలని, అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ సుదీర్ రెడ్డి, జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మలహార్ లో మంత్రి శ్రీధర్ బాబు పర్యటన



**విశ్వంభర, మలహర్:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మలహర్ మండలం, కొయ్యూరు గ్రామంలో మంగళవారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన అంబులెన్స్‌ను, అంగన్వాడీ సూపర్ వైజర్లు కు ఈ సీ ఐ ఎల్ సీఎస్ఆర్ నిధులతో ఎలక్ట్రానిక్ స్కూటీలను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉండటానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఈ అంబులెన్స్ అందుకు నిదర్శనమని పేర్కొన్నారు. అనంతరం యాస్పిరేషన్ బ్లాక్ ప్రోగ్రాంలో భాగంగా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్వాడి సూపర్వైజర్లకు ఎలక్ట్రానిక్ స్కూటీలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ద్వారా అంగన్వాడి సిబ్బంది సేవలను మరింత మెరుగు పరచేందుకు అవకాశం ఉందని మంత్రి పేర్కొన్నారు. జిల్లాలోని రెండు అంగన్వాడీ కేంద్రాల ప్రాజెక్టు పరిధిలోని సూపరవైజర్లుకు స్కూటీలు అందచేస్తున్నట్లు తెలిపారు. మాలహర్ మండలానికి 5, భూపాలపల్లికి 15 స్కూటీ లు అందచేస్తున్నట్లు తెలిపారు. మాలహర్ మండల పరిదిలో 227 కేంద్రాలున్నాయని అన్ని కేంద్రాలను కవరు చేయాలని ఆయన సూచించారు. అంగన్వాడి పిల్లలకు ఏకరూప దుస్తులను పంపిణీ చేసిన అనంతరం మంత్రి చిన్నారులతో కొద్దిసేపు ముచ్చటించారు. పిల్లల ఆరోగ్య పరిరక్షణలో అంగన్వాడి కేంద్రాల ప్రాధాన్యతను ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ అధికారి చిన్నయ్య, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ వాలీబాల్ ఛాంపియన్ షిప్ ట్రోఫీకి క్రీడాకారుల ఎంపిక



**విశ్వంభర, సరూర్ నగర్:** వాలీబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆడహాక్ బాడీ నిర్వహిస్తున్న సీనియర్ జాతీయ వాలిబాల్ ఛాంపియన్ షిప్ పోటీలకు తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ వాలిబాల్ అకాడమీ నుంచి ఆరుగురు క్రీడాకారులు ఎంపిక అయ్యారు. రాజస్థాన్ లోని జైపూర్ లో ఈ నెల 7 నుండి 13 వరకు ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. సరూర్ నగర్ ఇండోర్ స్టేడియం లో మంగళవారం వాలిబాల్ అకాడమీ కోచ్ మోహన్ కుమార్ ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా మోహన్ కుమార్ మాట్లాడుతు అంతర్జాతీయ పోటీలల్లో పథకాలు సాధించడమే ధ్యేయంగా క్రీడాకారులను తీర్చి దిద్దుతున్నామని తెలిపారు. సీనియర్ వాలిబాల్ పురుషుల జట్టుకు బి మధు, సిరిల్ రెడ్డి, పరహాన్ ఖాన్, హబీబ్, ప్రశాంత్ లు మహిళ ల జట్టుకు హారిక ఎంపిక అయ్యారని వివరించారు.

## పసునూరు మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



**విశ్వంభర, నాగారం:** తెలంగాణ మోడల్ స్కూల్ పసునూరు నందు 6 నుండి 10 వ తరగతి వరకు ప్రవేశానికి దరఖాస్తులు ఈ నెల 6 వ తేది నుండి ఫిబ్రవరి 28 వరకు స్వీకరించబడతాయని ప్రిన్సిపల్ చంద్రమౌళి అన్నారు. ఈ దరఖాస్తులు ఆన్లైన్ ద్వార మాత్రమే చేసుకోవాలి. ప్రవేశ పరీక్ష ద్వార 6 వ తరగతి లో 100 సీట్లు, 7 నుండి 10 తరగతులలో ఖాళీ సీట్లు భర్తీ కానున్నాయి. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 13 న 6 వ తరగతి వారికి ఉదయం 10 గంటల నుండి 12 గంటలవరకు, 7 నుండి 10 వ తరగతి వారికి 2 గంటల నుండి 4 గంటల వరకు స్థానిక తెలంగాణ మోడల్ స్కూల్లో నిర్వహించడం జరుగుతుందని ప్రిన్సిపల్ చంద్రమౌళి తెలాపారు. పసునూరు మోడల్ స్కూల్ నందు అత్యాధునిక సైన్స్ ల్యాబ్ లు, విశాలమైన తరగతి గదులు, సౌకర్యవంతమైన టాయిలెట్స్, అహలాధాకరమైన గార్డెన్ వంటి అదనపు సౌకర్యాలతో, కార్పొరేట్ హంగులతో పాఠశాల నిర్వహణ జరుగుతుందన్నారు. ఇప్పకే ఇంగ్లిష్ మీడియం లో అనుభవం ఉన్న టీచర్స్ తో విద్యాబోధన, ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటుబుక్స్, ఏకరూప దుస్తులు, మధ్యాహ్నం భోజనం, వృత్తి విద్యా కోర్సులు విద్యార్థులకు అందుబాటులో వున్నాయని ప్రిన్సిపల్ తెలిపారు.

## రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

**సీఐ రఘువీర్ రెడ్డి**




**విశ్వంభర, నాగారం:** నిబంధనలు అతిక్రమించి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు అని, వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలి అని నాగారం సర్కిల్ సీఐ రఘువీర్ రెడ్డి అని అన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లా ఎస్పీ, డీఎస్పీ ఆదేశాల మేరకు సూర్యాపేట- జనగాం జాతీయ రహదారి 365 బి పై నాగారం మండల కేంద్రం నాగారం పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో డ్రైవర్లకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేసి మాట్లాడుతూ వాహనదారులు ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటించాలి. ఎవరూ కూడా నిబంధనలు అతిక్రమించి అతివేగంగా ప్రమాదకరమైన డ్రైవింగ్ చేస్తూ మద్యం సేవించి రాంగ్ రూట్లో వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దన సూచించారు. భద్రత నియమాలు పాటించకుండా రోడ్డు ప్రమాదాలకు గురి అయితే తమ కుటుంబాలు పరిస్థితి ఏ విధంగా ఉంటుందో అర్థం చేసుకోవాలని ఆలాంటి పరిస్థితులు రాకుండా ఉండాలంటే రోడ్డు భద్రత నియమాలు పాటించడం ద్విచక్ర వాహనాలు నడుపుతున్నప్పుడు ఎలిమెంట్ ధరించడం ముఖ్యమని సూచించారు. రోడ్డు నియమ నిబంధనలు పాటించకుండా ఎవరైనా ఉన్నట్లయితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జమీందారు వల్కి వెంకన్న, వీరన్న, సైదులు, రాము, నరసింహారావు పాల్గొన్నారు.

## ఉత్తమ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డు అందుకున్న రమణారెడ్డి



**విశ్వంభర, సరూర్ నగర్:** విద్య రంగంలో అత్యుత్తమ నాణ్యత ప్రమాణాలు పాటించి విద్యార్థులకు నాణ్యమైన భోధన అందించిన ఆర్ ఆర్ అపోలో మెడికల్ అకాడమీ ఛైర్మన్ రమణ రెడ్డి ఉత్తమ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డును అందుకున్నారు. మంగళవారం హైబిజ్ టీవీ, టివీ 5 సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవార్డు కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా శాంత బయో టెక్ ఎండి వరప్రసాద్ రెడ్డి, మల్లారెడ్డి విశ్వ విద్యా పీఠ్ వైస్ ఛైర్మన్ డా. సి హెచ్ ప్రీతీ రెడ్డి, భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్య చేతుల మీదుగా హై టెక్ సిటీలోని నోవాటెల్ హొటల్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రమణారెడ్డి అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవార్డు రావడం పట్ల మరింత బాధ్యత పెరిగిందన్నారు. ఇదే నూతన ఉత్సహంతో మరింత మంది పేద విద్యార్థులకు మెడికల్ లో సీట్లు సాధించే విధంగా విద్యా భోధన అందిస్తానని తెలిపారు. ఈ కార్ర్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఈవి నర్సింహా రెడ్డి, సెయింట్ గ్రూప్ ఫౌండేషన్ ఛైర్మన్ బీవీఆర్ మోహన్ రెడ్డి, లైఫ్ స్పాన్ మేనేజింగ్ డైరెక్టర్ నరేంద్ర రామ్, మెట్రో ఇండియా, ఇంటర్ కాంటినెంటల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, విజయ క్రాంతి, ఎండి చిల్లప్ప గిరి, విజయ పాల్గొన్నారు.

## డిమాండ్స్ డే ధర్నాకు తరలి రావాలి: ఏఐయూకేఎస్



**విశ్వంభర, నెల్లికుదురు:** జిల్లా కేంద్రం మానుకోటలో జనవరి 9 న, నిర్వహించే ఆలిండియా డిమాండ్స్ డే ధర్నాకు భారీగా తరలిరావాలని అఖిల భారత యునైటెడ్ రైతు సంఘం తొర్రూరు డివిజన్ కార్యదర్శి జక్కుల యాకయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని మేచరాజు పల్లి లో మంగళవారం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పోడు భూములకు పట్టాలివ్వాలని, 10 ఎకరాల వరకు సాగు రైతులందరికీ రైతు భరోసా ఇవ్వాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేశవులు, రవీందర్, కొమురయ్య, సాంబయ్య, యాకయ్య, వెంకన్న, వీరన్న పాల్గొన్నారు.

## రైతులకు బీజేపీ అండగా..



**విశ్వంభర, భూపాలపల్లి:** భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలోని కాలేజీ గ్రౌండ్‌లో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి కి.శే మంథని రాజేందర్ స్మారక క్రికెట్ టోర్నమెంట్ ను బీజేపీ పెద్దపెల్లి జిల్లా అధ్యక్షులు, మంథని నియోజకవర్గ ఇంచార్జి చంద్రుపట్ల సునీల్ రెడ్డి, రాష్ట్ర నాయకులు చల్ల నారాయణ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాదేవపూర్ మండల కేంద్రంలోని ఎలకేశ్వరం గ్రామంలో చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు కెనాల్ కోసం రైతులు సాగుచేసే భూములు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, పోలీస్, రెవిన్యూ వారిని పెట్టి రైతుల భూములు లాక్కుంటున్నారని, వారికీ వెంటనే నష్ట పరిహారం చెల్లించాలని,అలాగే కలెక్టర్ తో కూడా మాట్లాడుతామని, రైతులకు అన్నీ విధాలుగా బీజేపీ అండగా ఉంటుందని చెప్పారు. మహాదేవపూర్ మండల కేంద్రంలో ఎంఆర్పీఎస్ ఎస్సీ వర్గీకరణలో భాగంగా మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు కళాకారులతో కలిసి లక్ష డప్పులు, వెయ్యిల గొంతుకలు అనే నినాదంతో ఎస్సీ వర్గీకరణ త్వరగా పూర్తి చేయాలనీ కోరుతూ మహాదేవపూర్ మండల కేంద్రం నుండి హైదరాబాద్ వరకు తరలుతున్న యాత్ర లో వారికీ మద్దతుగా బీజేపీ నాయకులు పాల్గొన్నారు. వారితో పాటు మహాదేవపూర్ బీజేపీ మండల అధ్యక్షులు ఆకుల శ్రీధర్, మండల ప్రధాన కార్యదర్శి సూరం మహేష్ రెడ్డి, మహాదేవపూర్ బీజేపీ మాజీ అధ్యక్షులు సిరిపురం శ్రీమన్నారాయణ, యువమోర్చ జిల్లా ఉపాధ్యక్షులు లింగంపెల్లి జోగేశ్వర్ రావు, బీజేవైఎం మండల అధ్యక్షులు రాంశెట్టి మనోజ్, బీజేపీ నాయకులు కన్నెబోయిన ఐలయ్య, కొక్కు శ్రీనివాస్, సాగర్ల రవీందర్, ఆడప లక్ష్మినారాయణ, వంశీ తదితురులు పాల్గొన్నారు.

## అధికార మదంతో రౌడీలా రెచ్చిపోతున్న కాంగ్రెస్ నాయకులు

**బీజేపీ హుజూర్ నగర్ పట్టణ అధ్యక్షుడు ఇంటి రవి ముదిరాజ్**



**విశ్వంభర, హుజూర్ నగర్:** రాష్ట్రంలో అధికారంలో ఉన్నామని తల బిరుసుతో ఇలాంటి చిల్లర వేషాలేస్తే భారత జనతా పార్టీ చూస్తూ ఊరుకోదని బీజేపీ హుజూర్ నగర్ అధ్యక్షుడు ఇంటి రవి ముదిరాజ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చటం ప్రభుత్వ అన్ని అంశాలలో ఫెయిల్ అయింది. గుండాల మాదిరిగా వ్యవహరిస్తే తరిమి తరిమి కొడతామని ఈ సందర్భంగా హుజూర్ నగర్ పట్టణ అధ్యక్షుడు ఇంటి రవి ముదిరాజ్ అన్నారు. భారతీయ జనతా పార్టీ కార్యకర్తల ముందు ఈ వేషాలు పనిచేయమని భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో లక్ష్మణ్, గోపి, విజయ్, కంటూ.నాగరాజు, నరసింహ, సాయి, సిసింద్రీ, నగేష్, ఉపేందర్, బలవంత్ సింగ్ పాల్గొన్నారు.

## జర్నలిస్టు ముకేశ్ చంద్రకర్ హత్య పిరికిపంద చర్య

- దోషులను కఠినంగా శిక్షించాలి
- తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ యూనియన్ డిమాండ్




**విశ్వంభర, భూపాలపల్లి:** చత్తీస్గఢ్ జర్నలిస్టు ముకేశ్ చంద్రకర్ హత్య చేయడం పిరికి పందల చర్య అని, దోషులను కఠినంగా శిక్షించాలి అని తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ యూనియన్ ఎన్.యు.జె (ఐ) స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పావుశెట్టి శ్రీనివాస్, జయశంకర్ జిల్లా అధ్యక్షులు ఎడ్ల సంతోష్, జిల్లా ప్రధాన కార్యదర్శి జల్దీ రమేష్ లు యూనియన్ తరుపున డిమాండ్ చేశారు. మంగళవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కాకతీయ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. వాస్తవాలను వెలికి తీసే జర్నలిస్టులను హత్యాలతో, భౌతిక దాడులతో భయభ్రాంతులకు గురి చేయాలను కోవడం అవినీతిపరుల అవివేకమే అవుతుంది తప్ప, హత్యలు, భౌతిక దాడులకు జర్నలిస్టులు భయపడరనే విషయాన్ని ప్రభుత్వాలు గుర్తెరగాలని హెచ్చరించారు. ప్రభుత్వ యంత్రాంగంలో భాగమైన అవినీతి కాంట్రాక్టర్ల తీరును, వారికి కాపలా కాస్తున్న ప్రభుత్వ యంత్రాంగంను తీరును తీవ్రంగా వ్యతిరేకిస్తూ దోషులకు కఠినంగా శిక్షించాల్సిందిగా యూనియన్ పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ దారుణ హత్య వ్యవహారంలో విచారణను వేగవంతం చేసేందుకు కాలపరిమితి విధించాలని, హంతకులను చట్ట ప్రకారం శిక్షించాలని టీ.ఎస్.జే యూ డిమాండ్ చేస్తుందన్నారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జరల్నిస్టుల భద్రత కోసం ప్రత్యేక చట్టం అంశాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ముకేశ్ చంద్రకర్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

## ఐనవోలు జాతరపై ఎమ్మెల్యే సమీక్ష




**విశ్వంభర, వరంగల్:** భక్తులు లక్షలాదిగా తరలి వచ్చే ఐనవోలు మల్లిఖార్జున స్వామి వారి జాతరకు సంబంధించి ఏర్పాట్లపై మంగళవారం ఆలయ ప్రాంగణంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో వీడియో కాన్ఫరెన్స్ లో గౌరవ అటవీ దేవాలయ ధర్మదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పాల్గొని పలు సూచనలు చేశారు. ఈ సమీక్ష సమావేశంలో వరంగల్ కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, నగర మేయర్ గుండు సుధారాణి టెస్కాబ్ ఛైర్మన్ మార్నేని రవీందర్ రావు జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తనాజీ వాకాడే తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ..భక్తులు లక్షలాదిగా తరలి వచ్చే ఐనవోలు మల్లిఖార్జున స్వామి వారి జాతరను జిల్లా ఉన్నతాధికారులు, ఎండోమెంట్ అధికారులు, ప్రజా ప్రతినిధులు సమష్టిగా పనిచేసి జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా సంతృప్తి కలిగేలా శాశ్వత ఏర్పాట్లు చేయాలని సూచించారు. ముఖ్యంగా మంచి నీరు వసతి, మరుగు దొడ్లు, పారిశ్యుద్యం, క్యూ లైన్ల క్రమబద్ధీకరించి అందులో వేచి ఉన్న భక్తులకు మంచి నీటి వసతి, మహిళా భక్తుల సౌకర్యార్థం జల్లు స్నానాలు, దుస్తులు మార్చుకొనే రూంలు, ఆరోగ్య శిభిరాలు ఏర్పాటు తదితర అంశాలపై దృష్టి సారించాలని ఆదేశించారు. పోలీస్, విద్యుత్, హెల్త్, రెవెన్యూ, మండల పరిషత్, మున్సిపాలిటీ, మిషన్ భగీరథ, ఆర్.అండ్.బి, పీఆర్, ఆర్టీసీ, ఎక్సైజ్, ఫైర్, ఐబీ తదితర శాఖల అధికారులు ఎండోమెంట్ అధికారులతో సమన్వయం చేసుకొని జాతరను విజయవంతం చేసే దిశగా ప్రణాళికా తయారు చేసుకొని విజయవంతం చేయాలని సూచించారు. అలాగే సంక్రాంతి రోజు జరిగే పెద్ద రథం నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు, అవరోధాలు తలెత్తకుండా కంట్రోల్ చేయాలని, మహా శివరాత్రి రోజు పెద్ద పట్నం వేసినప్పుడు తొక్కిసలాటలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, జాతరలో విక్రయించే పూజా సామగ్రి, కొబ్బరి కాయల ధరలు సాధారణ స్థాయిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన చల్మడ



**విశ్వంభర, భీమారం:** జగిత్యాల జిల్లా భీమారం మండలం కమ్మరి పేట గ్రామానికి చెందిన బీ ఆర్ ఎస్ కార్యకర్త కాజావుద్దీన్ కు ఇటీవల సక్సెస్ చికిత్స జరిగి విశ్రాంతి తీసుకుంటున్నాడు. అదే గ్రామానికి చెందిన కార్యకర్త భీన వేణి రెడ్డి మాతృమూర్తి లక్ష్మక్క ఇటీవల మృతి చెందగా విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహారావు వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకులను కార్యకర్తలను కలిసి నియోజకవర్గ సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. వారి వెంట ఆదిరెడ్డి, నరసయ్య, చిన్నరాజ్యం, గంగరాజం, గంగన్న, రామాంజనేయులు, భూమయ్య, నాయకులు పాల్గొన్నారు.

## ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అంగన్వాడీ చలో కలెక్టరేట్

**కలెక్టర్ కార్యాలయం ముందు అంగన్వాడీల భారీ ధర్నా**




**విశ్వంభర, మహబూబాబాద్:** అంగన్వాడీ సమస్యల పరిష్కారానికై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించారు. అంగన్వాడీలు భారీగా తరలి వచ్చి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు భారీ ధర్నా నిర్వహించారు. అంగన్వాడీ సమస్యలపై జిల్లా కలెక్టర్ అద్వైత్ సింగ్ కుమార్ మరియు పి.డి.లకు వినతి పత్రం అందజేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన బాట తప్పదని ఆందోళనలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బి అజయ్ సారధి రెడ్డి డిమాండ్ చేశారు.

## నేదునూరు ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



**విశ్వంభర, మహేశ్వరం:** కందుకూరు మండల కేంద్రంలోని నేదునూరు మోడల్ స్కూల్ లో అడ్మిషన్లు పొందుటకు గాను ఆన్లైన్లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ విష్ణుప్రియ ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి గాను 6 నుండి 10వ తరగతి అడ్మిషన్ల కొరకు జనవరి 6వ తేదీ నుండి ఫిబ్రవరి 28వ తేదీ వరకు ఆన్లైన్ లో ధరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 6వ తరగతిలో అన్ని సీట్లకు, 7వ తరగతి నుండి 10 వ తరగతి వరకు ఖాళీలను మాత్రమే భర్తీ చేయబడుతుంది. ఆన్లైన్లో ధరఖాస్తులు కొరకు వెబ్సైట్ లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులకు 125 రూపాయలు ఇతర విద్యార్థులకు 200 రూపాయలు ఆన్లైన్లో పరీక్ష ఫీజు చెల్లించాలని సూచించారు. పరీక్షకు సంబంధించిన హాల్ టికెట్లను ఆన్లైన్లో ఏప్రిల్ మూడవ తేదీ నుండి డౌన్లోడ్ చేసుకోవచ్చు అని తెలిపారు. ఆరవ తరగతి విద్యార్థులకు ఏప్రిల్ 13వ తేదీన ఉదయం 10 నుండి 12 గంటల వరకు అడ్మిషన్లు టెస్ట్ నిర్వహిస్తారని, అలాగే అదే రోజు ఏడవ తరగతి నుండి పదవ తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం రెండు గంటల సాయంత్రం 4 గంటల వరకు అడ్మిషన్ టెస్ట్ నిర్వహిస్తారని ప్రిన్సిపల్ విష్ణు ప్రియ తెలిపారు. కనుక ప్రతి ఒక్క విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## విజయవంతమైన ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం



**విశ్వంభర, కడ్తాల్:** కడ్తాల్ మండలంలోని రావి చెడు గ్రామపంచాయతీలో మంగళవారం డీసీసీబీ డైరెక్టర్, గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్, ఆమనగల్ సింగల్ విండో ఛైర్మన్ గంప వెంకటేష్ గుప్తా, కడ్తాల్ మాజీ జడ్పీటీసీ లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, దశరథ్ నాయక్, మాజీ ఎంపీటీసీ బుప్పిడి గోపాల్ లతో కలిసి ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో వైద్యులు ఉప్పల అఖిల్ బృందం పరీక్షలు చేసి అనంతరం అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రజల కోసం ఉచితంగా నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య శిబిరాలను ప్రజలు సద్వినియోగపరచుకొని ఆరోగ్యంగా జీవించాలని కోరారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 285 మందికి పైగా రోగులను పరీక్షించి మందులు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బొప్పిడి గోపాల్, బీఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రమేష్, వసంత, యాదయ్య, రంగయ్య, అమృతం పాండు, మాజీ ఉప సర్పంచ్ వెంకటేష్, రామచంద్రయ్య, మార్చ శేఖర్, తిరుపతి, సందీప్, అబ్బు రమేష్, మహేందర్, వగ్గు మహేష్, సురిగిమల్ల శేఖర్, తుడుం శ్రీశైలం, నాయకులు పాల్గొన్నారు.

# మేడిపల్లిలోని గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తా

**ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**



**విశ్వంభర, మేడిపల్లి:** ప్రజా ప్రభుత్వంలో రైతు సంక్షేమమే ధ్యేయంగా ముందుకు పోతున్నామని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన రాష్ట్రంలో ఎలాంటి సంక్షేమ పథకాలు ఆపకుండా అమలు చేస్తున్నామని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతి రోజు 18 గంటలు కష్టపడి రాష్ట్రానికి గాడిని పెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి అమలు చేసుకుంటూ ముందుకు పోతున్నామని, గత ప్రభుత్వం గల్ఫ్ లో మరణించిన వారికి 5 లక్షలు ఇస్తానని మోసం చేసిందని, ప్రజా ప్రభుత్వంలో గల్ఫ్ లో మరణించిన వారికి ఐదు లక్షల ఎక్స్గ్రేషియా అందజేయడంతో పాటు వారికి ప్రత్యేక పాలసీ తేవడం జరిగిందని చెప్పారు. ఇప్పటికే ఆడతల్లిలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, 200 యూనిట్లకు ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇండ్లు వంటి అనేక పథకాలను అమలు చేస్తున్నామన్నారు. ఆనాడు రైతులకు ఉచిత కరెంట్ అందించి, ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభం చేయడం జరిగిందని, రైతులకు దేశ చరిత్రలో ఒక సాహసోపేతమైన నిర్ణయం తీసుకొని 21 వేల కోట్ల మేర రుణమాఫీ చేయడం జరిగిందని తెలిపారు. ఆనాడు మీకు ఇచ్చిన మాట ప్రకారం గెలిచిన సంవత్సరం లోపే మోత్కరావుపేట చందుర్తి రోడ్డు నిర్మాణానికి అనుమతులు తీసుకురావడం జరిగిందని. త్వరలోనే మొదటి దశ పనులు ప్రారంభమవుతాయని, గత ప్రభుత్వం కనీసం అనుమతులు కూడా తేలేకపోయిందని, మేడిపల్లి మండల ప్రజల చిరకాల కోరిక జూనియర్ కళాశాల మంజూరు చేయించడం జరిగిందని అన్నారు. మేడిపల్లి భీమారం కథలాపూర్ మండలాల ప్రజల వరద ప్రధాయని సూరమ్మ చెరువు పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయిన్నారు. మొన్నటి రోజున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేములవాడ నియోజకవర్గం పరిధిలో 1000 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. గత పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో మేడిపల్లి మండల మార్కెట్ కమిటీకి కూడా కేటాయించలేకపోయారని ఎద్దేవ చేశారు. మొన్నటి రోజున భీమారం మండల కేంద్రానికి నూతన సబ్ స్టేషన్ మంజూరు చేయడం జరిగిందని, ఇటీవల అయోధ్య పోరుమాల రోడ్డుకు శంకుస్థాపన చేయడం జరిగిందని, ఉమ్మడి మేడిపల్లి మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళ్లడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజా ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని, ఇప్పటివరకు రాష్ట్రంలో 860 కోట్ల ముఖ్యమంత్రి సహాయానికి చేయడం జరిగిందన్నారు. వేములవాడ నియోజకవర్గం పరిధిలో ఎల్ఓసీలో, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా సుమారు 11 కోట్ల పైచిలుకు రూపాయలను లబ్ధిదారులకు అందజేయడం జరిగిందని తెలిపారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే మన ప్రాంతంలో వరద కాలువతో పాటు, శ్రీరామ్ సాగర్, పోచంపాడు వంటీ అనేక ప్రాజెక్టులను పూర్తి చేసుకున్నాం. రైతులకు ఇప్పటి వరకు 55 వేల కోట్ల మేర వివిధ రూపాలలో అందజేయడం జరిగిందని అన్నారు. గత ప్రభుత్వం ఏటా రైతు బందు 10 వేలు ఇస్తే ప్రజా ప్రభుత్వం లో 12 వెలు ఇవ్వడం జరుగుతుందని, గత ప్రభుత్వం చెల్లించినట్లుగా రాళ్ల రప్పలు, రోడ్లు రహదారులకు, రియల్ ఎస్టేట్ వెంచర్లకు రైతు భరోసా వర్తించదని వ్యవసాయ యోగ్యం కాని భూములకు మైనింగ్, కొండలు, గుట్టలు, రియల్ ఎస్టేట్ వెంచర్లు, రహదారులు, నివాస, పారిశ్రామిక, వాణిజ్య అవసరాలకు ఉపయోగించే భూముల రైతు భరోసా వర్తించదన్నారు. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి ఈ జనవరి 26 నాటికి 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రిపబ్లిక్ డే ఉత్సవాలను పురస్కరించుకుని అదే రోజు నుంచి రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ చేయడం జరుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ద్వారా భూమిలేని వ్యవసాయ కూలీ కుటుంబాలను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం వినూత్న కార్యక్రమం చేపట్టిందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా నిరుపేద వ్యవసాయ కూలీ కుటుంబాలను ఆర్థికంగా అదుకునేందుకు కొత్త పథకం అమల్లోకి తెచ్చిందన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ద్వారా భూమి లేని వ్యవసాయ కూలీ కుటుంబాలకు ఏడాదికి రూ.12 వేలు నగదు ఆర్థిక సాయం పంపిణీ చేస్తుందన్నారు. జనవరి 26న రిపబ్లిక్ డే సందర్భంగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని ఘనంగా ప్రారంభం కానుందని, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ద్వారా రాష్ట్రంలో 15 లక్షల కుటుంబాలు లబ్ధి పొందనున్నారు. భూమి లేని పేదలను ఆదుకోవాలని ప్రజా ప్రభుత్వం తీసుకున్న ఈ చారిత్రక నిర్ణయం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు.

## స్థానిక ఎన్నికల్లో ఆదివాసి ఎరుకల కులస్తులకు ప్రాధాన్యత కల్పించాలి




**విశ్వంభర, భూపాలపల్లి:** తెలంగాణ ఆదివాసి ఎరుకల సంఘం భూపాల్ పల్లి జిల్లా ఉపాధ్యక్షులు దుగ్యాల రాము, జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భూపాలపల్లి జిల్లా కేంద్రంలో తెలంగాణ ఆదివాసి ఎరుకల సంఘం సమావేశం జరిగింది. ఈ సమావేశానికి భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు లోకిని రాజు మాట్లాడుతూ రాజ్యాంగపరంగా రావలసిన హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న సంఘం తెలంగాణ ఆదివాసి ఎరకల సంఘం అని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కొరకు సంఘం తన వంతుగా కృషి చేయడం జరిగింది అని అన్నారు. గత ప్రభుత్వంలో పూర్తిస్థాయిలో తమ సమస్యలు పరిష్కారం కాలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మా సమస్యల పరిష్కారం అవుతాయని నమ్మకంతో ఓటు వేయడం జరిగింది అని అన్నారు.రాజ్యాంగం రావలసిన విద్యా ఉద్యోగం ఉపాధి సంక్షేమ పథకాలు అందక చాలా ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకబడి ఉన్నాము అని ఆవేదన వ్యక్తపరిచారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మరియు శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు ఎరుకల జాతిని గుర్తించి తమ నియోజకవర్గం లో ఎరుకలకు ప్రభుత్వం నుండి రావలసిన పథకాలను పూర్తిస్థాయిలో అందించి ఎరుకల కులస్తులను ఆదుకోవాలని. ఈ వేదికనుండి మీ ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రికి ఎరుకల కార్పొరేషన్ ఏర్పాటు చేసి బడ్జెట్ కేటాయించే విషయాన్ని తెలియజేయాలని రాష్ట్ర అధ్యక్షులు లోకిని రాజు కోరారు. రామాంజపురంలోని ఎరుకల నాంచారమ్మ గుడిని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించి, ఎరుకల ఆత్మ గౌరవాన్ని కాపాడాలని కోరారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో ఎరుకల కులస్తులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో భూపాలపల్లి జిల్లా 11 మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శిలు మంచిర్యాల జిల్లా అధ్యక్షులు దుగ్యల బాబు, వరంగల్ జిల్లా అధ్యక్షులు కేతిరి రాజశేఖర్, కరీంనగర్ జిల్లా అధ్యక్షులు కుతాడి శ్రీనివాస్, హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మానుపాటి రమేష్, వరంగల్ జిల్లా నాయకులు ఓనీ సదానందం, భూపాలపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి కెతిరి భద్రయ్య, భూపాలపల్లి జిల్లా ఉపా ధ్యక్షులు దుగ్యల రాము, జిల్లా యూత్ అధ్యక్షులు అంగిడి ప్రశంత్, భూపాలపల్లి మండల అధ్యక్షులు కుర్ర రవి తదితరులు పాల్గొన్నారు.

## కల్వకుర్తి లో రోడ్ల అభివృద్ధికి రూ.91.50 కోట్ల మంజూరు

**ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**



**విశ్వంభర, కల్వకుర్తి:** కల్వకుర్తి నియోజకవర్గం లోని వెల్దండ, కల్వకుర్తి, చారకొండ మండలాలలోని వివిధ గ్రామాల్లో రోడ్ల అభివృద్ధికి రూ.91.50 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో శనివారం మీడియా సమావేశంలో మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల రోడ్ల అభివృద్ధి చేస్తే అందరికీ మేలు జరుగుతుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో పెద్దఎత్తున నిధులు మంజూరైనట్లు ఆయన తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధి తమ లక్ష్యం అని ఆ దిశగా ఎల్లప్పుడు తన కృషి ఉంటుందని తెలియజేశారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచ్లు ఆనంద్ కుమార్, సుదర్శన్ రెడ్డి, భూపతి రెడ్డి, మండల అధ్యక్షులు బట్టు కిషన్ రెడ్డి, విజయ్ కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## సివిల్ సప్లయీస్ హమాలీల సమ్మె విరమణ



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సివిల్ సప్లయీస్ మరియు జీసీసీ హమాలీ కార్మికుల ఎగుమతి, దిగుమతి హమాలీ రేట్ల ఒప్పందం అమలు చేస్తూ వెంటనే జి.ఓ. విడుదల చేయాలని, జనవరి 1 నుండి ఈ రోజు వరకు 7 రోజులు జరిగిన రాష్ట్ర వ్యాపితంగా సమ్మెను కొనసాగిస్తుండగా ఈ రోజు ఎర్రమంజిల్ లోని జలసౌధ ఇరిగేషన్ శాఖ రాష్ట్ర కార్యాలయంలో పౌరసరఫరాల శాఖామాత్యులు ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డిని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడవెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్, సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు తదితరులతో కూడిన ప్రతినిధి బృందంతో జరిగిన సమావేశంలో అక్టోబర్ 4న జరిగిన వేతన ఒప్పందం ప్రకారం హమాలీ రేట్లను వెంటనే పెంచి అమలు చేయాలని చాడ వెంకట్ రెడ్డి మంత్రి కి వివరించగా మంత్రి సానుకూలంగా స్పందిస్తూ 2 రోజుల్లో జి.ఓ.ను విడుదల చేస్తామని దానికి అనుగుణంగా సమ్మెను విరమించాలని కోరినారు. అక్టోబర్ 4న జరిగిన ఒప్పందంలో భాగంగా పెరిగిన హమాలీ రేట్ల బకాయిలను చెల్లించాలని కోరగా చెల్లిస్తామని అదే విధంగా స్వీపర్లకు, హమాలీలకు యూనిఫాం కుట్టుకూలితో సహా చెల్లిస్తామని, బోనస్‌ను రూ.7,500లు చెల్లించేందుకు నిర్ణయం తీసుకున్నామని, దసరా పండుగ సందర్భంగా ఇచ్చే స్వీటు బాక్సు రూ.900లకు పెంచిన అగ్రిమెంట్ ప్రకారం ఇస్తామని హమాలీలు ఆందోళన చెందొద్దని మంత్రి విజ్ఞప్తి మేరకు కార్మిక సంఘాల నాయకులుగా ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్, సివిల్ సప్లయీస్ హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వై.ఓమయ్య, సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు, సివిల్ సప్లయీస్ హమాలీ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు సధాకర్, టియుసిఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం, రాష్ట్ర, జిల్లాల నాయకులతో సంప్రదించి మెజార్టీ నిర్ణయం ప్రకారం సమ్మెను విరమిస్తున్నామని ప్రకటించారు.

## ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించాలి

**మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**




**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాల పై ప్రజలకు విస్తృత ప్రచారం కల్పించాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో సమాచార శాఖ క్షేత్ర స్థాయి ఉద్యోగుల కు నూతన టెక్నాలజీతో కూడిన ఫోటో కెమెరాలను మంత్రి అందచేశారు. రాష్ట్రంలో జిల్లా, క్షేత్ర స్థాయి సిబ్బందికి నూతన కెమెరాలను అందచేయడం వలన ఎప్పటికప్పుడు కార్యక్రమ ఫోటో వార్తలు మీడియాకు సులువుగా అందించవచ్చునని కమిషనర్ డాక్టర్ హరీష్ తెలిపారు. అన్ని జిల్లా కార్యాలయాలకు, డివిజన్ స్థాయి సిబ్బందికి ఫోటో కెమెరాలను అందచేస్తున్నట్లు ఆయన తెలిపారు. నూతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఈ ఫోటో కెమెరాలు సిబ్బందికి ప్రయోజనకరంగా ఉంటాయని కమీషనర్ పేరొన్నారు. క్షేత్ర స్థాయిలో రాష్ట్ర మంత్రులు,పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పాల్గొనే ప్రతి కార్యక్రమంలో సమాచార శాఖ సిబ్బంది విరివిగా పాల్గొంటు ప్రభుత్వ పథకాలకు విస్తృత ప్రచారం కల్పిస్తున్నారని కమీషనర్ తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర సమాచార శాఖ కమీషనర్ డా.హరీష్, అదనపు సంచాలకులు డి.ఎస్.జగన్ పాల్గొన్నారు.

## మా భూములు మాకేనని ఎదురు తిరిగిన రైతులు



**విశ్వంభర, మహదేవపూర్:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలోని ఎలికేశ్వరం గ్రామంలో చిన్న కాళేశ్వరం కెనాల్ పనులను పోలీసులను కాపలా పెట్టి తమ భూములు లాక్కుంటే ఊరుకోమని ఎలికేశ్వరం రైతులు పనులు అడ్డుకొని నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఎలికేశ్వరం శివారులో కెనాల్ కోసం కాంట్రాక్టర్ జేసీబీతో పనులు చేస్తుండగా రైతుల కుటుంబ సభ్యులతో చేరుకొని అడ్డుకుని రెవెన్యూ అధికారులతో రైతులు వాగ్వివాదానికి దిగారు. అధికారులు సర్వేచేసి మార్కెట్ విలువ కంటే రెండింతలు పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ ప్రహ్లాదాథోడ్, డిప్యూటీ తహ సీల్దార్ కృష్ణ, ఆర్ఐ జగన్మోహన్రెడ్డి, ఇరిగే షన్ ఏఈఈ భరత్ లు రైతులకు ఎంత నచ్చజెప్పి నా వినలేదు. పోలీసులకు సమాచారం అందించడంతో మహదేవపూర్ ఎస్సై పవన కుమార్, ట్రైయినీ ఎస్సై అమూల్య వారి సిబ్బందితో ఎలికేశ్వరం చేరుకొని గొడవ జరగకుండా చర్యలు చేపట్టారు.

## అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ సమస్యల పరిష్కరించాలి

**- ఆర్డీవోకు వినతి పత్రం ఇచ్చిన అంగన్వాడీలు**



**విశ్వంభర, మెట్ పల్లి:** జగిత్యాల జిల్లా కోరుట్ల నియోజకవర్గం మెట్ పల్లి ఆర్డీవో కార్యాలయంలో అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ తమ సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ యూనియన్ ఆధ్వర్యంలో ప్రధాన కార్యదర్శి ఏ భాగ్యలక్ష్మి మంగళవారం ఆర్డీవోని కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ కు కనీస వేతనం రూపాయలు 18,000 ఇస్తామన్న హామీ అమలు చేయాలని, ఇంటి అద్దెలు, గ్యాస్ బిల్స్, ఇతర పెండింగ్ బిల్స్, మినీ టీచర్స్ కు పదోన్నతికి పెంచిన జీతాలు 7,500 నుండి 13,650 రూపాయలు అమలు పరచకుండా గత తొమ్మిది నెలల నుండి ఆయా గౌరవ వేతనం అందిస్తున్నారు. కావున పెండింగ్ మినీ వేతనాలు అందించాలి. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో ఐసీడీఎస్ కు నిధులు పెంచాలి, అంగన్వాడి సెంటర్స్ అభివృద్ధికి నిధులు ఇవ్వాలి, ఖాళీగా ఉన్న ఆయా టీచర్ పోస్టులు భర్తీ చేయాలి, మెనూ చార్జీలు ప్రస్తుత ధరల ప్రకారం పెంచాలి, బీఎల్ఓ డ్యూటీ లు రద్దు చేయాలి, అంగన్వాడి కేంద్రాలు కు బిల్డింగ్స్, తాగునీరు, విద్యుత్ సరఫరా ఇవ్వాలి, 5జి సెల్ ఫోన్లు ఇవ్వాలి, గ్రాడ్యుటి 15 లక్షలు, హెల్త్ కార్డులు, ప్రతి నెల నూనె, పప్పులు, గుడ్లు నాణ్యమైనవి అందించాలని పై అంశాలు పరిశీలించి తక్షణం పరిష్కారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ ప్రధాన కార్యదర్శి ఏ భాగ్యలక్ష్మి, సుమలత, లావణ్య, శమీం సుల్తానా, రోదసి, తదితర అంగన్వాడీ టీచర్స్, ఆయాలు, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

## జైళ్ల శాఖ క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించిన సీఎం రేవంత్ రెడ్డి



**విశ్వంభర, మలక్ పేట్:** తెలంగాణ జైళ్ల శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్, డైరీ -2025 ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జైళ్ల శాఖ డీజీపీ సౌమ్య మిశ్రా, ఐజీలు వై రాజేష్, ఎన్ మురళీ బాబు, డిప్యూటీ ఐజీలు డాక్టర్ డి. శ్రీనివాస్, ఎం సంపత్ పాల్గొన్నారు.

## క్యాన్సర్ పై అవగాహన సదస్సు



**విశ్వంభర, కుత్బుల్లాపూర్:** నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటి గాగిల్లాపూర్ లో గ్రామ పంచాయతీ ఆవరణలో మంగళవారం గ్రాన్యూల్స్ కంపెనీ మరియు ఏఐజీ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత రొమ్ము క్యాన్సర్ పరీక్ష, అవగాహన శిబిరాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉమా చిగురుపాటి మాట్లాడుతూ ఈ రొమ్ము క్యాన్సర్ ద్వారా అవగాహన లేక ఎంతోమంది ప్రాణాలు మీదకు తెచ్చుకుంటున్నారన్నారు. రొమ్ము క్యాన్సర్ నుండి క్షేమంగా బయట పడొచ్చు అన్నారు. ఇంతటి చక్కటి కార్యక్రమం నిర్వహిస్తున్న హాస్పిటల్, యాజమాన్యానికి డాక్టర్లకి వారిని ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. మొబైల్ ఉమెన్ క్యాన్సర్ స్క్రీన్ సెంటర్ ను మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. ఆశ వర్కర్ల ద్వారా దీని జిల్లా వ్యాప్తంగా మహిళలకు రొమ్ము క్యాన్సర్ పట్ల అవగాహన అన్ని గ్రామాలలో తీసుకురావాలన్నారు. దీని ద్వారా ఎంతో మంది ప్రాణాలను కాపాడుకోవచ్చు అన్నారు. దీనిని మొదటి దశలో గుర్తించినట్లయితే మందుల ద్వారా నయం చేసుకోవచ్చన్నారు. ఈ సేవలు విస్తరించాలని వారు ఆకాంక్షించారు. తనవంతు సహాయ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజ్ఞ చిగురుపాటి కన్సల్టెంట్ బ్రేస్ట్ ఓనికాలజిస్ట్ ఏఐజి, మేడ్చల్ జిల్లా డీఎంహెచ్ఓ డా.రఘునాథ్ స్వామి, బీఆర్ఎస్ కౌన్సిలర్ శంబిపూర్ కృష్ణ, శంకర్ నాయక్, కుంతి నాగమణి, నాగరాజు, సుధాకర్ రెడ్డి, భరత్ కుమార్, ఆశ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

## మెరుగైన సేవలు అందించేందుకు వార్డ్ అధికారులు ముందుండాలి

**పెరుమాళ్ళ అన్నపూర్ణ, ఛైర్పర్సన్**



**విశ్వంభర, సూర్యాపేట:** సూర్యాపేట మున్సిపాలిటీ నందు నూతనంగా వచ్చిన వార్డు అధికారులు తమ సేవలను పట్టణ ప్రజలకొరకు ఉపయోగించి పట్టణాన్ని అభివృద్ధి పథంలో ఉంచాలి అని మున్సిపల్ ఛైర్మెన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ, మున్సిపల్ కమీషనర్ బి.శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపాల్టీ నందు నూతనంగా ప్రభుత్వము నియమించిన వార్డు అధికారుల ఒక్కరోజు ట్రయినింగ్ కార్యక్రమానికి హాజరు అయ్యి ట్రయినింగ్ నిర్వహించారు. కార్యాలయం నకు చెందిన సెక్షన్ అధికారులు వారి విభాగంలకు సంబంధించిన వార్డ్ అధికారులు చేయవలసిన పనుల గురించి ట్రయినింగ్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇ.ఇ. యం.కిరణ్, డీఈ సత్యారావు, సానిటరీ ఇన్స్పెక్టర్ సారగాండ్ల శ్రీనివాస్, ఆర్వో కళ్యాణి,ఎ.ఇ.తిరుమలయ్య జూనియర్ అస్సిటెంట్లు ఎం.డీ.గౌసుద్దీన్, ఎస్.ఎస్.ఆర్.ప్రసాద్, ప్రభుకుమార్,ఇండ్ల మనోజ్,హెల్త్ అస్సిటెంట్ సురేష్, బూర సతీష్, వసుంధర తదితరులు పాల్గొన్నారు.

## లక్ష డప్పులు వెయ్యి గొంతుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి




**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ఈర్లపల్లి మల్లయ్య మాదిగ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ మండల స్థాయి సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో ఈర్లపల్లి మల్లయ్య మాదిగ మాట్లాడుతూ, ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం గత 30 సంవత్సరాలుగా మంద కృష్ణ మాదిగ నేతృత్వంలో ఎన్నో పోరాటాలు చేశామని, సుప్రీంకోర్టు వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ నిర్వహించ తలపెట్టిన లక్ష డప్పులు వేయి గొంతుల కార్యక్రమం విజయవంతం చేయడానికి మండలంలోని ప్రతి మాదిగ బిడ్డ ఇప్పటినుండే సన్నద్ధం కావాలని కోరారు. ఈనెల 11న ఎమ్మార్పీఎస్, మాదిగ కళామండలి నూతన మండల కమిటీని ఎన్నుకోవడం జరుగుతుందని, ఎమ్మార్పీఎస్ ఉద్యమ నాయకులు, ఉద్యమ అభిమానులు ప్రతి ఒక్కరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి, మండల ఇన్చార్జి నల్ల స్వామి మాదిగ, సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ (దుబ్బాక) గట్టు యాదయ్య మాదిగ, కందాల దేవేందర్ మాదిగ, వంగాల మారయ్య మాదిగ, మండల కన్వీనర్ నకిరేకంటి సతీష్ మాదిగ, బొడ్డు రాములు మాదిగ, చిన్నలచ్చి సైదులు మాదిగ, నల్ల రమేష్ మాదిగ, బి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# డ్రైవర్ల అతి వేగంతోనే అధిక ప్రమాదాలు

- మద్యం సేవించి స్టీరింగ్ పట్టుకోవద్దు
- ఆర్టీవో సురేష్ రెడ్డి
- క్యాబ్ డ్రైవర్లకు రోడ్డు రవాణా జాగ్రత్తలపై అవగాహన



**విశ్వంభర, సూర్యాపేట:** రోడ్డు రవాణా జాగ్రత్తలపై అవగాహన పెంచుకొని ఒక ప్రాణమైన మనం కాపాడుకోగలగాలని జిల్లా రోడ్డు ట్రాన్స్పోర్ట్ అధికారి సురేష్ రెడ్డి అన్నారు. రోడ్డు భద్రత మాస ఉత్సవాల్లో భాగంగా ఫోర్ వీలర్ లైట్ మోటార్ వెహికల్ యూనియన్ ఆధ్వర్యంలో హైటెక్ బస్టాండ్ వద్ద, ఐఎన్ టీ యూ సీ సూర్యాపేట లైట్ మోటార్ వెహికల్ డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కొత్త బస్టాండ్ వద్ద వేరు వేరుగా క్యాబ్ డ్రైవర్లకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశంలో అత్యధికంగా రోడ్డు ప్రమాదాల్లో చనిపోతున్నారని డబ్ల్యూహెచ్వో ద్వారా తెలుసుకొని కేంద్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన ఆ మరణాలను నివారించేందుకు రోడ్డు భద్రత వారోత్సవాలను ఏర్పాటు చేసి రోడ్డు ప్రమాదాల నివారణ పై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. గత సంవత్సరం రాష్ట్రంలో 1,70,000 మంది ప్రాణాలు కోల్పోగా 6 లక్షల మంది వికలాంగులుగా మిగిలారని వీరంతా 35 సంవత్సరాల యువకులేనని అన్నారు. వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకొని నడపవద్దని ఎక్కువగా ప్రమాదాలు అతివేగంతోనే జరుగుతాయని మద్యం సేవించి డ్రైవర్లు స్టీరింగ్ ముట్టుకోవద్దన్నారు. రోడ్ సిగ్నల్స్ ను ప్రతి ఒక్కరూ తప్పకుండా పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు. ఎం వీ ఐ జయప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యంగా డ్రైవర్లకు ఓపిక ఉండాలని వేగం కన్నా ప్రాణం మిన్న అన్నారు. వాహనాలు నడిపే క్రమంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అరిగిన టైర్లతో వాహనాన్ని నడిపితే రోడ్డు ప్రయాణంలో పగిలే ప్రమాదం ఉందని దాంతో పెను ప్రమాదాలు చోటు చేసుకుంటాయన్నారు. ముందుగా వాహనం ఎక్కి స్టీరింగ్ పట్టుకున్న వెంటనే సెంటర్ మిర్రర్ ను సరి చేసుకుంటే సైడ్ మిర్రర్స్ పై కాన్సన్ట్రేషన్ పెట్టకుండా వెనుక నుంచి వచ్చే వాహనాలు అన్ని కనిపిస్తాయని తెలిపారు. అలాగే వాహనాలకు సంబంధించి లోబీం ఐబీమ్ ను సమయానుకూలంగా వేసుకోవాలని లాంగ్ డ్రైవ్ చేసినప్పుడు ప్రతి రెండు గంటలకు ఒకసారి విశ్రాంతి తీసుకోవాలన్నారు. నిద్ర మత్తులో ఉన్నప్పుడు ఎట్టి పరిస్థితుల్లో డ్రైవింగ్ చేయవద్దని నిద్రమత్తు పెను ప్రమాదాలకు దారితీస్తుందన్నారు. అనంతరం రోడ్ ట్రాన్స్పోర్ట్ అధికారులతో పాటు, సీనియర్ డ్రైవర్ ముజ్జు బాయ్ ని పూలమాలలు శాలువాతో ఘనంగా సత్కరించి రోడ్డు నియమాలు పాటిస్తూ జాగ్రత్తగా వాహనాలు నడుపుతామని ప్రతిజ్ఞ చేశారు. ఫోర్ వీలర్ లైట్ మోటర్ వెహికల్ యూనియన్ అధ్యక్షులు మరికంటి అంబేద్కర్, ఐ ఎన్ టీ యూ సీ సూర్యపేట లైట్ మోటర్ వెహికల్ డ్రైవర్ యూనియన్ అధ్యక్షులు కాసాని పాపన్న గౌడ్ ల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు సతీష్ కుమార్, విక్రమ్ కుమార్, తెలంగాణ క్యాబ్ డ్రైవర్స్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు పెరుమాళ్ళ ప్రవీణ్, జంగం మహేష్, షారూక్, ముజ్జు బాయ్, కప్పల ఉపేందర్, బాలు నాయక్, కోడి సైదులు, బడుగుల చంద్రశేఖర్, మొండి కత్తి వెంకన్న, ఫోర్ వీలర్ లైట్ మోటార్ వెహికల్ యూనియన్ నాయకులు వీరన్న, ప్రసాద్, పిల్లల శ్రీను, సంతు, వెంకన్న, యుగేందర్, ఉదయ్ రెడ్డి, అంబేద్కర్ తో పాటు క్యాబ్ డ్రైవర్లు పాల్గొన్నారు.

## మంచిగా చదివి సమాజంలో గుర్తింపు తెచ్చుకోవాలి

- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి
- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**విశ్వంభర, సూర్యాపేట:** మంచిగా చదివి సమాజం లో గుర్తింపు తెచ్చుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. మంగళవారం తిరుమలగిరి మున్సిపాల్టీ పరిధిలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోయే పదవ తరగతి పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఇప్పటి నుండే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఉపాధ్యాయులకి సూచించారు. పదవ తరగతి విద్యార్థులకి ఉదయం, సాయంత్రం ప్రత్యేకంగా స్టడీ అవర్స్ ఏర్పాటు చేయాలని అలాగే వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ద పెట్టాలని,చదువు లో వెనుకబడిన విద్యార్థులు కుంగి పోకుండా బాగా చదివి ఉత్తీర్ణులు అయ్యే విధంగా ప్రయత్నించాలని ప్రయత్నిస్తే ఏదైనా సాధ్యం అవుతదని సూచించారు. 9 వ తరగతిలో కలెక్టర్ విద్యార్థుల తెలుగు చూచిరాత కాఫీలలో రైటింగ్ మంచిగా రాస్తున్నారని మెచ్చుకున్నారు. పలువురు విద్యార్థులతో తెలుగు పాఠం చదివించగా విద్యార్థులు బాగా చదవటంతో అభినందించారు. గ్రౌండ్ లో మాక్ డ్రిల్ ప్రాక్టీస్ చేస్తున్న ఆరవ తరగతి విద్యార్థులతో కలెక్టర్ ముచ్చటిస్తు మధ్యాహ్నం భోజనం మంచిగా పెడుతున్నారా అని అడిగి తెలుసుకున్నారు.పాఠశాలలో ఏమైనా అత్యవసర సమస్యలు ఉంటే తెలియపర్చాలని ఉపాధ్యాయులకి సూచించారు.ఈ కార్యక్రమం లో యం ఈ ఓ శాంతయ్య, ప్రధాన ఉపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు దుర్గాప్రసాద్, నర్సయ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదాల నివారణపై ఐఓసీఎల్ మాక్ డ్రిల్




**విశ్వంభర, సూర్యాపేట రూరల్:** ఇండియన్ ఆయిల్ కార్పోరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో మంగళవారం మండల పరిధిలోని కాసరబాద సమీపంలో ప్రమాదాల నివారణపై మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డీఎస్పీ రవి, జిల్లా అగ్నిమాపక అధికారి కృష్ణారెడ్డిలు హాజరై మాక్ డ్రిల్ను పరిశీలించి మాట్లాడారు. ఆయిల్ పైప్ లైన్‌లు వెళ్లే గ్రామాల్లో ప్రమాదాలు చోటు చేసుకుంటే ఎలాంటి చర్యలు తీసుకోవాలో సిబ్బంది ప్రయోగాత్మకంగా వివరించారు. ప్రతి సంవత్సరం ఆయిల్ పైప్‌లైన్ వెళ్లే గ్రామాల ప్రజలకు, సిబ్బందికి అవగాహన కల్పించడం అవసరమన్నారు. ఐఓసీఎల్ ఇంచార్జ్ గోపాలకృష్ణ మూర్తి కూన మాట్లాడుతూ పారాదీప్–హైద్రాబాద్ పైప్‌లైన్ పరిధిలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. సజాగ్ ప్రహరీ ప్రోత్సాహక పథకంపై వివరించారు. పైప్ లైన్ దొంగతనాలు, ఇతర నేర కార్యకలాపాలను నివారిం చేందుకు కృషి చేసిన సిబ్బందికి రివార్డులు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శ్రీదేవి, ఐఓసీఎల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పతంగుల కోసం చైనా మాంజా వాడకం ప్రమాదకరం

- జిల్లాలో చైనా మాంజా వాడకం నిషేదం
- నిబంధనలకు విరుద్ధంగా విక్రయించిన వినియోగించిన చర్యలు
- సూర్యాపేట జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్

**విశ్వంభర, సూర్యాపేట:** పతంగులు ఎగరవేయడానికి వాడే చైనా మాంజా వలన ప్రజలకు మరియు జంతువులకు ప్రమాదం జరిగే అవకాశం ఉన్నదని జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. సంక్రాంతి సందర్భంగా జిల్లాలో చిన్నపిల్లలు, పెద్దలు సరద కొరకు ఎగరవేసే పతంగులకు నైలాన్, సింథటిక్ తో తయారు చేసినా చైనా మంజా వాడడం, వాడి పడేయడం వలన ప్రజలకు, పక్షులకు ప్రమాదాల వాటిల్లే అవకాశాలు ఉన్నాయని జిల్లా ఎస్పీ ఒక ప్రకటనలో తెలిపారు. కావున జిల్లాలో చైనా మాంజా విక్రయాలు, వినియోగాల పైన ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందనీ, ఎవ్వరయిన నిలువ ఉంచిన, తయారుచేసిన, అమ్మిన, అమ్మడానికి ఎవ్వరయిన ప్రోత్సహించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోబడుననని తెలిపారు. చైనా మంజా చెట్లకు, ఎలక్రిక్ తీగలకు తగిలి వేలాడి ప్రజలకు మరియు జంతువులకు చుట్టుకుని ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని ఈ మాంజా తగిలి కొన్ని ప్రాంతాలలో ప్రమాద సంఘటనలు చోటుచేసుకున్నాయని తెలిపారు.

కావున విక్రయదారులు ఎవ్వరయిన చైనా మంజా నిలువచేసిన, అమ్మిన, వాడిన డయల్ 100 కి గాని, సమీప పోలీస్ స్టేషన్ కి సమాచారం అందించగలరని వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడునని తెలిపారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు

**1.50 కోట్ల చెక్కులను పంపిణి చేసిన ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్**



**విశ్వంభర, షాద్ నగర్:** గత పదేళ్లలో రాష్ట్రాన్ని అప్పులో ఊబిలో నెట్టి రాష్ట్రాన్ని దివాళా తీసారని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ మండిపడ్డారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కేశం పెట్ ,కొందుర్గ్ మండలానికి సంబదించిన136 మందికి రూ.1,36,15,776 ల కళ్యాణలక్ష్మీ, షాది ముబారక్ చెక్కులను మరియు 30మంది లబ్దిదారులకు రూ. 13,93.500 ల ముఖ్యమంత్రి సహాయనిది చెక్కులను లబ్ధిదారులకు పంపిణి చేశారు. అర్హులైన ప్రతి లబ్దిదారులకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో లబ్ది చేకూరుతుందని ఎమ్మెల్యే తెలిపారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన చాలా పథకాల్లో తమ రాజకీయ లబ్ది కొరకు అమలు చేశారాని ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ మండిపడ్డారు. ఏడాది పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేస్తున్నామని అన్నారు.ఒకే రోజు దాదాపు 1కోటి 50 లక్షల పై చిలుకు చెక్కులను అందిచడం చాలా సంతోషంగా ఉందన్నారు. సంక్షేమ పథకాల అమలులో ఎవరికి ఒక్క రూపాయి ఇవ్వొద్దని సభ ముఖంగా ఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కిరాతకులను కఠినంగా శిక్షించాలి: డీఎంజేయూ



**విశ్వంభర, నెల్లికుదురు:** చత్తీస్గడ్ లో అవినీతిపై వార్తలు రాసిన జర్నలిస్టు ముఖేష్ చంద్రకర్ హత్య అత్యంత హేయమైన చర్య అని డిజిటల్ మీడియా జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డు అశోక్ అన్నారు. ఆయన మంగళవారం నెల్లికుదురులో మీడియాతో మాట్లాడుతూ హత్యను యూనియన్ రాష్ట్ర కమిటీ ఖండిస్తోందన్నారు. కిరాతకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల భద్రత కోసం మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ హత్యను జర్నలిస్ట్ లు, ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, మేధావులు తీవ్రంగా ఖండించాలని కోరారు.

## పర్యావరణ సమతుల్యత ఉండేలా ఫోర్త్ సిటీ

- భవిష్యత్ అవసరాల కోసం పెద్ద రోడ్లు, మెట్రో రైలు
- మహానగరంలో గ్రీన్ ఫార్మా, అంతర్జాతీయ సంస్థలు
- కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి



**విశ్వంభర, మహేశ్వరం, కందుకూరు:** గ్రామస్థాయి నుంచి కార్పొరేషన్ స్థాయికి మహేశ్వరం, కందుకూరు మండలాలను తీసుకుపోవాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అభిప్రాయపడ్డారు. నాల్గో పట్టణం మహానగరంగా అభివృద్ధి చెంది ఫార్మా, హెల్త్ అండ్ ఎడ్యుకేషన్, అంతర్జాతీయ సంస్థలు కొలువు తీరనున్నాయని కేఎల్ఆర్ తుక్కుగూడ కార్యాలయంలో తెలిపారు. విపక్షాలు ఆరోపణలు చేస్తున్నట్లు డ్రగ్ తయారీ కాకుండా ప్యాకింగ్, ట్రాన్స్ ఫోర్ట్, అడ్మిన్ స్ట్రేషన్ కార్యాలయాలు మాత్రమే ఉంటాయన్నారు. పర్యావరణహితమైన సంస్థలు, నిర్మాణాలు ఉండేలా తెలంగాణ ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని కే ఎల్ ఆర్ చెప్పారు. 320 ఫీట్ల రోడ్డుతో ఈ ప్రాంత రైతుల భూములకు భారీగా విలువ పెరిగి అన్నదాతలు లాభపడతారని లక్ష్మారెడ్డి మరోసారి స్పష్టం చేశారు. నిపుణుల మాస్టర్ ప్లాన్ ప్రకారం రూపుదిద్దుకునే ఫోర్త్ సిటీలో ఆధునిక విద్య, వైద్యం పక్క దేశాలకు సైతం చికిత్సలు అందించే స్థాయికి తీసుకొస్తామన్నారు. మన ప్రాంత యువతీ, యువకులకు నైపుణ్య శిక్షణ ఇచ్చి స్థానిక కంపెనీల్లోనే భారీ వేతనలు వచ్చేలా సీఎం రేవంత్ రెడ్డి స్కిల్ యూనివర్శిటీకి రూపకల్పన చేశారని కే ఎల్ ఆర్ గుర్తు చేశారు. భూములు కోల్పోయే రైతులకు అన్ని విధాల న్యాయం, స్థలాలు ఇచ్చి మంచి ప్రతిఫలం వచ్చేలా చూస్తామని భరోసా ఇచ్చారు.

## నితిన్ గడ్కరీతో పొన్నం ప్రభాకర్ భేటీ



**విశ్వంభర, న్యూ ఢిల్లీ:** కేంద్ర ఉపరితల రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అధ్యక్షతన జరుగుతున్న అన్ని రాష్ట్రాల రవాణా శాఖ మంత్రుల సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పుష్పగుచ్చం అందజేసి అనంతరం ఆయనతో భేటీ అయ్యారు.

## భారీ ఎత్తున ఎగసిపడిన మంటలు



నల్లగొండ చౌరస్తా నుండి చంచల్ గూడకు వెళ్ళే దారిలో పేలిపోయినా ట్రాన్స్ఫారం. భారీ ఎత్తున ఎగసిపడిన మంటలు. సకాలంలో స్పందించి మంటలు ఆర్పిన ఫైరింగ్ సిబ్బంది. **– విశ్వంభర, మలక్ పేట్**

# ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ

**విశ్వంభర, హైదరాబాద్:** ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ ఎం కోదండరాం కార్యాలయంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిఫరెంట్లీ ఏబుల్డ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ( యు బి ఐ డి ఇ ఎఫ్) 2025 నూతన సంవత్సరం క్యాలెండర్ ను ఎమ్మెల్సీ ఎం కోదండరాం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైకల్యాలు ఉన్న వ్యక్తుల రోజువారి జీవితం అనేక సమస్యలతో అనేక ఒడిదుడుకులతో కొనసాగుతుంది. అలాంటి ఇబ్బందులు నాకు వ్యక్తిగతంగా సమస్యలు సుపరిచితమైనప్పటికీ వైకల్యాలున్నటువంటి వ్యక్తులు ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే ఇతర వైకల్యాలు కలిగినటువంటి వ్యక్తుల హక్కుల కోసం వారిని చైతన్యం చేయడం కోసం ముందు వరుసలో ఉండి వైకల్యాలు కలిగిన వ్యక్తులే పోరాడడం అనేది వికలాంగులైనటువంటి వ్యక్తులందరికీ ఒక ప్రేరణ కలిగించేటువంటి విషయం. ఎందుకంటే ఈ రోజుల్లో నేను బాగుంటే చాలు అనే ధోరణి క్రమక్రమంగా పెరుగుతున్న క్రమంలో నేను బాగుంటేనే సమాజం బాగునట్టు కాదు నాతో చుట్టుపక్కల వాళ్ళు పీడితులు బాధితులు కూడా బాగుంటేనే సమాజం బాగున్నట్టు సమాజం అభివృద్ధి చెందుతున్నట్టు అనే ఆలోచనతోటి వైకల్యాలు కలిగినటువంటి ఇతరుల ఉద్యోగుల హక్కుల కోసం పోరాడాలని నిశ్చయించుకొని వారందరినీ ఒక తాటిపై తీసుకొచ్చి వారిహక్కులపై చైతన్యం కలిగించి వారి హక్కుల కోసం ప్రజాస్వామ్య పంథాలో వారి హక్కుల పట్ల చైతన్యం చైతన్యం కలిగిస్తూ హక్కుల సాధన అనేది నాయకత్వానికి ఒక కఠినమైనటువంటి పరీక్షా సమయం వికలంగులైనటువంటి వ్యక్తులని సమీకరించడమే చాలా కష్టమైనటువంటి సమస్య అలాంటిది వివిధ రకాలైనటువంటి వైకల్యాలు ఉన్నటువంటి వ్యక్తులని వారి హక్కుల పట్ల చైతన్యం చేస్తూ వారిని ఈ సమీకరించి క్రోడీకరించి వారి హక్కుల పట్ల పోరాటాల నిర్మించడం అనేది ఒక కష్టతరమైనటువంటి జటిల మైనటువంటి సమస్య. అయినప్పటికీ ఆ సమస్యను అధిగమించి



ముందుకు వెళ్తూ అనేక మంది వైకల్యాలు కలిగినటువంటి ఉద్యోగుల సమస్యల పట్ల పోరాటాలు చేస్తూనే వారిని చైతన్యం చేస్తూ మేనేజ్మెంట్ దృష్టికి తీసుకెళ్తూ వైకల్యాలు కలిగినటువంటి ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తున్నటువంటి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిఫరెంట్లీ ఏబుల్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నుండి ఇతరులు కూడా ప్రేరణ పొందాల్సినటువంటి అంశం. హక్కులనేటివి పోరాటాల ద్వారా మాత్రమే పొందగలమని వాటిని దయతోను జాలితో కరుణతోనో కృపతోనో సాధించలేమని హక్కుగా బతకాలంటే సమాన అవకాశాలు పొందాలన్నా సమాన అవకాశాలు అందరికీ లభించాలన్న వాటికి ఒకే ఒక ప్రధానమైనటువంటి మార్గం ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజాస్వామిక పంథాలో ప్రజాస్వామ్య బద్ధంగా ప్రజా పోరాటాలు నిర్మించాల్సిందే. ఈ ప్రజా పోరాటాల వల్లనే మనకు హక్కులు లభిస్తాయి. ఆ హక్కుల అమలుకు ప్రజా పోరాటాలే బలాన్ని చేకూరుస్తాయన్నారు. ఈ సమాజంలో సమాన అవకాశాలు సమాన భాగస్వామ్యం కోసం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిఫరెంట్లీ ఏబుల్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో హెలెన్ కిల్లర్ లూయిస్ బ్రెయిలీ స్టీఫెన్ హాకిన్స్ స్ఫూర్తితో ముందుకెళ్లడం హర్షించదగ్గ విషయమని కోదండరాం అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిఫరెంట్ లేబుల్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కార్యదర్శి పి రాజశేఖర్, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్ స్వామి నాయక్, మరియ నాయకులు హరిలాల్, రంగప్ప తదితరులు పాల్గొన్నారు.

## రైతులను దగా చేస్తున్న కాంగ్రెస్ సర్కార్



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పోషబోయిన మల్లేశం మాట్లాడుతూ, రైతుబంధు పథకం కింద ఇచ్చే పెట్టుబడి సాయం ఏటా ఎకరానికి 15 వేలు రూపాయలు ఇస్తామని ఆశలు పెట్టిన కాంగ్రెస్ ఇప్పుడు 12 వేలు రూపాయలు ఇస్తామని దగా చేస్తుందని, కాంగ్రెస్ సర్కార్ రైతుల ఆశలను అడియాసలు చేసిందని ధ్వజమెత్తారు. రైతు భరోసాను రైతు గుండెకోతగా మార్చారని, రైతులు పండించిన పది రకాల పంటలకు, అన్ని రకాల వడ్లకు 500 రూపాయల బోనస్ ఇస్తామని చెప్పి సన్న వడ్లకు మాత్రమే బోనస్ అని ఇప్పుడు చెప్పి రైతులను మోసం చేయడం జరుగుతుందని, కాంగ్రెస్ మోసపూరిత వైఖరికి ఇది పరాకాష్ట అని అన్నారు. భూమి కలిగిన రైతులకే కాకుండా, కౌలు రైతులకు కూడా రైతు భరోసా ఇస్తామని చెప్పి ఈ విషయాన్ని క్యాబినెట్లో ప్రస్తావించకుండా కౌలు రైతులను మోసం చేయడం జరుగుతుందని, వానాకాలంలో ఎగ్గొట్టిన రైతు భరోసాతో సహా యాసంగికి కలిపి 15 వేల రూపాయలు ఇవ్వాలని, రైతులను కాంగ్రెస్ సర్కార్ మోసం చేసిందని ఇది వంచనపూరితా ప్రభుత్వమని విమర్శించారు.

## క్షత్రియ సమాజ్ వారు సమాజ సేవలో ముందుండాలి



**విశ్వంభర, జగద్గిరిగుట్ట :** జగద్గిరిగుట్ట మరియు కూకట్పల్లి క్షత్రియ సమాజ్ క్యాలెండర్ ను పీఏసీ ఛైర్మన్ శేరిలింగంపల్లి శాసనసభ్యులు ఆరేకపూడి గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ఆవిష్కరణ చేశాడు. 122 డివిజన్ సీనియర్ నాయకులు సంజీవరెడ్డి, 121 డివిజన్ సీనియర్ నాయకులు చిట్టిరెడ్డి శ్రీధర్ రెడ్డి, ఆస్బెస్టాస్ కాలనీ అధ్యక్షుడు నరేష్ మరియు ఇతర నాయకులతో కలిసి క్యాలండర్ ఆవిష్కరణ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ క్షత్రియ సమాజ్ వారిని అభినందిస్తూ సమాజ సేవలో ముందుండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఎస్ కే సమాజ్ అధ్యక్షుడు కే హనుమంతరావు తో పాటు సీనియర్ నాయకులు లక్ష్మీనారాయణ గుప్త, రాజు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం, మంత్రులు, ఎమ్మెల్యే చిత్రపటాలకు రైతుల పాలాభిషేకం



**విశ్వంభర, పరిగి:** తెలంగాణ ప్రభుత్వం రైతు భరోసా 12 వేలకు పెంపుతో మంగళవారం పరిగి పట్టణంలోని మార్కెట్ యార్డు వద్ద మార్కెట్ కమిటీ ఛైర్మన్ పరశురాం రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి హనుమంతు ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, రైతులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్థానిక ఎమ్మెల్యే టి, రామ్మోహన్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో రైతులకు చేసిన రుణమాఫీ వారు తీసుకున్న వ్యవసాయ రుణాల వడ్డీకే సరిపోయిందన్నారు. రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ, ఎకరానికి రైతు భరోసా 12000 రూపాయలు కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వడం జరుగుతుందని అన్నారు. రైతులను రాజు చేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కృష్ణ, ఉపాధ్యక్షులు ఎజాజ్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ఆనంద్, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ అయూబ్, కాంగ్రెస్ నాయకులు రామకృష్ణ, గోపాల్, చిన్న నరసింహులు, శ్రీనివాస్, శ్రీనివాస్, మహిపాల్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## పనుల జాప్యంతో పొంచివున్న ప్రమాదం



**విశ్వంభర, హైదరాబాద్:** బర్కతపుర ప్రధాన దారి లో గత కొన్ని రోజులుగా స్ట్రామ్ వాటర్ లైన్ పనులు జరుగుచున్నవి. నత్త నడకన నడుస్తున్న పనులు తో ఆ దారిలో బస్టాప్ ఉండడం అక్కడికి వచ్చే ప్రయాణికులకు కళాశాలకు వచ్చి వెళ్లే విద్యార్థులకు ఇబ్బందిగా మారింది. పనుల జాప్యం తో ట్రాఫిక్ అంతరాయం కూడా కలుగుతుంది. పలుచోట్ల గుంతలు తవ్వి ఉన్నచోట ఇనుప చువ్వలు అత్యంత ప్రమాదకరంగా ఉన్నవి. పనులు పూర్తి కాకపోవడంతో ఆ ప్రాంతం పాదచారులకు ఇబ్బందిగా ప్రమాదకరంగా మారింది.

## రైల్వే రక్షణ దళం ప్రజా అవగాహన



**విశ్వంభర, హైదరాబాద్:** సికింద్రాబాద్ రైల్వే రక్షణ దళం (ఆర్పీఎఫ్) గ్రేటర్ హైదరాబాద్ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి మరియు టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతే శోభన్ రెడ్డి సహకారంతో, లాలాపేట్ తార్నాక రైల్వే బ్రిడ్జ్ వద్ద ఆపరేషన్ సమ్రక్ష, రాళ్ల దాడులు, మరియు రైల్వే ట్రాక్‌లో జరిగే ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ప్రజలకు రైల్వే భద్రతపై అవగాహన కల్పించడం మరియు ప్రమాదాలను నివారించడంపై దృష్టి సారించింది. కార్యక్రమం ప్రధానంగా ప్రయాణికులను మరియు ప్రజలను చలనం లో ఉన్న రైళ్లలో ఎక్కడం లేదా దిగడం వంటి ప్రాణాంతక పద్ధతుల ప్రమాదాలపై అవగాహన కల్పించారు. రైల్వే ట్రాక్‌లపై అనధికార ప్రవేశం మానేయమని, మరియు భద్రత కోసం ఫుట్ ఓవర్ బ్రిడ్జ్‌లు (%ఖీూదీం%) ఉపయోగించాల్సిందిగా సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో లేదా రైల్వే భద్రతా సమస్యల కోసం 139 టోల్-ఫ్రీ నంబర్‌ను సంప్రదించవచ్చని వివరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి మాట్లాడుతూ రైల్వే భద్రతకు సంబంధించిన బాధ్యతను అందరూ పంచుకోవాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తూ, ప్రయాణికులందరూ భద్రంగా ప్రయాణం చేయడం కోసం ప్రతిజ్ఞ చేయించారు. రైల్వే ప్రయాణికుల భద్రతపై అవగాహన పెంపొందించడానికి రైల్వే రక్షణ దళం తీసుకున్న మరొక ముఖ్యమైన అడుగు. రైల్వే ప్రయాణం మరింత భద్రంగా మారడానికి ఈ కార్యక్రమం సహాయపడుతుందని సూచించారు. కార్యక్రమంలో బీఎస్.సరస్వత్, ఇన్స్పెక్టర్, ఆర్పీఎఫ్, సికింద్రాబాద్. ఎం.వెంకట రెడ్డి, సబ్ ఇన్‌స్పెక్టర్ ఆర్‌పీఎఫ్ సికింద్రాబాద్. స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వివాహ వేదిక అధ్యక్షుడిగా ప్రొద్దుటూరు శ్రీనివాస్ గుప్తా



**విశ్వంభర, ఎల్బీనగర్:** రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఉచిత వివాహ వేదిక అధ్యక్షుడిగా ప్రొద్దుటూరు శ్రీనివాస్ గుప్తా నియామకం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన నియమకానికి సహకరించిన తెలంగాణా రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరావాది లక్ష్మీనారాయణ , రంగారెడ్డి జిల్లా మహాసభ నూతన అధ్యక్షులు సురేష్ , మాజీ అధ్యక్షులు తాడేపల్లి వెంకటేశం గుప్తా , అర్థం లక్ష్మయ్య లకి ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు. సేవా కార్యక్రమాల్లో ఎల్లవేళలా ముందు ఉంటానని రాష్ట్ర , జిల్లా ఆర్యవైశ్య మహాసభలు తీసుకునే నిర్ణయాలకు కట్టుబడి ఉండి పనిచేస్తానని ఆయన తెలిపారు. నిరుపేద ఆర్యవైశ్య కుటుంబాల సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తానని తెలిపారు.

## మిషన్ భగీరథ ద్వారా అన్ని గ్రామాలకు మంచినీటి సరఫరా చేయాలి



**విశ్వంభర, రామన్నపేట:** భారతీయ జనతా పార్టీ రామన్నపేట ఎస్సీ మోర్చా మండల అధ్యక్షులు రాపోలు రమేష్ ఆధ్వర్యంలో ఈరోజు యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలంలోని అన్ని గ్రామాలకు మిషన్ భగీరథ ద్వారా మంచినీటి సరఫరా చేయాలని, అదేవిధంగా చాలా గ్రామాలకు పైప్ లైన్లు అసంపూర్తిగా వేయడం జరిగిందని, పైప్ లైన్లు త్వరితగతిన పూర్తి చేసి, అన్ని గ్రామాలకు గడప గడపకు మిషన్ భగీరథ ద్వారా మంచినీటి ఇవ్వాలని యాదాద్రి జిల్లా కలెక్టర్ ను కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షులు పల్లపు దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

## విపంచి ఫౌండేషన్ చేయూత



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం, వెల్లంకి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులకు విపంచి ఫౌండేషన్ వారు గురుకుల మెటీరియల్ ను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు పల్లె మోహన్ రెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కే.శేఖర్ హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ, ఇటువంటి కార్యక్రమాలను ఫౌన్డేషన్లు నిర్వహించడం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం కావడంతో పాటు, పేద విద్యార్థులకు సహాయ సహకారాలు అందించినవారు అవుతారని తెలియజేశారు. విపంచి ఫౌండేషన్ ఛైర్మన్ అనుముల శ్రీనివాస్ మాట్లాడుతూ, పేద ప్రజలు చదువుతున్న ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి పరచడానికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలియజేశారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి, విద్యార్థుల ప్రగతికి తమ వంతు సహాయ సహాకారం అందిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విపంచి ఫౌండేషన్ సభ్యులు కూరెళ్ళ నరసింహాచారి, లక్ష్మణాచారి, నకిరేకంటి సతీష్, పాఠశాల ఉపాధ్యాయులు సోమిరెడ్డి, బిక్షమయ్య, సువర్ణ, వెంకటయ్య, మాధవి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సాంస్కృతిక సారథి జిల్లా అధ్యక్షునిగా కంబాలపల్లి



**విశ్వంభర, మహబూబాబాద్ :** తెలంగాణ సాంస్కృతిక సారథి మహబూబాబాద్ జిల్లా అధ్యక్షునిగా కంబాలపల్లి సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో జిల్లా సాంస్కృతిక సారధి కళాకారులు, సభ్యుల మధ్య ఈ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి అన్ని అభివృద్ధి సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరవేయడం జరుగుతుందని, సాంస్కృతిక సారథి కళాకారుల సంక్షేమం కోసం పనిచేయడం జరుగుతుందని, నిత్యం అందుబాటులో ఉంటూ ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కృషి చేస్తానని, తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా కంబాలపల్లి సత్యనారాయణ, కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నిక అనంతరం నూతన జిల్లాఅధ్యక్షులు సత్యనారాయణ ను డిపిఆర్ఓ పి రాజేంద్రప్రసాద్, సాంస్కృతిక సారధి సభ్యులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కళాకారులు కొమురే వెంకన్న, గిద్దె రాంనరసయ్య, మెరుగు రవీందర్ గౌడ్, మునికుంట్ల ఐలేష్, బండ వెంకన్న, జిన్నా, ఉప్పరి సురేష్, బక్కి యాది, దేశెట్టి ప్రవీణ్, కందుకూరి అనిల్, దర్శనం యుగంధర్, ఆరేపల్లి నరేష్, పాష, సట్ల అంజలి, డాంగి రోజా, వజ్య రాజ్యలక్ష్మి, పోతు అశ్విని, చెడుపాక కవిత, ఈసం సింధుజా, కోదుమూరి కీర్తి తదితరులు పాల్గొన్నారు.

## సిమెంట్ పరిశ్రమను రద్దు చేస్తున్నట్లు బహిరంగంగా ప్రకటించాలి

అఖిలపక్షాల ఆధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమంలో వినతిపత్రం



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలోని రామన్నపేట, కొమ్మాయిగూడెం గ్రామాల పరిధిలో పెట్టబోయే అదాని గ్రూప్ అంబుజా సిమెంట్ పరిశ్రమ రద్దు చేసినట్లు ప్రకటించాలని రామన్నపేట అఖిల పక్ష పార్టీల ఆధ్వర్యంలో ప్రజావాణి సందర్భంగా కలెక్టరేట్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ వీరారెడ్డికి వినతి పత్రం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్ రెడ్డి, పర్యావరణ పరిరక్షణ వేదిక కన్వీనర్ జల్లెల పెంటయ్య, కొ-కన్వీనర్ ఎండీ రెహాన్, బీజేపీ మండల అధ్యక్షుడు పల్లపు దుర్గయ్య, సీపీఐ మండల కార్యదర్శి ఊట్కూరు నరసింహ, టీడీపీ మండల నాయకుడు ఫజల్ బేగ్ మాట్లాడుతూ, ఆదాని అంబుజా సిమెంట్ పరిశ్రమ నెలకొల్పాలని ప్రజాభిప్రాయం సేకరణ పెడితే, ఏకపక్షంగా ప్రజలంతా వ్యతిరేకించి రెండు నెలలు గడిచినా, ఇప్పటికి ఎలాంటి వైఖరి ప్రభుత్వ అధికారుల నుండి రాకపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎలాంటి అనుమతి లేకున్నా భారీ యంత్రాలతో పనులు ప్రారంభించేందుకు యాజమాన్యం ప్రయత్నం చేస్తుందని, అడ్డుకున్న ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తుందని అన్నారు. పరిశ్రమను గుట్టుచప్పుడుగా పెట్టాలని ప్రయత్నం చేస్తే మరో లగచర్లలాగా మహా ప్రజా పోరాటం తప్పదని అన్నారు. వెంటనే పరిశ్రమ రద్దును పబ్లిక్ డొమైన్ లో పెట్టి బహిర్గత పరచాలని అన్నారు. కొమ్మాయిగూడెం వెళ్లే దారిలో ప్రతిపాదించిన నూతన కోర్టును కూడా మార్చేందుకు ప్రయత్నం జరుగుతుందని, దాని మూలంగా ప్రజలు ఇబ్బంది పడే అవకాశం ఉందని, గతంలో రెవెన్యూ శాఖ ఇచ్చిన భూమిలోనే కోర్టు నిర్మాణం జరగాలని అన్నారు. అఖిలపక్ష నాయకులు ఇచ్చిన వినతి పత్రానికి జాయింట్ కలెక్టర్ స్పందిస్తూ, పరిశ్రమపై కాలుష్య నియంత్రణ మండలి నుండి నివేదిక రాగానే బహిర్గత పరుస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీపీఎం, కాంగ్రెస్, బీజేపీ, సీపీఐ, టీడీపీ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి పట్టివేత



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామననపేట మండల కేంద్రంలో 05 జనవరి 2025 ఆదివారం సాయంత్రం 06.30 గంటల సమయంలో రామన్నపేటలోని అంబేద్కర్ బొమ్మ (టి-జంక్షన్) దగ్గర రామన్నపేట ఎస్ ఐ, అతని సిబ్బంది వాహనాలను తనఖీ చేస్తుండగా, ఒక మోటార్ సైకిల్ పై ఇద్దరు వ్యక్తులు చిట్యాల వైపు నుండి వలిగొండ వైపు వెళ్ళుతూ పోలీసు వారిని చూసి పారిపోవడానికి ప్రయత్నించగా, పోలీసు సిబ్బంది వారిని వెంబడించి, పట్టుకుని విచారించగా వారి పేర్లు రామన్నపేట మండలంలోని తుమ్మలగూడెం గ్రామానికి చెందిన కుంచం శ్రీను కుమారుడు కుంచం విజయ్ కుమార్ గా, వలిగొండ మండల కేంద్రంలోని సిరిగిరి కిష్టయ్య కుమారుడు సిరిగిరి బోయాజ్ లుగా తెలిపారు. ఆ తరువాత పోలీసులు వారిని తనిఖీ చేయగా, వారి వద్ద మోటార్ సైకిల్ పై ఉన్న గోనె సంచీలో రెండు కవర్లలో సుమారు 3.75 కిలోల గంజాయి దొరికిందని, ఆ గంజాయిని వారు భద్రాచలం దాటిన తరవాత ఆంధ్ర-ఒడిశా బోర్డర్ నుండి తీసుకోని వస్తున్నారని, విచారణలో తెలిపారని, ఆ వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని రామన్నపేట ఎస్ఐ ఒక తెలిపారు.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు



**హైదరాబాద్ శేర్లింగంపల్లి:** శేర్లింగంపల్లి నియోజకవర్గం వివేకానందనగర్ డివిజన్ లోని రిక్షా పుల్లర్స్ కాలనీ ,రామకృష్ణ నగర్ లలో అధికారులతో కలిసి పాదయాత్ర చేసి ఇందిరమ్మ ఇండ్ల సర్వే, శానిటేషన్, శివరేజ్, ఎలక్ట్రికల్ పలు సమస్యలను తెలుసుకున్న కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు మాట్లాడుతూ ప్రజా పాలన లో ఇందిరమ్మ ఇండ్ల పథకానికి అప్లై చేసుకున్న వారి పేర్లు ఇప్పుడు సర్వే చేసే డేటాలో చాలావరకు లేవని అన్నారు. అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అప్లై చేసుకున్న అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు లు వచ్చేలా కృషి చేయాలని అన్నారు. పలుప్రాంతాల లో వాటర్ వాల్ దగ్గర లీకేజ్ తో నీరు వృధా అవుతుందని వీలైనంత తొందరగా మరమ్మత్తులు చేయాలని అధికారులకి సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్, జలమండలి అధికారులు కాలనీల వాసులు పాల్గొన్నారు.

# క్షీణించిన ప్రశాంత్ కిశోర్ ఆరోగ్యం.. ఆస్పత్రిలో చేరిక

**పాట్నా:** బీపీఎస్‌సీ వ్యవహారంలో ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ చేస్తున్న ఆమరణ నిరాహార దీక్ష ను సోమవారం పోలీసులు భగ్నం చేసి.. అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. అనంతరం ఆయన షరతులు లేని బెయిల్‌పై విడుదలయ్యారు. కాగా నాలుగు రోజుల పాటు నిరాహార దీక్ష చేయడంతో ప్రశాంత్ కిశోర్ ఆరోగ్యం క్షీణించిందని.. ఆయనను పట్నాలోని ఆస్పత్రికి తరలించామని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఇటీవల బిహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్షల్లో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఆ పరీక్షలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రశాంత్ కిశోర్ జనవరి 2న గాంధీ మైదానంలో ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. గత రెండు వారాలుగా బీపీఎస్సీ అభ్యర్థులు తీవ్ర ఆందోళనలు చేపడుతున్నా, ప్రభుత్వంలో ఎలాంటి కదలిక రావట్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రిలిమినరీ పరీక్షను రద్దు చేసి.. మళ్లీ కొత్తగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రశాంత్ కిశోర్ చట్టవిరుద్ధంగా నిరసన చేపట్టారని ఆరోపిస్తూ పోలీసులు ఆయనను అరెస్ట్ చేసి.. కోర్టు ముందు హాజరుపరిచారు. మళ్లీ ఇటువంటి చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడవద్దని హెచ్చరిస్తూ న్యాయస్థానం షరతులతో కూడిన బెయిల్ ఇవ్వడంతో ప్రశాంత్ దాన్ని తిరస్కరించారు. దీంతో ఆయన్ను బ్యూరో సెంట్రల్ జైలుకు తరలించారు. అనంతరం కోర్టు షరతులు లేని బెయిల్ మంజూరుచేయడంతో సోమవారం రాత్రి జైలు నుంచి విడుదలయ్యారు. పోలీసులు దీక్షను భగ్నం చేసిన అనంతరం తనను ఎక్కడికి తీసుకువెళ్తున్నారనే విషయం తెలియజేయలేదని ప్రశాంత్ కిశోర్ ఆరోపించారు. ఉదయం 5 గంటల నుంచి 11 గంటల వరకు పోలీసు వాహనంలోనే కూర్చోబెట్టి వివిధ ప్రాంతాలకు తీసుకెళ్లారన్నారు. సరైన పత్రాలు లేకుండానే తనను కోర్టు నుంచి పోలీసులు తీసుకెళ్లారని పేర్కొన్నారు. తనను జైలుకు కూడా తీసుకెళ్లలేదని పేర్కొనడం గమనార్హం.




## మా ఎన్నికల్లో మస్క్ జోక్యం: ఫ్రాన్స్ అధినేత మేక్రాన్ ఆరోపణ



**పారిస్:** ప్రపంచ నేతలతో అపర కుబేరుడు ఎలాన్‌మస్క్ కు విభేదాలు పెరుగుతున్నాయి. తాజాగా తమ దేశ ఎన్నికల్లో టెస్లా అధినేత నేరుగా జోక్యం చేసుకొంటున్నాడని ఫ్రాన్స్ అధినేత మేక్రాన్ ఆరోపించారు. అంతకుముందుఆయన ఓ వీడియోలో మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా అధికార మార్పిడి ఉద్యమానికి ప్రపంచంలోనే మస్క్ మద్దతు ఇస్తున్నారని ఆరోపించారు. ప్రగతిశీల సంస్కరణలను ఆయన వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. ఇక కెనడా ప్రధాని ట్రూడో కూడా స్పందిస్తూ.. "మనం ఆ విషయాలు మాట్లాడితే.. ప్రపంచంలోనే అతిపెద్ద సోషల్ మీడియా యజమాని మాత్రం సరికొత్త అధికార మార్పిడి ఉద్యమానికి మద్దతు ఇస్తారని.. ఎన్నికల్లో నేరుగా జోక్యం చేసుకొంటారని అనుకోలేదు" అని అన్నారు. దీనికి మస్క్ వెటకారంగా స్పందిస్తూ.. " ఓహో అగ్రరాజ్యం ఎన్నికల సందర్భంగా ట్రంప్ జాత్యాహంకారి అని స్టార్మర్ వ్యాఖ్యానించినప్పుడా.. ?లేక ఆయన అధికారంలోకి రాకూడదని యూకే ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేసినప్పుడా..? లేక ఏకంగా లేబర్ పార్టీ సభ్యులు ట్రంప్‌నకు వ్యతిరేకంగా ప్రచారం చేయడంకోసం అమెరికాకు వచ్చినప్పుడా..?" అని ప్రశ్నించారు. అంతేకాదు.. 2020లో జార్జిఫ్లాయిడ్ హత్యపై ట్రంప్‌ను జార్జిస్టార్మర్ విమర్శిస్తున్న వీడియోను మస్క్ షేర్ చేశారు. ఇటీవల మస్క్ యూకేలోని గ్రూమింగ్ గ్యాంగ్స్ అరాచకాలపైవరుసగా ప్రకటనలుచేయడం మొదలుపెట్టారు. డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ హోదాలో ఉన్నవేళ స్టార్మర్ వాటిని అదుపు చేయడంలో విఫలమ్యారని విమర్శించారు. ఓట్ల కోసం సామూహిక అత్యాచారాలకు సహకరించారనే అర్థం వచ్చేలా వ్యాఖ్యలు చేశారు. ఈ ఆరోపణలను సోమవారం యూకే పీఎం స్టార్మర్ తిరస్కరించారు. మస్క్ పేరును ప్రస్తావించకుండా..అబద్ధాలు, తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేశారని ఆరోపించారు. అత్యాచారాలకు గురైన చిన్నారులకు న్యాయం చేయడానికి తాము కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. ఇటీవల నార్వే ప్రధాని జోనాస్ కీలక వ్యాఖ్యలు చేశారు. "ఎలాన్ మస్క్ అమెరికా బయటి దేశాల రాజకీయాల్లో జోక్యం చేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది. తన సామాజిక మాధ్యమాన్ని విస్తృతంగా వినియోగించుకునే సౌలభ్యం మస్క్‌కు ఉంది.ఆయన దగ్గర ఆర్థిక వనరులు భారీగా ఉన్నాయి. అలాంటి వ్యక్తి ఇతర దేశాల అంతర్గత విషయాల్లో జోక్యం చేసుకోవడం మంచి పరిణామం కాదు" అని తీవ్ర ఆందోళన వ్యక్తంచేశారు. కొన్ని నెలల నుంచి మస్క్‌తో ప్రపంచ నేతలకు వివాదాలు చోటుచేసుకొన్నాయి.జర్మనీ ఛాన్సలర్ ఓలాఫ్ షోల్జ్, కెనడా ప్రధాని ట్రూడో, అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ వంటి వారి తో మాటల యుద్ధాలు జరిగాయి.

## మహారాష్ట్రలో రెండు హెచ్‌ఎంపీవీ వైరస్ కేసులు

**ముంబయి:** చైనాలో ఇటీవల కలవరం సృష్టిస్తున్న 'హ్యూమన్ మెటాన్యుమో వైరస్' (హెచ్‌ఎంపీవీ) మన దేశంలోను విస్తరిస్తుంది. ఇప్పటికే పలు రాష్ట్రాల్లో తొలి కేసులు వెలుగుచూడగా.. తాజాగా మరో రెండు కేసులు నమోదయ్యాయి. మహారాష్ట్రలోని నాగ్‌పుర్‌లో ఇద్దరు చిన్నారులకు హెచ్‌ఎంపీవీ వైరస్ నిర్ధరణ అయ్యింది. 7, 14 ఏళ్ల చిన్నారులు ఇద్దరూ దగ్గు, జ్వరంతో బాధపడుతున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో భారత్‌లో ఇప్పటివరకు ఏడు హెచ్‌ఎంపీవీ కేసులు నమోదయ్యాయి. సోమవారం కర్ణాటక, తమిళనాడు, గుజరాత్‌లలో తొలి కేసులు వెలుగు చూశాయి. అయితే, దీనిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కేంద్ర ప్రభుత్వం భరోసా ఇస్తోంది. ఇదే విషయాన్ని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా సైతం పేర్కొన్నారు. 'హెచ్‌ఎంపీవీ కొత్త వైరస్ కాదని ఆరోగ్య రంగ నిపుణులు స్పష్టంచేశారు. ఈ వైరస్‌ని 2001లో గుర్తించారు. చాలా ఏళ్లుగా ఇది ప్రపంచవ్యాప్తిలో ఉంది. గాలి, శ్వాసప్రక్రియ ద్వారా ఇది వ్యాపిస్తుంది. అన్ని వయసుల వారిని ప్రభావితం చేస్తోంది. ఆరోగ్యమంత్రిత్వ శాఖ, ఐసీఎంఆర్, నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ చైనాతో పాటు పొరుగు దేశాల్లో పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నాయి. దేశంలోని ఆరోగ్య వ్యవస్థలు, నిఘా నెట్‌వర్క్‌లు అప్రమత్తంగా ఉన్నాయి. పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ.. ఆరోగ్య పరమైన సవాళ్లపై తక్షణం స్పందించేందుకు సిద్ధంగా ఉన్నాం. అందువల్ల భయపడాల్సిన అవసరం లేదు' అని నడ్డా తెలిపారు. చైనాలో 'హ్యూమన్ మెటాన్యుమో వైరస్' సహా పలు శ్వాసకోశ వ్యాధులు విజృంభిస్తున్నాయన్న వార్తలతో భారత్ ఇప్పటికే అప్రమత్తమైంది. ఇటీవలే డైరెక్టరేట్ జనరల్ ఆఫ్



హెల్త్ సర్వీసెస్ అధ్యక్షతన జాయింట్ మానిటరింగ్ గ్రూప్ సమావేశం నిర్వహించింది. శీతాకాలంలో చోటుచేసుకున్న మార్పుల కారణంగానే చైనాలో ఇన్‌ఫ్లూయెంజా, ఆర్‌ఎస్‌వీ, హెచ్‌ఎంపీవీ తరహా వైరస్‌లు వ్యాప్తి చెందుతున్నాయని జేఎంజీ తేల్చింది. భారత్‌లో అంత ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొంది. ముందస్తు చర్యల్లో భాగంగా ఇప్పటికే పలుచోట్ల ఆర్ఎస్ఏ, హెచ్‌ఎంపీవీ తదితర పరీక్షలు చేస్తున్నట్లు ఆరోగ్యశాఖ వెల్లడించింది. ఒకవేళ శ్వాసకోశ వ్యాధులు అనుకోకుండా పెరిగినా ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉన్నట్లు తెలిపింది.

## ట్రంప్ విక్టరీని ధ్రువీకరించిన అమెరికా కాంగ్రెస్

**వాషింగ్టన్:** గతేడాది నవంబర్‌లో జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ నెల 20న ఆయన అమెరికా 47వ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేయబోతున్నారు. ఈ నేపథ్యంలో ఇందుకు సంబంధించిన అధికారిక సన్నాహాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగానే ట్రంప్ ఎన్నికను అమెరికా కాంగ్రెస్ తాజాగా ధ్రువీకరించింది. 2020 నాటి నవంబర్ ఎన్నికల్లో ప్రస్తుత అధ్యక్షుడు బైడెన్ చేతిలో ట్రంప్ ఓడిపోయిన విషయం తెలిసిందే. ఆ తర్వాత బైడెన్ ఎన్నికను ధ్రువీకరించేందుకు నిర్వహించిన సమావేశం ఉద్రిక్తతకు దారి తీసింది. బైడెన్ గెలుపును ధ్రువీకరించేందుకు యూఎస్ కాంగ్రెస్ సమావేశమైన క్యాపిటల్ భవనంలోకి వేలాది మంది ట్రంప్ మద్దతుదారులు చొచ్చుకెళ్లి బీభత్సం సృష్టించారు. ఈ ఘటనను దృష్టిలో పెట్టుకొని ఈసారి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. పటిష్ఠ బందోబస్తు నడుమ పార్లమెంట్ ఉమ్మడి సమావేశం జరిగింది.ఈ సమావేశంలో ప్రతి రాష్ట్రం నుంచి వచ్చిన ఓట్లను లెక్కించారు. మొత్తం 538 ఎలక్టోరల్ ఓట్లలో మెజారిటీ మార్క్ 270 కాగా.. ట్రంప్‌కు 312, హారిస్‌కు 226 ఓట్లు వచ్చాయి. ఈ సమావేశానికి ప్రస్తుత ఉపాధ్యక్షురాలు, డెమోక్రటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిగా బరిలోకి దిగి ట్రంప్ చేతిలో ఓటమిపాలైన కమలా హారిస్ అధ్యక్షత



వహించారు. హారిసే ట్రంప్ గెలుపును ధ్రువీకరించారు. నవంబర్ 5 నాటి ఫలితాలను ధ్రువీకరించడంపై ట్రంప్ హర్షం వ్యక్తం చేశారు. ఇదో బిగ్ మూమెంట్ అంటూ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. ఇక ఇదే సమావేశంలో అమెరికాకు కాబోయే ఉపాధ్యక్షుడి ఎన్నికపైనా కమలా హారిస్ ప్రకటన చేశారు. ట్రంప్ రన్నింగ్ మేట్, ఒహియో సెనెటర్ జేడీ వాన్స్‌కు 312 ఓట్లు వచ్చినట్లు ప్రకటించారు.

## అస్సాం బొగ్గు గనిలో వరదలు.. ముగ్గురు కార్మికులు జల సమాధి..!

**గువాహటి:** ఈశాన్య రాష్ట్రం అస్సాంలోని ఓ గనిలో ఘోర ప్రమాదం చోటుచేసుకొంది. గనిలో నీరు ఉప్పొంగడంతో ముగ్గురు కార్మికులు ప్రాణాలు కోల్పోయినట్లు పోలీసులు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. మరికొందరు లోపలే చిక్కుకుపోయారు. వారిని రక్షించేందుకు ప్రభుత్వం విశ్వ ప్రయత్నాలు చేస్తోంది. ఈ ఘటన దిమా హసావ్ జిల్లాలో చోటుచేసుకొంది. జిల్లాలోని బొగ్గు గనిలోకి తొమ్మిది మంది వెళ్లారు. ఈక్రమంలోనే లోపల నీరు ఉప్పొంగింది. నీటి ప్రవాహం పెరగడంతో గని నుంచి వరద బయటకు వచ్చింది. దీంతో అందులో చిక్కుకుపోయిన వారిని సురక్షితంగా బయటకుతీసుకొచ్చేందుకు సహాయక బృందాలు సోమవారం నుంచి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాయి. అయితే అందులో ఇప్పటికే ముగ్గురు కార్మికులు చనిపోయినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఇంకా మృతదేహాలను మాత్రం స్వాధీనం చేసుకోలేదని తెలిపారు. మిగిలినవారిని రక్షించేందుకు హెలికాప్టర్లు, ఇంజినీర్ల సహాయంతో చర్యలు చేపట్టారు. "నిన్న రాత్రి గని నుంచి ఒక్కసారిగావరద వచ్చింది.లోపల చిక్కుకున్నవారిని కాపాడేందుకు ప్రయత్నిస్తున్నాం. జాతీయ, రాష్ట్ర విపత్తు సహాయక దళాలు, ఆర్మీ నుంచి రెస్క్యూ బృందాలు సహాయక చర్యలు కొనసాగిస్తున్నాయి" అని జిల్లా పోలీ సు ఉన్నతాధికారి మయాంక్ కుమార్ తెలిపారు. కాగా.. 2019లో పొరుగు రా ష్ట్రం మేఘాలయలో ఇలాంటి విపత్తే సంభవించింది. గనిలో కొందరు అక్రమంగా పనిచేస్తున్న సమయంలో పక్కనున్న నది నుంచి భారీగా నీరు వచ్చి అం



దులో చేరింది.ఈ ప్రమాదంలో కనీసం 15 మంది జల సమాధి అయ్యారు.


## 75 ఏళ్ల నాటి చట్టం తెరపైకి.. ట్రంప్‌నకు బైడెన్ మోకాలడ్డు..!

**వాషింగ్టన్:** అమెరికాకు కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు వీలైనన్ని ఇబ్బందులు సృష్టించే పనిలోపడ్డారు ప్రస్తుత అధ్యక్షుడు జోబైడెన్. తాజాగా ట్రంప్ లక్ష్యమైన గ్యాస్, చమురు డ్రిల్లింగ్ పనులు ముందుకువెళ్లకుండా ఆయన ఏకంగా 75 ఏళ్ల నాటి ఓ చట్టాన్ని తెర పైకి తీసుకొచ్చారు. అమెరికా సముద్ర జలాల్లో దాదాపు 62 కోట్ల ఎకరాల ప్రదేశాన్ని ఆయిల్, గ్యాస్ డ్రిల్లింగ్ నుంచి కాపాడేందుకు దీనిని వాడనున్నారు. ఈ విషయాన్ని సోమవారం శ్వేతసౌధం ప్రకటించింది. శిలాజ ఇంధన ఉత్పత్తిని పెంచాలన్న ట్రంప్ ప్లాన్ అమలును ఇది మరింత జఠిలం చేయనుంది. 1953 ఔటర్ కాంటినెంటల్ షెల్ఫ్ ల్యాండ్ యాక్ట్ (ఓసీఎస్ఎల్ఏ) ఇందుకోసం బైడెన్ వాడుతున్నారు. దీని ప్రకారం చమురు, గ్యాస్ డ్రిల్లింగ్ నుంచి ఔటర్ కాంటినెంటల్ షెల్ఫ్‌ను పూర్తిగా మినహాయించే అధికారం అధ్యక్షుడికి లభిస్తుంది. తూర్పు, పశ్చిమతీరాలు, తూర్పు గల్ఫ్ మెక్సికో, అలాస్కాలోని ఉత్తర బేరింగ్ సముద్రం వంటివి వీటి కిందకు వస్తాయి. అంతేకాదు.. అసలు ఈ చట్టం తర్వాత వచ్చే అధ్యక్షుడికి దానిని అడ్డుకొనే శక్తిని ఇవ్వదు. దీనిని ఆపాలంటే ట్రంప్ మళ్లీ కాంగ్రెస్ ఆమోదం పొందాల్సి ఉంటుంది. "తాజాగా వారు అనుకొన్నచోట్ల డ్రిల్లింగ్ చేస్తే.. కోలుకోలేనంత నష్టం వాటిల్లుతుంది. వాస్తవానికి అమెరికా ఇంధన అవసరాలను తీర్చుకోవడానికి అది అనవసరం.రిస్క్ చేయాల్సినంత విలువైందేమీ కాదు. ఇప్పటికే దేశంలోని పలు ప్రాంతాలను వాతావరణ మార్పులు ప్రభావితం చేస్తున్నాయి. మనం క్లీన్ ఎనర్జీ ఆర్థికవ్యవస్థ దిశగా అడుగులు వేస్తున్నాం. ఈ తీరాలను మన పిల్లలు, మనవళ్ల కోసం సంరక్షించి తీరాల్సిందే. కాలిఫోర్నియా నుంచి ఫ్లోరిడా వరకు రిపబ్లికన్లు, డెమోక్రట్ గవర్నర్లు, కాంగ్రెస్ సభ్యులు, తీరప్రాంత ప్రజలు ఏకతాటిపైకి వచ్చి చమురు, సహజవాయు డ్రిల్లింగ్ నుంచి తీరాలను రక్షించడానికి ఏకతాటి పైకి రావాలి" అని జోబైడెన్ పిలుపునిచ్చారు. దీనిపై ట్రంప్ కార్యవర్గంలోని ప్రెస్ సెక్రటరీగా బాధ్యతలు స్వీకరించనున్న కరోలైన్ లెవిట్టీ స్పందిస్తూ.. దీనిని



అమెరికా ప్రజలపై అవమానకర ప్రతీకార చర్యగా పేర్కొన్నారు.

## 'భారత్‌పోల్' పోర్టల్‌ను ప్రారంభించిన అమిత్ షా



**ఢిల్లీ:** కేసుల సత్వర విచారణ కోసం కేంద్ర ప్రభుత్వం సరికొత్త వ్యవస్థను ఆవిష్కరించింది. భారత్ పోల్ పేరిట తీసుకొచ్చిన పోర్టల్‌ను మంగళవారం కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ప్రారంభించారు. అంతర్జాతీయ కేసుల విషయంలో కొత్త శకం ప్రారంభమైనట్లేనని ఈసందర్భంగా మంత్రి అభివర్ణించారు.దర్యాప్తు సంస్థలు సరికొత్త సాంకేతిక పద్ధతులను వినియోగించుకొని పరారీలో ఉన్న నేరగాళ్లను అదుపులోకి తీసుకునేందుకు ఇది ఉపకరించనుంది. ఏజెన్సీలు వేగవంతంగా అంతర్జాతీయ పోలీసుల సహకారం తీసుకునేందుకు సీబీఐ (సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్) సహకారంతో దీనిని అభివృద్ధి చేశారు. "కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన దర్యాప్తు సంస్థలు ఇంటర్‌పోల్‌తో సులువుగా కనెక్ట్ అయ్యేందుకు ఇది వీలు కల్పిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా ఎదుర్కొంటున్న సవాళ్లను గమనించి, మన వ్యవస్థల్లో మార్పులు చేసుకోవాల్సిన, ఆధునిక సాంకేతికతలను ఉపయోగించాల్సిన సమయం ఇది. ఆ దిశగా భారత్‌పోల్ అనేది ఒక అడుగు" అని అమిత్ షా వెల్లడించారు. ఈ కొత్త వ్యవస్థతో పాటు, మూడు నేర చట్టాల గురించి రాష్ట్రాలకు శిక్షణ ఇచ్చే బాధ్యతను సీబీఐ తీసుకోవాలని ఈసందర్భంగా కోరారు.

## జాహ్నవి కారు ప్రమాదం కేసులో అమెరికా పోలీసుపై వేటు




**లాస్ వెగాస్:** 2023 ఫిబ్రవరిలో భారతీయ విద్యార్థిని కందుల జాహ్నవి .. అమెరికాలో పోలీసు పెట్రోలింగ్ వాహనం ఢీకొనడంతో మృతిచెందిన విషయం తెలిసిందే. ఆ ఘటనలో సియాటిల్ పోలీసులు చర్యలు తీసుకున్నారు. జాహ్నవిని ఢీకొట్టిన పోలీసు ఆఫీసర్ కెవిన్ డేవ్‌ను విధుల నుంచి తొలగించారు. సియాటిల్‌లో జనవరి 23వ తేదీన వీధిని క్రాస్ చేస్తున్న సమయంలో.. సుమారు 119 కిలోమీటర్ల వేగంతో వస్తున్న కెవిన్ డేవ్ వాహనం ఆమెను ఢీకొట్టింది. ఆమె 100 ఫీట్ల దూరంలో పడిపోయింది. ఆ ప్రమాదంలో జాహ్నవి ప్రాణాలు కోల్పోయింది.అయితే ఆ ఘటన పట్ల సియాటిల్ పోలీసు చీఫ్ సూ రాహర్ చర్యలు తీసుకున్నారు. సియాటిల్ పోలీసు శాఖ నుంచి డేవ్‌ను బహిష్కరిస్తున్నట్లు పోలీసులు చీఫ్ తెలిపారు. డేవ్ సుమారు నాలుగు ఉల్లంఘనలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. డ్రగ్ ఓవర్‌డోసు బాధిత వ్యక్తిని కాపాడేందుకు వేగంగా వెళ్తున్న ఆఫీసర్ డేవ్.. ఆ వేగంలోనే రోడ్డు క్రాస్ చేస్తున్న జాహ్నవిని ఢీకొట్టాడు. అనుకోకుండా ప్రమాదం జరిగినా, దాని పర్యవసానాలను ఆమోదించలేమని పోలీసు చీఫ్ తెలిపారు.పాజటివ్ ఉద్దేశంతో వేగంగా వెళ్తున్నా.. అతని నిర్ణయం వల్ల ఓ ప్రాణం బలైందన్నారు. దీంతో సియాటిల్ పోలీసుశాఖకు చెడ్డ పేరు వచ్చిందన్నారు. జాహ్నవి మృతి పట్ల నవ్వుకుంటూ కామెంట్ చేసిన మరో పోలీసు డేనియల్ ఆడెరర్‌ను కూడా ఫైర్ చేశారు.

## పాలనను బైడెన్ క్లిష్టతరంగా మారుస్తున్నారు: ట్రంప్



**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ అధ్యక్షుడిగా తన చివరి సమయంలో తీసుకున్న అధికారిక నిర్ణయాలు, చర్యలతో పరిపాలనను, అధికార బదిలీని కష్టతరం చేశారని కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆరోపించారు. తాను అధికారం స్వీకరించడానికి ముందే ఎన్ని కష్టతరమైన మార్పులు సాధ్యమో అన్నీ చేస్తున్నారని మండిపడ్డారు. న్యాయవ్యవస్థలో ఇలా జరగడం మునుపెన్నడూ చూడలేదని పేర్కొన్నారు. ఖరీదైన, అర్థంలేని పరిపాలనా ఉత్తర్వులు ఇచ్చి గ్రీన్ న్యూ స్కామ్, ఇతర రకాలుగా డబ్బును వృథా చేస్తున్నారని మండిపడ్డారు.

ఈ ఉత్తర్వుల విషయంలో అమెరికా ప్రజలు భయపడాల్సిన పనిలేదని, తాను అధికారం చేపట్టగానే వాటిని తొలగిస్తానన్నారు. తన పరిపాలనలో అమెరికాను మరింత శక్తివంతమైన దేశంగా నిలబెడతానన్నారు. ఇప్పటికే తాము రూపొందించిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ ద్వారా ప్రభుత్వ వ్యయాలను తగ్గించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

కాగా అమెరికా తీర ప్రాంతంలో చమురు, సహజవాయువు కోసం చేసే డ్రిల్లింగ్‌ను బైడెన్ నిషేధించారు. కాలిఫోర్నియా, ఒరెగాన్, తూర్పుగల్ఫ్ ఆఫ్ మెక్సికో మొదలైన ప్రదేశాల్లో 625 మిలియన్ ఎకరాల తీర ప్రాంతంలో ఆయిల్, గ్యాస్ డ్రిల్లింగ్‌లు చేపట్టకుండా చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. దేశీయ ఇంధన ఉత్పత్తిని ప్రోత్సహిస్తామని వాగ్దానం చేసిన ట్రంప్ ప్రమాణస్వీకారం చేయడానికి కొద్ది రోజుల ముందు బైడెన్ ఈ చర్యలు తీసుకోవడం గమనార్హం. అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఎన్నికను అమెరికా కాంగ్రెస్ సోమవారం లాంఛనంగా ధ్రువీకరించింది. గొప్ప ఎన్నికల్లో సాధించిన ఘన విజయాన్ని కాంగ్రెస్ ధ్రువీకరించడం చరిత్రలో పెద్ద పరిణామమని ట్రంప్ పేర్కొన్నారు. ట్రంప్‌పై పోటీచేసి ఓడిపోయిన ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ ఆయన విజయాన్ని ధ్రువీకరించే లాంఛనప్రాయ క్రతువుకు అధ్యక్షత వహించారు. అధికార బదలాయింపు శాంతియుతంగా జరిగేలా చూడడం తన పవిత్ర కర్తవ్యమని ఆమె ఒక వీడియో సందేశంలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం ఎంతటి సున్నితమైనదో చూస్తున్నామని, అధి కార మార్పిడి సాఫీగా పూర్తయ్యేందుకు అందరూ మద్దతుగా నిలవాల్సిన అవసరం ఉందని చెప్పారు.

## ఆ విషయంలో మాత్రం బాధగానే: జస్టిన్ ట్రూడో వ్యాఖ్య

**కెనడా:** కెనడా ప్రధానమంత్రి పదవి నుంచి వైదొలగనున్నట్లు జస్టిన్ ట్రూడో ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే తనకు ఓ విషయంలో మాత్రం నిరాశగా ఉందని వెల్లడించారు. "మనం ఎన్నికలకు వెళుతున్న వేళ.. నాకు ఒక్క విషయంలో మాత్రం బాధగా ఉంది. చాలా అంశాలు నామనసులో ఉన్నాయి. కానీ, ఒకటి మాత్రం ముఖ్యమైంది. ఒకేబ్యాలెట్ సాయంతోప్రజలు తమ పాలకుల్లో రెండో, మూడో ఛాయిస్‌లు కూడా ఎంచుకొనేలా చేయాలని భావించాను. కానీ అది నెరవేరలేదు" అని అన్నారు. 53 ఏళ్ల ట్రూడో పాలనపై కొంతకాలంగా కెనడా వాసుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. రాజకీయంగానూ ఆయన ఆటుపోట్లు ఎదుర్కొంటున్నారు. రాజీ నామా చేయాలని సొంత పార్టీ ఎంపీల నుంచి తీవ్ర ఒత్తిడి వస్తోంది. 2015లో ప్రధానిగా పగ్గాలు చేపట్టిన ట్రూడో.. ఇటీవల కాలంలో దేశీయంగా, అంతర్జాతీయంగా అపఖ్యాతి పాలయ్యారు.

### గాలికి ఎగిరిన రాజీనామా ప్రసంగం పేపర్లు..

ట్రూడో రాజీనామా ప్రకటన చేయడానికి ముందు పోడియం వద్ద ప్రసంగ పత్రాలు ఉంచారు. అయితే ఆ సమయంలో వేగంగా గాలి వీచడంతో ఆ పేపర్లు ఒక్కొక్కటిగా ఎగిరిపోయాయి. దానికి సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది. అయితే, తర్వాత పోడియం వద్దకువచ్చిన ట్రూడో ఆ పేపర్లను సరిచేసుకుంటూ కొంచెం ఇబ్బందిగా చిరునవ్వు నవ్వారు.

# శ్రీవారి ఆలయంలో శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం





**విశ్వంభర,తిరుమల :** తిరుమల శ్రీవారి ఆలయంలో మంగళ వారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈనెల 10వ తేదీన వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆలయం వెలుపల టీటీడీ చైర్మన్ బిఆర్ నాయుడు , ఈవో జె శ్యామలరావు ఆలయంలో జరిగిన సంప్రోక్షణ కార్యక్ర మంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉగాది , ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు వచ్చే మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ సందర్భంగా ఆనందనిలయం మొదలుకొని బంగారువాకిలి వరకు, శ్రీవారి ఆలయం లోపల ఉప దేవాలయాలు, ఆలయ ప్రాంగణం, పోటు, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను పవిత్రమైన పరిమళ జలాన్ని ప్రోక్షణ చేసి, నీటితో శుభ్రంగా కడుగుతారని వివరించారు. స్వామివారి మూలవిరాట్టు ను వస్త్రంతో పూర్తిగా కప్పి , శుద్ధి అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర పరిమళ జలాన్ని ఆలయమంతటా ప్రోక్షణం చేశారు. అనంతరం మూలవిరాట్టుకు కప్పిన వస్త్రాన్ని తొలగించి ప్రత్యేక పూజ, నైవేద్యం కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు భానుప్రకాష్ రెడ్డి, సాంబశివరావు, రాజశేఖర్ గౌడ్, సుచిత్ర యెల్లా, పనబాక లక్ష్మి, అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, సివిఎస్వో శ్రీధర్, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు,తదితరులు పాల్గొన్నారు.

### తిరుమలలో టోకెన్లు లేని భక్తులకు 12 గంటల్లో సర్వదర్శనం

తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. స్వామివారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో 16 కంపార్టుమెంట్లు నిండిపోయాయి. టోకెన్లు లేని భక్తులకు 12 గంటల్లో స్వామివారి సర్వదర్శనం అవుతుందని టీటీడీ అధికారులు వివరించారు. స్వామివారిని 54,180 మంది దర్శించుకోగా 17,689 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల వల్ల హుండీకి రూ. 3.20 కోట్లు వచ్చాయని తెలిపారు.

### తిరుమలకు వెళ్లే భక్తులకు అలర్ట్.. వైకుంఠ ద్వార దర్శనం టికెట్లను ఇలా ఈజీగా పొందండి!

వైకుంఠ ద్వార దర్శనాల నేపథ్యంలో తిరుమలకు వచ్చే భక్తులకు టీటీడీ కీలక సూచనలు చేసింది. జనవరి 10వ తేదీ నుంచి 19వ తేదీ వరకు పది రోజుల పాటు తిరుమలలో వైకుంఠ ద్వార దర్శనానికి అనుమతిస్తున్నారు. ఈ నేపథ్యంలో క్యూలైన్లలో రద్దీని నియంత్రించేందుకు టోకెన్లు, టికెట్లపై నిర్దేశించిన సమయం ప్రకారం మాత్రమే భక్తులను దర్శనానికి అనుమతిస్తామని తెలిపింది.అలాగే వైకుంఠ ద్వార దర్శనానికి ఆన్‌లైన్‌లో టికెట్లను పొందని భక్తులకు నేరుగా తిరుమల, తిరుపతిలో ఎస్ఎస్‌డీ టికెట్లు తీసుకునేలా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొంది. జనవరి 10, 11, 12వ తేదీలకు సంబంధించి జనవరి 9వ తేదీన ఉదయం 5 గంటల నుంచి 1.20 లక్షల టోకెన్లను టీటీడీ జారీ చేయనుంది. ఇందుకోసం తిరుపతిలోని 8 కేంద్రాలలో 90 కౌంటర్లను ఏర్పాటు చేసింది. అలాగే స్థానికుల కోసం తిరుమలలో మరో 4 కౌంటర్లు ఏర్పాటు చేసింది.తిరుపతిలో ఇందిరా మైదానం(15), రామచంద్ర పుష్కరిణి(10), శ్రీనివాసం కాంప్లెక్స్(12), విష్ణు నివాసం కాంప్లెక్స్(14), భూదేవి కాంప్లెక్స్(11), భైరాగిపట్టెడలోని రామానాయుడు ఉన్నత పాఠశాల(10), ఎంఆర్ పల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(8), జీవకోనలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(10), అదేవిధంగా తిరుమల స్థానికుల కోసం తిరుమల బాలాజీ నగర్ కమ్యూనిటీ హాల్(4)లో ఏర్పాట్లు చేసింది.జనవరి 13 నుంచి 19వ తేదీ వరకు ఏరోజుకారోజు ముందు రోజు టోకెన్లను తిరుపతిలోని భూదేవి కాంప్లెక్స్, శ్రీనివాసం, విష్ణు నివాసంలలో మాత్రమే టోకెన్లు జారీ చేయనున్నారు.

### ఈ నెల 9న ఎస్ఎస్‌డీ టికెట్ల నిలిపివేత

వైకుంఠ ద్వార దర్శనం టికెట్లు ఇస్తున్న నేపథ్యంలో ఈ నెల 9వ తేదీన శ్రీవారి సర్వదర్శనానికి సంబంధించిన ఎస్ఎస్‌డీ టికెట్లను జారీ చేయడం నిలిపివేసింది. ఆ రోజు వైకుంఠం క్యూ కాంప్లెక్స్-2 ద్వారా నేరుగా దర్శనం చేసుకోవచ్చని టీటీడీ సూచించింది. కాగా, వైకుంఠ ద్వార దర్శనాల నేపథ్యంలో పది రోజుల పాటు ఎలాంటి విశేష దర్శనాలకు భక్తులను అనుమతించరు. చంటి బిడ్డలు, వృద్ధులు, దివ్యాంగులు, రక్షణ శాఖ, ఎన్ఆర్ఐ మొదలైన అన్ని దర్శనాలను రద్దు చేసింది. వీఐపీ బ్రేక్ దర్శనాలకు కూడా ఈ రోజుల్లో అనుమతించరు.

## మోడల్ నియోజకవర్గంగా 'కుప్పం': సీఎం చంద్రబాబు



**విశ్వంభర, కుప్పం:** మోడల్ నియోజకవర్గంగా కుప్పాన్ని తీర్చిదిద్దుతామని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. అన్ని ప్రాంతాలతో సమానంగా.. అవసరమైతే మిన్నగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు. కుప్పంలోని తెదేపా కార్యాలయంలో 'జననాయకుడు' పేరిట ఫిర్యాదుల స్వీకరణకు పోర్టల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలు, పార్టీ కార్యకర్తల సమస్యలు, విజ్ఞప్తులను సీఎం పరిశీలించారు. ప్రతి కౌంటర్ వద్దకు స్వయంగా వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సమస్యలు, ఫిర్యాదులు రిజిస్టర్ చేసేలా ఈ పోర్టల్‌లో ఏర్పాట్లు చేశారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు. "ఫిర్యాదుల స్వీకరణకు 'జననాయకుడు' పేరుతో ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. ప్రజలతో పాటు తెదేపా నేతలు, కార్యకర్తలు తమ ఫిర్యాదులు, సమస్యలను నమోదు చేయవచ్చు. వాట్సప్ ద్వారా కూడా సమాచారం ఇవ్వొచ్చు. వాటిని పోర్టల్‌లో నమోదు చేసి విశ్లేషించి పరిష్కారం చూపుతాం. స్థానిక ఎమ్మెల్యేగా ఈ నియోజకవర్గం విషయంలో నాపై ప్రత్యేక బాధ్యత ఉంది. ఇక్కడి ప్రజలు వరుసగా 8సార్లు గెలిపించారు. సీఎంగాఉన్నందున అంచనాలు ఎక్కువగా ఉంటాయి. ఏఅర్జీ వచ్చినా నిర్దిష్టసమయంలో పరిష్కారమార్గం చూపిస్తాం. ఇదివినూత్న ప్రయోగం"అనిచంద్రబాబు అన్నారు.

## సంక్రాంతి రద్దీ.. 7,200 ప్రత్యేక బస్సులు నడపనున్న ఏపీఎస్ఆర్టీసీ




**విశ్వంభర, అమరావతి:** సంక్రాంతి పండగ దృష్ట్యా అదనపు బస్సులు నడపాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ఆర్టీసీ) నిర్ణయించింది. తెలంగాణ సహా ఇతర రాష్ట్రాలకు బస్సులు నడపాలని నిర్ణయం తీసుకున్నట్లు ఆర్టీసీ ఎండీ ప్రకటించారు. జనవరి 8 నుంచి మొదలు 13 వరకు 3,900 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్ నుంచి పలుచోట్లకు 2,153 బస్సులు, బెంగళూరు నుంచి 375, విజయవాడ నుంచి 300 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు చెప్పారు. తిరుగు ప్రయాణానికి ఈ నెల 16 నుంచి 20 వరకు 3,200 ప్రత్యేక బస్సులను నడపనున్నామని ఎండీ పేర్కొన్నారు. ప్రత్యేక బస్సుల్లో ఎలాంటి అదనపు ఛార్జీలుండవని, సాధారణ ఛార్జీలనే వసూలు చేస్తామన్నారు. ఒకేసారి రెండు వైపులా టికెట్లు బుక్ చేసుకుంటే టికెట్ ధరపై 10 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు ఆర్టీసీ ఎండీ తెలిపారు. ప్రత్యేక బస్సుల్లో ముందస్తు టికెట్ బుకింగ్ చేసుకునే సౌకర్యాన్ని కల్పించామన్నారు. ఆర్టీసీ బస్సుల్లో సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణం చేయాలని.. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఎక్కడికక్కడ ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

## 'గరికపాటిపై దుష్ప్రచారం.. వారిపై చట్టపరమైన చర్యలు'



**విశ్వంభర, హైదరాబాద్:** ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు పై జరుగుతున్న తప్పుడు ప్రచారంపై ఆయన టీమ్ స్పందించింది. కొన్ని యూట్యూబ్ ఛానళ్లు చేస్తున్న దుష్ప్రచారం ఆయన కుటుంబసభ్యులతో పాటు అభిమానులను కలత పెడుతోందని తెలిపింది. ఈ మేరకు గరికపాటి సోషల్ మీడియా ఖాతాలో ఓ పోస్ట్ పెట్టారు. "ఇటీవల కొందరు వ్యక్తులు, కొన్ని యూట్యూబ్ ఛానళ్లు తప్పుడు ప్రచారంతో పరువు తీస్తున్నారు. గరికపాటిపై వారు చేసిన ఆరోపణలన్నీ నిరాధారం.. సత్యదూరం. వేర్వేరు ఘటనల్లో ఎవరెవరికో చెప్పని క్షమాపణలు చెప్పినట్లుగా పేర్కొంటూ ఆయన గౌరవానికి భంగం కలిగించేలా ప్రచారం చేస్తున్నారు. అంతటితో ఆగకుండా పారితోషికాలు, ఆస్తుల విషయంలో కూడా అసత్య ప్రచారం జరుగుతోంది. వీటన్నింటినీ మేం తీవ్రంగా ఖండిస్తున్నాం. ఈ విషయంలో తప్పుడు ప్రచారం చేసిన యూట్యూబ్ ఛానళ్లు, సంస్థలపై క్రిమినల్, పరువు నష్టం కేసులు వేస్తాం. ఇకపై అలాంటి దుష్ప్రచారం చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం" అని పేర్కొన్నారు.

## సంక్రాంతి పండుగ సందర్భంగా విజయవాడ మీదుగా ప్రత్యేక రైళ్లు



**విశ్వంభర, అమరావతి :** సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీ దృష్ట్యా విజయవాడ మీదుగా ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు రైల్వే అధికారులు వివరించారు. రైలు నంబరు 07615 ప్రత్యేక రైలు ఈ నెల 11,15 తేదీల్లో కాచీగూడ లో సాయంత్రం 5.45 గంటలకు బయలు దేరి మరుసటి రోజు ఉదయం 9 గంటలకు శ్రీకాకుళం రోడ్‌కు చేరుకుంటుందని వివరించారు. తిరుగు ప్రయాణంలో ఇదే రైలు నంబరు 07616 ఈ నెల 12,16 తేదీల్లో శ్రీకాకుళం రోడ్‌లో మధ్యాహ్నం 2.45 కు బయలు దేరి మరుసటి రోజు ఉదయం 7.35 కి కాచీగూడ చేరుతుందని వెల్లడించారు. ఈ రైలు మల్కజిగిరి, చర్లపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు , విజయవాడ, ఏలూరు, తాడేపల్లి గూడెం, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, అనకాపల్లి , దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి, పొందురు స్టేషన్లలలో ఆగుతుందని పేర్కొన్నారు.రైలు నంబరు 07617 ప్రత్యేక రైలు ఈనెల 8న రాత్రి 7.20కు చర్లపల్లిలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9 గంటలకు శ్రీకాకుళం రోడ్ చేరుకుంటుందన్నారు. తిరుగు ప్రయాణంలో ఇదే రైలు నంబరు 07618 ఈ నెల 9న మధ్యాహ్నం 2.45 గంటలకు శ్రీకాకుళం రోడ్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6.30కి చర్లపల్లి చేరుతుందన్నారు.

## ఆ తల్లికి సమాధానం చెప్పే ధైర్యం ఉందా.. పవన్ కల్యాణ్‌ను నిలదీసిన రోజా


**విశ్వంభర, తాడేపల్లి:**
గేమ్‌ఛేంజర్ సినిమా ప్రిరిలీజ్ ఈవెంట్‌కు వెళ్లొస్తుండగాఇద్దరు అభిమానులు మరణించడానికి గత ప్రభుత్వమే కారణమంటూ ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై మాజీ మంత్రి, వైసీపీ నేత రోజా సెల్వమణి మరోసారి మండిపడ్డారు. సినిమాలను తీసి మా పిల్లల్ని చంపేస్తున్నారంటూ బాధిత తల్లి ఆవేదనతో మాట్లాడిన ఒక వీడియోను ట్విట్టర్‌లో రోజా పెట్టారు. కన్నబిడ్డను కోల్పోయిన ఈ తల్లిఆవేదనతో అడుడుగుతున్న ప్రతి మాటకు సూటిగా సమాధానం చెప్పే ధైర్యం ఉందా అని పవన్ కల్యాణ్‌ను నిలదీశారు. ఒక్కసారి ఈ విషయంలో ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. అధికారమదంతో కాకుండా మానవత్వంతో మాట్లాడాలని హితవు పలికారు. నిన్న కూడా పవన్ కల్యాణ్‌పై ట్విట్టర్ (ఎక్స్) వేదికగా రోజా మండిపడ్డారు. మానవత్వం మరిచి నిందలు వేస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫ్యాన్స్ చనిపోయి మూడు రోజులైనా వారి కుటుంబాలను పరామర్శించకపోగా చౌకబారు రాజకీయం చేయడం తగునా అని ప్రశ్నించారు. గేమ్ ఛేంజర్ సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్‌కు వెళ్లి ఇద్దరు అభిమానులు మణికంఠ, చరణ్ లు మరణించడం బాధాకరమని రోజా సెల్వమణి అన్నారు. తన కోసం వచ్చిన ఇద్దరు అభిమానులు చనిపోయి మూడు రోజులైనా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కనీసం పరామర్శించకపోవడం అమానవీయమని అన్నారు. తెలంగాణలో అల్లు అర్జున్, పుష్ప టీమ్ మానవత్వంతో వ్యవహరించలేదన్న పవన్ కల్యాణ్ ఇప్పుడు తన అభిమానులు మరణించి మూడు రోజులైనా వారి ఇళ్లకు వెళ్లి ధైర్యం చెప్పకపోవడం దారుణమని మండిపడ్డారు. ఆ యువకుల తల్లులు, కుటుంబాల కన్నీటి రోదన కనిపించడం లేదాఅని ప్రశ్నించారు. బాధితుల కుటుంబాలను పరామర్శించకపోగా వీరి మరణానికి గత వైసీపీ ప్రభుత్వం రోడ్డు వేయకపోవడమే కారణమని చౌకబారు రాజకీయం చేయడం తగునా అని పవన్ కల్యాణ్‌ను రోజా నిలదీశారు. ఏడు నెలలుగా రాష్ట్రాన్ని పాలిస్తున్నది మీ ప్రభుత్వ మే కదా అని ప్రశ్నించారు. 7 నెలలుగా ఆ జిల్లాకు మంత్రిగా ఉన్నది మీరే కాదా పవన్ కళ్యాణ్ అని అడిగారు. అంటే వీరిద్దరి మరణానికి మీకు ఓట్లేసి గెలిపించినందుకు మీరు కారణం కాదా అని ప్రశ్నించారు. మీ గుండె మీద చెయ్యి వేసుకొని ఆత్మ విమర్శ చేసుకోవాలని హితవు పలికారు. ఇదిలా ఉంటే ఈ ఘటనపై మాజీ మంత్రి అంబటి రాంబాబు కూడా పవన్ కల్యాణ్‌పై విమర్శలు గుప్పించారు. పుష్పకేమో నీతులు చెప్తారా? గేమ్‌ఛేంజర్‌కి పాటించరా అంటూ ట్విట్టర్ (ఎక్స్) వేదికగా ప్రశ్నించారు.

## ప్రజల ఆరోగ్యంతో కూటమి ప్రభుత్వం చెలగాటం ఆడుతోంది.. షర్మిల ధ్వజం



**విశ్వంభర, అమరావతి:** పేదవాడి ఆరోగ్యానికి భరోసా ఆరోగ్య శ్రీ అని ఏపీకాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్‌షర్మిల అన్నారు. దివంగత ముఖ్య మంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి మానస పుత్రిక ఈ పథకమని తెలిపారు. ప్రాణాలు తీసే జబ్బొచ్చినా సంజీవని లాంటి ఆరోగ్య శ్రీ పథకాన్ని.. కూటమి సర్కార్ అనారోగ్యశ్రీగా మార్చిందని విమర్శించారు. రూ.3వేల కోట్లు బకాయిలు చెల్లించకుండా, వైద్యసేవలు నిలిచే దాకా చూడటం అంటే.. పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రనే ఇదంతా అని ఆరోపించారు. ఆరోగ్య శ్రీపథకానికి మంగళం పాడి..ప్రజల ఆరోగ్యంతో కూటమి ప్రభుత్వంచెలగాటం ఆడుతోందని మండిపడ్డారు. ఆరోగ్యానికిపెద్దపీట అంటూనే కత్తిపీట వేస్తున్నారని కూటమి ప్రభుత్వంపై వైఎస్ షర్మిల మండిపడ్డారు. ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేస్తూ.. వదిలించుకునే ప్రయత్నాలు చేస్తున్నారనిఅన్నారు. ఆరోగ్య శ్రీపథకానికి బకాయిలు గత ప్రభుత్వం పెండింగ్ లో పెట్టినవి అయినా.. వాటిని చెల్లించే బాధ్యత మీ ప్రభుత్వంపైనే ఉందని తెలిపారు. ఈ సమస్య పరిష్కారానికి వెంటనే ఆసుపత్రుల యాజమాన్యాలను చర్చలకు పిలవాలని కాంగ్రెస్ పార్టీ తరపున డిమాండ్ చేశారు. పెండింగ్ బకాయిలు రూ.3వేల కోట్లు తక్షణం విడుదల చేయాలన్నారు. ఆరోగ్యశ్రీ సేవలను వెంటనే పునరుద్ధరించి, పథకానికి ఏ లోటూ రాకుండా చూడాలని డిమాండ్ చేశారు.

## కర్ణాటకలో రెండు హెచ్‌ఎంపీవీ కేసులతో ఏపీ అప్రమత్తం : మంత్రి సత్యకుమార్





**విశ్వంభర, అమరావతి :** కర్ణాటకలో రెండు హెచ్‌ఎంపీవీ ( హ్యూమన్ మెటాన్యుమో వైరస్) కేసులు వెలుగు చూడడంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమయ్యింది. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ అధికారులు వైరస్‌పై ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర వైద్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు. వైరస్ పట్ల రాష్ట్రానికి ఏ ప్రమాదం లేదని ఐఎంఆర్‌ఏ స్పష్టం చేసిందన్నారు. కొత్త వైరస్‌పై అధికారులతో నిర్వహిం చిన సమీక్ష అనంతం మీడియాతో మాట్లాడారు. నిరంతం నాలుగురోజు లుగా సమీక్షలు నిర్వహిస్తున్నామని, అన్ని జిల్లాలో వైద్య సిబ్బంది అలెర్ట్ చేశామని పేర్కొన్నారు. కేంద్రంతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ సలహాలు, సూచనలు తీసుకుంటున్నామని తెలిపారు. వైద్య అధికారుతో బృందాలను ఏర్పాటు చేశామని వివరించారు. ముందస్తు జాగ్రత్తలపై ప్రజలను అప్రమ త్తం చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. వైరస్ వచ్చినా సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు మందులను పీసీఆర్ టెస్టులు , మల్టీఫ్లెక్స్, యూనిఫ్లెక్స్ టెస్టులు చేయవలసిన అవసరముంటుందని, వాటిని అందుబాటలో ఉంచేం దుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. కర్ణాటక, దేశవ్యా ప్తంగా జరుగుతున్న పరిణామాలను దగ్గరునుంచి పరిశీలిస్తున్నామని తెలిపారు.

## గేమ్ ఛేంజర్ ప్రీ రిలీజ్‌కు వెళ్లి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు పవన్‌కల్యాణ్ ఆర్థిక సాయం



**విశ్వంభర, అమరావతి :** గేమ్ ఛేంజర్ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు హాజరై తిరిగి వెళ్తున్న ఇద్దరు అభిమానులు దుర్మరణం చెందడం పట్ల ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 4న తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం శివారులో నిర్వహించిన గేమ్ ఛేంజర్ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. కాకినాడకు చెందిన మణికంఠ, చరణ్ అనే ఇద్దరు అభిమానులు వేడుకకు హాజరై తిరిగి వెళ్తుండగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ ఈవెంట్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన పవన్ కల్యాణ్ రోడ్డు ప్రమాదంపై ఆవేదన వ్యక్తం చేస్తు మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున సహాయాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ బాధిత కుటుంబాలను పరామర్శించి రూ. 5లక్షల చెక్కును అందజేశారు. బాధిత కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామని ప్రకటించారు.

## పోలీసుల అదుపులో ఎంపీ అవినాష్‌రెడ్డి పీఏ రాఘవరెడ్డి



**విశ్వంభర, పులివెందుల:** కడప ఎంపీ అవినాష్‌రెడ్డి పీఏ రాఘవరెడ్డిని పులివెందులలోని ఆయన నివాసంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హైకోర్టు ముందస్తు బెయిల్ తిరస్కరించడంతో పులివెందులలోని అతని ఇంటికి వెళ్లిన పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త వర్రా రవీందర్‌రెడ్డితో అసభ్యకర పోస్టులు పెట్టించారని రాఘవరెడ్డిపై అభియోగాలు ఉన్నాయి. నవంబరు 8న నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసులో రాఘవరెడ్డి 20వ నిందితుడిగా ఉన్నారు. ఈ కేసు దర్యాప్తు అధికారిగా పులివెందుల డీఎస్పీ మురళీ నాయక్ వ్యవహరిస్తున్నారు. రాఘవరెడ్డిని పోలీసులు అరెస్టు చేస్తారనే ప్రచారంతో వైకాపా కార్యకర్తలు భారీగా పులివెందుల పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు.

## రోహిత్ శర్మ ముందున్న

# రెండు లక్ష్యాలు అవే..

**- చిన్ననాటి కోచ్ దినేశ్ లాడ్**

**ముంబయి:** టీమ్ఇండియా కెప్టెన్ రోహిత్ శర్మకు అతని చిన్ననాటి కోచ్ దినేశ్ లాడ్ కీలక సూచన చేశాడు. రోహిత్ టెస్టు మ్యాచ్‌లు ఆడే ముందు దేశవాళీ క్రికెట్ ఆడాలన్నాడు. ఇటీవల కాలంలో టెస్టుల్లో హిట్‌మ్యాన్ జోరు తగ్గింది. సొంతగడ్డపై కివీస్‌తో మూడు టెస్టుల సిరీస్‌లో నిరాశపర్చిన అతను.. ఆస్ట్రేలియాలో జరిగిన బోర్డర్‌గావస్కర్ ట్రోఫీలోనూ విఫలమయ్యాడు. ఐదు ఇన్నింగ్స్‌ల్లో 31 పరుగులు మాత్రమే చేశాడు. దీనికితోడు బీజీటీ సిరీస్‌ను భారత్ 13తో కోల్పోవడంతో రోహిత్‌పై టీమ్ఇండియా అభిమానులు విమర్శలు చేస్తున్నారు. అతడిని టెస్టుల్లోంచి వైదొలగాలని డిమాండ్ చేస్తున్నారు. రోహిత్, విరాట్ కోహ్లీ దేశవాళీ క్రికెట్ ఎందుకు ఆడట్లేదని ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో దినేశ్ లాడ్ స్పందించాడు.'రోహిత్‌కి కేవలం రెండు లక్ష్యాలు మాత్రమే ఉన్నాయని అనుకుంటున్నాను మొదటిది ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ గెలవడం. రెండవది వన్డే ప్రపంచకప్ సాధించడం. అతను అన్ని ఫార్మాట్ల నుంచి రిటైర్ కావాలనుకుంటే టీ20 ప్రపంచకప్ గెలిచిన తర్వాత అయ్యేవాడు. కానీ అంతర్జాతీయ టీ20ల నుంచి మాత్రమే రిటైర్ అయ్యాడు. పరుగులు చేయడానికి ఇబ్బంది పడుతున్న క్రికెటర్ ఇతనొక్కడే కాదు. రోహిత్ టెస్టు మ్యాచ్‌లకు సిద్ధం కావడానికి ముందు ఒకట్రెండు దేశవాళీ మ్యాచ్‌లు ఆడాలి. ఎందుకంటే టీ20 క్రికెట్ బ్యాటర్ల మనస్తత్వాన్ని మార్చేసింది. అతను టెక్నిక్‌పరంగా అద్భుతమైన క్రికెటర్. గత సంవత్సరం ఇంగ్లాండ్‌పై బాగా ఆడాడు. మనం (టీమ్ఇండియా) గెలిస్తే ప్రజలు రోహిత్‌ని ఉత్తమ కెప్టెన్ అంటారు. కానీ ఓడిపోతే అతడికి కెప్టెన్సీ తెలియదని అంటున్నారు' అని దినేశ్ లాడ్ పేర్కొన్నారు.

## మహ్మద్ షమి గురించి సరైన సమాచారం ఎందుకు లేదు

**- రవిశాస్త్రి**

**ముంబయి:** ఇటీవల ముగిసిన బోర్డర్‌గావస్కర్ ట్రోఫీలో టీమ్ఇండియాకు చేదు అనుభవం ఎదురైంది. హ్యాట్రిక్ సాధించాలని ఆస్ట్రేలియా గడ్డపై అడుగు పెట్టిన భారత్.. చివరకు ఒక్క మ్యాచ్‌లోనే విజయం సాధించి సిరీస్‌ను 13తో కోల్పోయింది. స్టార్ ఆటగాళ్లు విఫలమవడం, మిడిల్ ఆర్డర్ నిలకడ లేమి, బుమ్రాకు ఇతర బౌలర్ల నుంచి సరైన సహకారం అందకపోవడం టీమ్ఇండియాను దెబ్బతీశాయి. బుమ్రాకు తోడుగా మహ్మద్ షమి ఉంటే పరిస్థితి వేరుగా ఉండేది. కానీ, షమిని ఆస్ట్రేలియా పర్యటనకు ఎంపిక చేయలేదు. అతను ఆడటంపై తొలి నుంచి గందరగోళ పరిస్థితి నెలకొంది. గాయం నుంచి కోలుకున్న షమి దేశవాళీ క్రికెట్‌లో రాణించడంతో ఆసీస్‌తో చివరి రెండు టెస్టులకు ఎంపిక చేస్తారనే ప్రచారం జరిగింది. షమి పూర్తిస్థాయి ఫిట్‌నెస్‌తో లేదని బీసీసీఐ మెడికల్ టీమ్ తేల్చడంతో అతను భారత్‌లోనే ఉండిపోయాడు. ఈ నేపథ్యంలో షమి గురించి సరైన సమాచారం ఎందుకు బయటకు రాలేదని భారత మాజీ కోచ్ రవిశాస్త్రి ప్రశ్నించాడు. అనుభవజ్ఞుడైన షమిని ఆస్ట్రేలియాకు తీసుకెళ్లి ఉంటే భారత జట్టుగా బలంగా ఉండేదని, అతడిని ఆడించాలా? వద్దా అనేది తర్వాత నిర్ణయిస్తే సరిపోయేదని అభిప్రాయపడ్డాడు.

'నిజం చెప్పాలంటే మహ్మద్ షమికి సరిగ్గా ఏమి జరిగిందో మీడియాలో జరుగుతున్న ప్రచారంతో నేను చాలా ఆశ్చర్యపోయాను. అతను కోలుకున్నాడా? అసలు ఎక్కడ ఉన్నాడు?. ఎన్‌సీఏ వెళ్లాడు. అక్కడ ఎన్ని రోజులు ఉన్నాడో తెలియదు. అతను ఎక్కడ ఉన్నాడనే దానిపై సరైన సమాచారం ఎందుకు బయటపడదు? అతడు సామర్థ్యం ఉన్న ఆటగాడు. నేనైతే అతడిని ఆస్ట్రేలియాకు తీసుకువెళ్లి జట్టులో భాగం చేసేవాడిని. జట్టుతో ఉంటూనే రిహబిలిటేషన్ జరిగేలా చూసేవాడిని. అత్యుత్తమ ఫిజియోలతో మాట్లాడేవాడిని. ఆస్ట్రేలియాలో ఉన్న అంతర్జాతీయ ఫిజియోల నుంచి కూడా సలహాలు తీసుకుని షమి ఆడే విధంగా చర్యలు తీసుకునేవాడిని. ఒకవేళ మూడో టెస్టు మ్యాచ్ నాటికి షమి సిరీస్‌లోని మిగతా మ్యాచ్‌లు ఆడలేడని అనుకుంటే నేను అతడిని వదిలేసేవాడిని' అని రవిశాస్త్రి వెల్లడించాడు.



# టీమ్ఇండియాకు భారీ షాక్.. 9 ఏళ్ల తర్వాత మూడో స్థానానికి



**ముంబయి:** ఆస్ట్రేలియా చేతిలో బోర్డర్‌గావస్కర్ ట్రోఫీ సిరీస్‌ను కోల్పోయిన బాధలో ఉన్న టీమ్ఇండియాకు మరో షాక్ తగిలింది. ఐసీసీ తాజా టెస్టు ర్యాంకింగ్స్‌లో భారత జట్టు మూడో స్థానానికి పడిపోయింది. టీమ్ఇండియా 2016 తర్వాత తొలిసారి మూడో స్థానానికి పడిపోవడం గమనార్హం. పాకిస్థాన్‌తో జరిగిన రెండో టెస్టులో దక్షిణాఫ్రికా 10 వికెట్ల తేడాతో గెలిచి వరుసగా ఏడో విజయాన్ని నమోదు చేసింది. ఈ క్రమంలోనే పాక్‌తో రెండు టెస్టుల సిరీస్‌ను 20 క్లీన్‌స్వీప్ చేసింది. పాకిస్థాన్‌తో రెండో టెస్టులో విజయంతో సఫారీల జట్టు టీమ్ఇండియాను వెనక్కినెట్టి టెస్టు ర్యాంకింగ్స్‌లో రెండో స్థానానికి చేరుకుంది.

**అగ్రస్థానంలో ఆసీస్..**

ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్‌లో తలపడనున్న ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా జట్లు.. టెస్టు ర్యాంకింగ్స్‌లోనూ టాప్ 2లో నిలిచాయి. బోర్డర్‌గావస్కర్ ట్రోఫీ సిరీస్‌లో భారత్‌ను 13తో ఓడించి ఫైనల్‌కు చేరుకున్న ఆస్ట్రేలియా రేటింగ్ పాయింట్లను గణనీయంగా పెంచుకుని అగ్రస్థానాన్ని పటిష్టం చేసుకుంది. ఆసీస్ (126 పాయింట్లు), దక్షిణాఫ్రికా (112), భారత్ (109), ఇంగ్లాండ్ (106), న్యూజిలాండ్ (96) టాప్ 5లో ఉన్నాయి. శ్రీలంక (87), పాకిస్థాన్ (83), వెస్టిండీస్ (75), బంగ్లాదేశ్ (65), ఐర్లాండ్ (26) వరుసగా తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

**8 మ్యాచ్‌ల్లో ఒక్కటే విజయం..**

టీమ్ఇండియా గత ఎనిమిది టెస్టుల్లో ఒక్క మ్యాచ్‌లోనే విజయం సాధించింది. ఆరు మ్యాచ్‌ల్లో ఓటమిపాలైంది. ఒకటి డ్రాగా ముగిసింది. ఈ ప్రభావంతో మొదటిసారి డబ్ల్యూటీసీ ఫైనల్‌కు దూరమైన భారత్.. టెస్టు ర్యాంకింగ్స్‌లోనూ మూడో స్థానానికి దిగజారింది. 202325 డబ్ల్యూటీసీలో భారత్ 19 మ్యాచ్‌లు ఆడి 9 విజయాలు, 8 ఓటములు, 2 డ్రాలు నమోదు చేసింది. బీజీటీ ఓటమి అనంతరం ఈ పాయింట్ల పట్టికలో టీమ్ఇండియా 50 శాతంతో మూడో స్థానంలో నిలిచింది.

**ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డుకు బుమ్రా నామినేట్..**

బోర్డర్‌గావస్కర్ ట్రోఫీ సిరీస్‌లో అదరగొట్టిన భారత పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా డిసెంబరు నెలకుగాను ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డుకు నామినేట్ అయ్యాడు. బుమ్రాతోపాటు కమిన్స్ (ఆస్ట్రేలియా), డ్యాన్ ప్యాటర్సన్ (సౌతాఫ్రికా) కూడా ఈ అవార్డు రేసులో నిలిచారు. బీజీటీలో బుమ్రా 32 వికెట్లు పడగొట్టి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచిన సంగతి తెలిసిందే.

## రోహిత్, కోహ్లీ గతంలో ఏం సాధించారో ప్రజలు మర్చిపోయారు

**- యువరాజ్ సింగ్**



**ముంబయి:** టీమ్ఇండియా స్టార్ ఆటగాళ్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ కొంతకాలంగా టెస్టుల్లో విఫలమవుతున్నారు. ముఖ్యంగా ఇటీవల ఆస్ట్రేలియాతో జరిగిన బోర్డర్‌గావస్కర్ ట్రోఫీలో తీవ్ర నిరాశపర్చారు. అంతకుముందు స్వదేశంలో కివీస్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లోను ఇదే తీరు. ఫలితంగా రెండు సిరీస్‌ల్లో భారత్‌కు పరాభవం ఎదురైంది. ఈక్రమంలోనే రోహిత్, విరాట్‌పై పలువురు మాజీలు, అభిమానుల తీవ్ర విమర్శలు చేస్తున్నారు. జట్టు నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే, భారత మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ వీరిద్దరికి మద్దతుగా నిలిచాడు.

'నావరకైతే బోర్డర్‌గావస్కర్ ట్రోఫీ సిరీస్ ఓటమి కంటే న్యూజిలాండ్‌తో టెస్టు సిరీస్ కోల్పోవడం చాలా బాధాకరం. ఎందుకంటే స్వదేశంలో 03తో వైట్‌వాష్ అయింది. ఇది ఆమోదయోగ్యం కాదు. ఆస్ట్రేలియాలో గత రెండుసార్లు భారత్ గెలిచింది. ఈసారి ఓడింది. గొప్ప ఆటగాళ్లయిన విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలపై విమర్శలు చేస్తున్నారు. వారి గురించి చాలా చెడుగా మాట్లాడుతున్నారు. వారిద్దరూ గతంలో ఏం సాధించారో ప్రజలు మర్చిపోయారు. ఈ కాలపు గొప్ప క్రికెటర్లలో రోహిత్, కోహ్లీ కూడా ఉంటారు. సరే.. టీమ్ఇండియా ఓడింది. వారిద్దరూ బాగా ఆడలేదు. దీనికి వారు మనకంటే ఎక్కువగా బాధ పడుతున్నారు.

కోచ్ గౌతమ్ గంభీర్, చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, బుమ్రాలకు మంచి క్రికెట్ మైండ్ ఉంది. భవిష్యత్తులో భారత క్రికెట్‌కు ఎలా ముందుకుసాగాలో వారే నిర్ణయించుకోవాలి. బాగా ఆడకపోతే కెప్టెన్ స్వయంగా జట్టు నుంచి బయటకువెళ్లడం గతంలో నేనెప్పుడూ చూడలేదు. తనకంటే జట్టు ప్రయోజనాలే ముఖ్యమని రోహిత్ అనుకున్నాడు. ఇది అతని గొప్పతనం. ఓడినా, గెలిచినా అతను గొప్ప కెప్టెన్. రోహిత్ సారథ్యంలో వన్డే ప్రపంచ కప్ ఫైనల్ వరకు వెళ్లాం. టీ20 ప్రపంచకప్ గెలిచాం. ఇంకా ఎన్నో సాధించాం. ఆటగాళ్లు రాణించనప్పుడు వారి గురించి చెడుగా చెప్పడం సులభం. కానీ వారికి మద్దతుగా నిలవడం చాలా కష్టం. వారి గురించి చెడుగా మాట్లాడటమే మీడియా పని. రోహిత్, విరాట్ నా ఫ్యామిలీ. నా కుటుంబం, సోదరులకు మద్దతుగా నిలవడం నా విధి' అని యువరాజ్ పేర్కొన్నాడు.

# టీమ్ ఇండియాలో దిద్దుబాటు చర్యలు..



**ముంబయి:** బోర్డర్‌గావస్కర్ ట్రోఫీలో ఓటమితో టీమ్ ఇండియా దిద్దుబాటు చర్యలు చేపట్టింది. గత ఎనిమిది టెస్టుల్లో భారత్ ఆరు ఓటములు చవి చూసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జట్టు ప్రక్షాళన సీనియర్లైన రోహిత్, కోహ్లీతోనే మొదలుపెట్టనున్నట్లు ప్రచారం జోరందుకొంది. ఈ నేపథ్యంలో బీసీసీఐ కొత్త కార్యదర్శి పదవి చేపట్టనున్న దేవజిత్ సైకియా స్పందించినట్లు తెలుస్తోంది. ఆయన నుంచి కొత్త జట్టు ఎంపికపై సెలక్టర్లకు కఠిన సందేశం వెళ్లినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా చీఫ్ సెలక్టర్ అగార్కర్ కొత్త జట్టును ఎంపిక చేసే విషయంలో డోలాయమాన పరిస్థితిని ముగించాలని సూచించినట్లు వార్తలొస్తున్నాయి.

ప్రస్తుత పరిస్థితిపై చర్చించేందుకు బీసీసీఐ ఆదివారం ప్రత్యేకంగా సమావేశం కానుంది. దీనిలో జట్టు భవిష్యత్తుపై కీలక నిర్ణయాలు ఉండొచ్చని బీసీసీఐ మాజీ ప్రతినిధి ఒకరు పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో బీసీసీఐ బలహీనంగా కనిపిస్తోందని.. ఈ నేపథ్యంలో బలమైన సందేశం పంపాల్సివుందని తెలిపారు. "చాలా చెడు సందేశం వెళ్లింది. దేశంలో క్రికెట్‌ను బీసీసీఐ నడపాలి. ఇప్పుడు కొత్త జట్టును ఎంపిక చేయాల్సిన అవసరం ఉంది. సెలక్షన్ కమిటీ బీసీసీఐదే. అందుకే చీఫ్ సెలక్టర్ అగార్కర్‌ను పిలిచి కఠిన సందేశం పంపించాలని చెప్పాలి" అని సదరు మాజీ అధికారి పేర్కొన్నారు.

ఈ సిరీస్‌లో రోహిత్, కోహ్లీ ఘోరంగా విఫలమయ్యారు. పెర్త్ టెస్ట్ రెండో ఇన్నింగ్స్‌లో శతకాన్ని తీసేస్తే.. మిగిలిన మ్యాచ్‌ల్లో విరాట్ చేసిన పరుగులు 91. మరోవైపు సిరీస్‌లోని ఐదు ఇన్నింగ్స్‌ల్లో కలిపి రోహిత్ 6.2 సగటుతో 31 పరుగులు సాధించాడు. తప్పని పరిస్థితిలో చివరి టెస్ట్ నుంచి వైదొలగాడు. ఇక సెప్టెంబర్ నుంచి ఆడిన మొత్తం మ్యాచ్‌లు కలిపి హిట్‌మ్యాన్ 164 రన్స్ మాత్రమే చేశాడు. సిడ్నీ టెస్ట్ జట్టు నుంచి డ్రాప్ అయిన తర్వాత రోహిత్ మాట్లాడుతూ రిటైర్మెంట్ ఆలోచన లేదని చెప్పడంతో.. స్టార్ల విషయంలో బోర్డు బలహీనంగా ఉన్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. తాజాగా ఈ నేపథ్యంలో సైకియా కఠిన నిర్ణయాలకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. మరోవైపు ఛాంపియన్స్ ట్రోఫీకి పంపే జట్టుకు సంబంధించి ప్రాథమిక సభ్యుల జాబితాను 12లోపల సమర్పించాల్సి ఉంది.

## పాకిస్థాన్ జట్టుకు ఐసీసీ భారీ జరిమానా



**దుబాయ్:** పాకిస్థాన్ క్రికెట్ జట్టుకు అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ భారీ జరిమానా విధించింది. జట్టు సభ్యులందరికీ మ్యాచ్ ఫీజులో 25శాతం కోత విధించింది. అంతేకాకుండా వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ లో 5 పాయింట్లను తగ్గించింది. న్యూలాండ్స్ వేదికగా దక్షిణాఫ్రికాతో జరిగిన రెండో టెస్టులో స్లో ఓవర్ రేట్ కారణంగా పాకిస్థాన్ ఈ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. మ్యాచ్ పూర్తయ్యే సమయానికి పాకిస్థాన్ జట్టు ఐదు ఓవర్లు తక్కువగా వేసినట్లు తేలింది. దీంతో మ్యాచ్ రిఫరీ రిచర్డ్‌సన్ పాక్ జట్టుకు జరిమానా విధించినట్లు ఐసీసీ ఓ ప్రకటనలో పేర్కొంది.ఐసీసీ నిబంధనల ప్రకారం ఆటగాళ్లు.. నిర్ణీత గడువులోగా బౌలింగ్ చేయలేకపోతే.. ఆ ఓవర్‌కు వారి మ్యాచ్ ఫీజులో 5 శాతం కోత విధిస్తారు. అంతేకాకుండా డబ్ల్యూటీసీ పాయింట్లను కూడా తగ్గిస్తారు. ఇలా మొత్తం మ్యాచ్‌లో పాకిస్థాన్ 5 ఓవర్లు ఆలస్యంగా వేసినందువల్ల మొత్తం ఫీజులో 25శాతం కోత విధించారు. మరోవైపు పాకిస్థాన్ జట్టు కెప్టెన్ షాన్ మసూద్ జరిమానాను అంగీకరించినట్లు ఐసీసీ పేర్కొంది. డబ్ల్యూటీసీ పాయింట్ల జాబితాలో పాకిస్థాన్ ప్రస్తుతం 8వ స్థానంలో ఉంది. జూన్‌లో లార్డ్స్ వేదికగా జరగబోయే డబ్ల్యూటీసీ ఫైనల్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా జట్లు తలపడనున్నాయి.

## 'గిల్‌కు అంత సీన్ లేదని చెబుతూనే ఉన్నా.. ఎవరూ నా మాట వినలేదు'



**ముంబయి:** ఇటీవల ముగిసిన బోర్డర్ గావస్కర్ ట్రోఫీలో టీమ్ఇండియా 13తో ఓటమి పాలైంది. దీంతో ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ రేసు నుంచి భారత్ నిష్క్రమించింది. భారత బ్యాటర్లలో యశస్వి జైస్వాల్ (10 ఇన్నింగ్స్‌ల్లో 391), నితీశ్‌కుమార్ రెడ్డి (9 ఇన్నింగ్స్‌ల్లో 298) మాత్రమే రాణించారు. మిగతా ఆటగాళ్లు తీవ్రంగా నిరాశపర్చారు. భవిష్యత్‌లో స్టార్ ఆటగాడు అవుతాడని భావిస్తున్న శుభ్‌మన్ గిల్ (5 ఇన్నింగ్స్‌ల్లో 93) కూడా నిలకడ ప్రదర్శించలేకపోయాడు. ఈనేపథ్యంలో గిల్‌పై భారత మాజీ క్రికెటర్, 1983 ప్రపంచకప్ గెలిచిన టీమ్ఇండియా జట్టులో సభ్యుడు కృష్ణమాచారి శ్రీకాంత్ విమర్శలు గుప్పించాడు. అతను ఓవర్‌రేటెడ్ ప్లేయర్ అని వ్యాఖ్యానించాడు. జాతీయ జట్టుకు ఆడే అర్హత ఉన్న ఇతర ఆటగాళ్లను సెలక్టర్లు విస్మరిస్తున్నారని పేర్కొన్నాడు.

'శుభ్‌మన్ గిల్ ఓవర్ రేటెడ్ క్రికెటర్ అని నేను ప్రతిసారీ చెబుతూనే ఉన్నాను. కానీ, ఎవరూ నా మాట వినలేదు. గిల్‌కు ఇన్ని అవకాశాలు లభిస్తున్నప్పుడు సూర్యకుమార్ యాదవ్ వంటి ఆటగాళ్లకు కూడా టెస్టుల్లో ఎక్కువ ఛాన్స్‌లు ఇవ్వకపోవడం కొందరిని ఆశ్చర్యానికి గురిచేయొచ్చు. సూర్యకుమార్ టెస్టుల్లో శుభారంభం లేదు. కానీ, అతను టెక్నిక్, బాగా ఆడే సత్తా ఉన్న ప్లేయర్. కానీ.. మేనేజ్‌మెంట్, సెలెక్టర్లు సూర్యపై వైట్‌బాల్ స్పెషలిస్టు అనే ముద్ర వేశారు. మీరు ప్రతిభ ఉన్న యువ ఆటగాళ్లపై దృష్టిసారించాలి. ఉదాహరణకు రుతురాజ్ గైక్వాడ్ ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో అద్భుతంగా రాణిస్తున్నాడు. కానీ వాళ్లు అతడిని ఎంపిక చేయలేదు. సాయి సుదర్శన్ లాంటి వారు ఇండియా 'ఎ' టూర్‌లలో మెరుస్తున్నారు. ఇలాంటి యువ ప్లేయర్లను మీరు ప్రోత్సహించాలి. ప్రతిభావంతులకు బదులుగా శుభ్‌మన్ గిల్‌కే అవకాశాలిస్తున్నారు' అని కృష్ణమాచారి శ్రీకాంత్ పేర్కొన్నాడు.

## ఆండ్రాయిడ్ 15తో ₹7 వేలకే మోటో కొత్త మొబైల్.. ఫీచర్లు ఇవే

**ముంబయి:** ప్రముఖ మొబైల్ తయారీ కంపెనీ మోటోరొలా బడ్జెట్ ధరలో కొత్త మొబైల్‌ను భారత్ మార్కెట్లోకి తీసుకొచ్చింది. మోటో జీ05 పేరిట దీన్ని లాంచ్ చేసింది. 50ఎంపీ కెమెరాతో తక్కువ ధరలో తీసుకురావడం విశేషం. అంతేకాదు ఔటాఫ్ ది బాక్స్ ఆండ్రాయిడ్ 15తో వస్తోంది. మోటో కొత్త మొబైల్ ఒక్క వేరియంట్‌లో లభిస్తుంది. 4జీబీ+64జీబీ వేరియంట్ ధర రూ.6,999గా కంపెనీ నిర్ణయించింది. ఫారెస్ట్ గ్రీన్, ప్లమ్ రెడ్ రంగుల్లో లభిస్తుంది. జనవరి 13 నుంచి ఫ్లిప్‌కార్ట్, మోటోరొలా వెబ్‌సైట్‌తో పాటు ఆఫ్‌లైన్ రిటైల్ స్టోర్లలో ఈ ఫోన్‌ను విక్రయించనున్నారు.

జీ05 స్పెసిఫికేషన్ల విషయానికొస్తే.. 6.67 అంగుళాల హెచ్‌డీ+ ఎల్‌సీడీ డిస్‌ప్లే, 90Hz రిఫ్రెష్ రేటు, 1,000 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్ ఇస్తుంది. మీడియాటెక్ హీలియో జీ81 ఎక్స్‌ట్రీమ్ ప్రాసెసర్ అమర్చారు. ఆండ్రాయిడ్ 15 ఆధారంగా పనిచేస్తుంది. మైక్రో ఎస్‌డీ కార్డ్ సాయంతో స్టోరేజీ పెంచుకొనే సదుపాయం కల్పిస్తోంది. వెనుకవైపు 50 ఎంపీ కెమెరా, ముందువైపు సెల్ఫీల కోసం 8 ఎంపీ కెమెరా ఇచ్చారు. ఇందులో 5,200mAh బ్యాటరీ అమర్చారు. ఇది 18W ఫాస్ట్ ఛార్జింగ్‌కు సపోర్ట్ చేస్తుంది. IP52 రేటింగ్‌తో ఈ మొబైల్‌ను తీసుకొచ్చారు. బ్లూటూత్ 5.0, 3.5 ఎంఎం ఆడియో జాక్, యూఎస్‌బీ టైప్‌సి పోర్ట్ వంటి కనెక్టివిటీ ఫీచర్లు ఉన్నాయి.



# ఆటో మొబైల్ సేల్స్‌లో గతేడాది 9% వృద్ధి



ఢిల్లీ: దేశీయంగా ఆటో మొబైల్ రిటైల్ అమ్మకాల్లో మెరుగైన వృద్ధి నమోదైంది. అంతకుముందు ఏడాదితో (2023) పోలిస్తే 2024లో 9శాతం మేర విక్రయాలు పెరిగాయి. ఓవైపు ప్రతికూలతలు ఉన్నా.. టూవీలర్, పాసింజర్ వాహనాలకు ఉన్న డిమాండ్ కారణంగా మెరుగైన వృద్ధి నమోదైనట్లు ఆటోమొబైల్ డీలర్స్ సమాఖ్య ఫాడా వెల్లడించింది. ఈమేరకు గతేడాదికి సంబంధించిన డేటాను విడుదల చేసింది. 2023 క్యాలెండర్ సంవత్సరంలో 2,39,28,293 యూనిట్లు అమ్ముడవగా.. 2024లో 2,61,07,679 యూనిట్ల మేర అమ్మకాలు నమోదైనట్లు ఫాడా తెలిపింది.

అటు కేంద్రంలోనూ, ఇటు రాష్ట్రాల్లోనూ ఎన్నికలు, అటు వేసవిలోనూ, వర్షాకాలంలోనూ అసమాన పరిస్థితులను తట్టుకొని మరీ ఆటోమొబైల్ రంగం నిలకడగా రాణించిందని ఫాడా ప్రెసిడెంట్ సీఎస్ విఘ్నేశ్వర్ తెలిపారు. గ్రామీణభారతం నుంచి మెరుగైన డిమాండ్, సప్లయ్ చైన్ అవరోధాలు తొలగడం వంటి కారణాల వల్ల మెరుగైన టూవీలర్ అమ్మకాలు నమోదైనట్లు పేర్కొన్నారు. కొత్త ఉత్పత్తులు, నెట్‌వర్క్ విస్తరణ వంటివి పాసింజర్ వాహనాల అమ్మకాల వృద్ధికి దోహదం చేసినట్లు తెలిపారు. రెండో అర్ధభాగంలో మాత్రం కార్లు పేరుకుపోవడంతో డిస్కౌంట్ వార్ ఏర్పడిందని చెప్పారు. ఎన్నికలు, మౌలిక వసతులపై ఖర్చు తగ్గడం వంటి కారణాల వల్ల వాణిజ్య వాహనాలకు ఆశించిన మేర గిరాకీ రాలేదన్నారు. భవిష్యత్‌లో మాత్రం అన్ని విభాగాల్లోనూ మెరుగైన విక్రయాలు నమోదుకావొచ్చని అంచనా వేశారు.

**2024 విక్రయాలు ఇలా..**

2023లో 38,73,381 పాసింజర్ వాహనాలు అమ్ముడవగా.. 2024లో ఐదు శాతం వృద్ధితో 40,73,843 యూనిట్లు అమ్మడయ్యాయి. టూవీలర్ అమ్మకాల్లో 11 శాతం వృద్ధి నమోదైంది. 2023లో 1,70,72,932 యూనిట్లు అమ్ముడుపోగా.. 2024లో 1,89,12,959 యూనిట్లు విక్రయమయ్యాయి.త్రిచక్ర వాహన అమ్మకాలు 2023లో 11,05,942 యూనిట్లు కాగా.. 2024లో 11 శాతం వృద్ధితో 12,21,909 యూనిట్లు అమ్ముడయ్యాయి. ట్రాక్టర్ విక్రయాలు 3 శాతం పెరిగి 8,94,112 యూనిట్లుగా నమోదయ్యాయి. కమర్షియల్ వాహనాల విక్రయాలు ఫ్లాట్‌గా 10,04,856 యూనిట్లు అమ్ముడయ్యాయి.

డిసెంబర్ నెలకు సంబంధించి

డిసెంబర్ నెలలో మొత్తంగా ఆటో మొబైల్ రిటైల్ విక్రయాలు 17,56,419 యూనిట్లుగా నమోదయ్యాయి.

టూవీలర్ విక్రయాలు గతేడాది డిసెంబర్‌తో (14,54,353) పోలిస్తే విక్రయాలు 18 శాతం (11,97,742) తక్కువగా నమోదయ్యాయి.పాసింజర్ వాహన విక్రయాలు సైతం 2 శాతం క్షీణించాయి. గతేడాది 2,99,351 యూనిట్లు అమ్ముడవగా.. ఈ ఏడాది 2,93,465 యూనిట్లు మాత్రమే విక్రయాలు నమోదయ్యాయి.

## విండ్సార్ ధర పెంచిన ఎంజీ.. ఫ్రీ ఛార్జింగ్‌కూ గుడ్‌బై




**ముంబయి:** ప్రముఖ ఆటో మొబైల్ కంపెనీ జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా తన పాపులర్ విద్యుత్ కారు విండ్సార్ ఈవీ ధరల్ని పెంచింది. అన్ని వేరియంట్ ధరల్ని రూ.50 వేలు పెంచుతున్నట్లు తాజాగా ప్రకటించింది. దీంతోపాటు ఫ్రీ ఛార్జింగ్ సదుపాయాన్ని కూడా నిలిపివేస్తున్నట్లు వెల్లడించింది.

విండ్సార్ లాంచ్ సమయంలో ప్రారంభ ధరను కేవలం 10వేల యూనిట్లు వరకు లేదా డిసెంబర్ 31 వరకు మాత్రమే పరిమితం అని తెలిపింది. ఈ క్రమంలోనే 2024 డిసెంబర్ నాటికి విండ్సార్ ఈవీ విక్రయాలు 10వేల యూనిట్ల మైలురాయిని చేరుకోవడంతో ధరల పెంపు నిర్ణయం తీసుకుంది. దీంతో పాటు ఇప్పటివరకు కాంప్లిమెంటరీ ఆఫర్ కింద ఎంజీ ఇహబ్ యాప్‌ను ఉపయోగించి ఛార్జింగ్ స్టేషన్లలో ఉచితంగా ఛార్జ్ చేసుకునే వెసులుబాటును కల్పించింది. ఆ సదుపాయాన్ని కూడా నిలిపివేసింది. దీంతోపాటు కారు కొనుగోలు చేసిన ఫస్ట్ యజమానికి ఈవీ బ్యాటరీపై లైఫ్‌టైమ్ ఉచిత వారెంటీ సదుపాయం ఉండగా.. వారి నుంచి కారు కొనుగోలు చేసేవారికి 8 ఏళ్ల పాటు లేదా 1,60,000 కిలోమీటర్ల వరకు మాత్రమే వారెంటీని పరిమితం చేసింది.

ధరల సవరణ అనంతరం విండ్సార్ బేసిక్ వేరియంట్ ధర రూ.13.99 లక్షలకు (ఎక్స్‌షోరూమ్) చేరింది. మిడ్ లెవల్ ధర రూ.14.99 లక్షలు, టాప్ వేరియంట్ ధర రూ.15.99 లక్షలుగా ఉంది. ఇక ఈ కారు స్పెసిఫికేషన్ల విషయానికొస్తే.. విండ్సార్‌లో 38 kWh బ్యాటరీ ప్యాక్ ఉంది. ఇందులోని మోటార్ 134 బీహెచ్‌పీ శక్తిని, 200Nm పీక్ టార్క్‌ను విడుదల చేస్తుంది. ఒక్కసారి ఛార్జింగ్ చేస్తే సుమారు 331 కిలోమీటర్లు ప్రయాణించగలదు. కారులో ఎకో, ఎకో ప్లస్, నార్మల్, స్పోర్ట్స్ మోడ్‌లు ఉన్నాయి.

## లాభాల్లో ముగిసిన సూచీలు.. 23,700 ఎగువకు నిఫ్టీ




**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాల నేపథ్యంలో మన సూచీలు ఓ మోస్తరుగా రాణించాయి. నిన్నటి భారీ నష్టాల నుంచి మదుపర్లకు కాస్త ఊరట కల్పించాయి. ముఖ్యంగా వైరస్‌కు సంబంధించి పెద్దగా ఆందోళన అక్కర్లేదన్న వార్తలు కూడా కొంత సానుకూలతకు కారణమయ్యాయి.

సెన్సెక్స్ సూచీ ఉదయం 78,019.80 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,964.99) స్వల్ప లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా మోస్తరు లాభాల్లో కదలాడింది. ఇంట్రాడేలో 78,452.74 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 234.12 పాయింట్ల లాభంతో 78,199.11 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 91.85 పాయింట్ల లాభంతో 23,707 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ మరో 5 పైసలు క్షీణించి 85.73గా ఉంది.సెన్సెక్స్ 30 సూచీలో టాటా మోటార్స్, రిలయన్స్, ఇండస్ ఇండ్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఏషియన్ పెయింట్స్ షేర్లు లాభాల్లో ముగిశాయి. జొమాటో, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టీసీఎస్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 76 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 2653 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

విశ్వంభర
V3 NEWS



## టాలీవుడ్‌లోకి వామిక రీ ఎంట్రీ

అడివి శేష్ హై-ఆక్టేన్ స్పై థ్రిల్లర్ G2తో అలరించబోతున్నారు. ఇది పాత్‌బ్రేకింగ్ హిట్ గూడచారికి సీక్వెల్. G2 ఇప్పటి వరకు అడివి శేష్ అత్యంత ప్రతిష్టాత్మకమైన హై-బడ్జెట్ చిత్రం మాత్రమే కాకుండా ఇండియన్ స్పై థ్రిల్లర్ ల్యాండ్‌స్కేప్‌లో మోస్ట్ ఇంపార్టెంట్ ప్రాజె-క్ట్‌లలో ఒకటి. వినయ్ కుమార్ సిరిగినీడి దర్శకత్వం వహించిన ఈ చిత్రం స్పై థ్రిల్లర్ ఒక సినిమాటిక్ మాస్టర్ పీస్ అవుతుందని హామీ ఇచ్చింది. ఈ ప్రతిష్టాత్మక పాన్-ఇండియా యాక్షన్ ఫ్రాంచైజీలో ఇమ్రాన్ హష్మీతో పాటు వామిక గబ్బి చేరారు. ఈ పవర్‌హౌస్ తారాగ-ణంతో, G2 ట్రూ పాన్-ఇండియా మూవీ రూపొందుతోంది.

వరుణ్ ధావన్ 'బేబీ జాన్'లో వామిక టీచర్ రోల్ చేశారు. ఆ సినిమాలో కీర్తి సురేష్ హీరోయిన్ అయినప్పటికీ... మూవీ విడుదలకు ముందు ప్రచార కార్యక్రమాల్లో వామిక అందం చూసి యువత ఫిదా అయింది. దాంతో సోషల్ మీడియాలో ఆవిడ ట్రెండ్ అయ్యింది. 'బేబీ జాన్' విడుదల తర్వాత క్లైమాక్స్ ట్విస్ట్ చూసి జనాలు షాక్ అయ్యారు. వామిక ఏజెంట్ రోల్ చేశారని చూపించారు. ఇప్పుడు ఆవిడ మరోసారి మరొక సినిమాలో ఏజెంట్ పాత్రలో కనిపించనున్నారు. పాన్ ఇండియా సినిమాతో టాలీవుడ్ రీ ఎంట్రీ ఇవ్వడానికి రెడీ అయ్యారు. నవ దళపతి సుధీర్ బాబుకు జంటగా 'భలే మంచి రోజు'లో వామిక గబ్బి హీరోయిన్. ఆ సినిమా వచ్చి పదేళ్లు అవుతోంది. ఆ తర్వాత మళ్లీ తెలుగు సినిమా చేయలేదు. ఇప్పుడు 'జీ 2'తో మళ్ళీ తెలుగులో రీ ఎంట్రీ ఇస్తున్నారు.

వామికా, అడివి శేష్ సరసన లీడ్‌గా నటిస్తోంది. ఆమె పాత్ర స్పై ప్రపంచానికి ఫ్రెష్ డైనమిక్ లేయర్ ని యాడ్ చేస్తోంది.

ఇటీవల అడివి శేష్‌తో యూరోపియన్ షూటింగ్ షెడ్యూల్‌ను ముగించిన వామిక ఈ చిత్రం గురించి ఉత్సాహంగా ఉన్నారు. “G2 అద్భుతమైన ప్రయాణంలో భాగం కావడానికి నేను చాలా సంతోషిస్తున్నాను. మొదటి చిత్రం చెప్పుకోదగ్గ బెంచ్‌మార్క్‌ని సెట్ చేసింది, ఈ ప్ర-పంచంలోకి అడుగు పెట్టడం ఆనందంగా, సవాలుగా ఉంటుంది. ప్రతిభావంతులైన తారాగణం, టీంతో కలిసి పనిచేయడం నాకు స్ఫూర్తినిస్తుంది అని వామిక అన్నారు.

అడివి శేష్, వామికా గబ్బి, ఇమ్రాన్ హష్మీ తో పాటు మురళీ శర్మ, సుప్రియా యార్లగడ్డ, మధు షాలిని కీలక పాత్రలు పోషిస్తున్న ఈ మూవీ యాక్షన్, ఎడ్జ్ ఆఫ్ ది సీట్ డ్రామాతో సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ ని ప్రామిస్ చేస్తోంది.

పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ -ఎకె ఎం-టర్‌టైన్‌మెంట్స్ బ్యానర్స్ పై టీజీ విశ్వ ప్రసాద్, అభిషేక్ అగర్వాల్ నిర్మించిన జి 2 తెలుగు, హిందీ, తమిళం, కన్నడ మలయాళం పాన్-ఇండియన్ విడుదల కానుంది. పవర్‌హౌస్ తారాగణం, స్పై థ్రిల్లర్ స్టయిల్ ని రీడిఫైన్ చేయనున్న G2 నిస్సందే-హంగా అత్యంత ఎదురుచూస్తున్న చిత్రా-లలో ఒకటి. G2 త్వరలో పెద్ద స్క్రీన్స్ కి రావడానికి సిద్ధమవుమౌతోంది.

## డ్రింకర్ సాయితో ఇండస్ట్రీలో నాకో స్థానం లభించింది : హీరో ధర్మ

ధర్మ, ఐశ్వర్య శర్మ హీరో హీరోయిన్లుగా నటించిన సినిమా డ్రింకర్ సాయి. బ్రాండ్ ఆఫ్ బ్యాడ్ బాయ్స్ అనేది ఈ చిత్ర ట్యాగ్ లైన్. ఈ చిత్రాన్ని ఎవరెస్ట్ సినిమాస్, స్మార్ట్ స్క్రీన్ ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్స్ పై బసవరాజు శ్రీనివాస్, ఇస్మాయిల్ షేక్, బసవరాజు లహరిధర్ నిర్మించారు. కొన్ని వాస్తవ ఘటనల ఆధారంగా దర్శకుడు కిరణ్ తిరుమలశెట్టి ఈ చిత్రాన్ని రూపొందించారు. గత డిసెంబర్ 27న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వచ్చిన "డ్రింకర్ సాయి" సినిమా యునానమస్ గా సూపర్ హిట్ టాక్ తెచ్చుకుంది. "డ్రింకర్ సాయి" సినిమా యూత్, ఫ్యామిలీ ఆడియెన్స్ ఆదరణతో విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ నేపథ్యంలో సినిమా ప్రత్యేక ప్రదర్శనను మీడియా మిత్రుల కోసం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో డైరెక్టర్ కిరణ్ తిరుమలశెట్టి మాట్లాడుతూ.. మా "డ్రింకర్ సాయి" సినిమాను ప్రేక్షకుల నుంచి ఆదరణ దక్కింది. ఫస్ట్ వీక్ సక్సెస్ ఫుల్ గా కంప్లీట్ చేసుకుని మంచి కలెక్షన్స్ తో సెకండ్ వీక్ మూవీ రన్ అవుతోంది. నేను అనుకున్న పాయింట్ ప్రేక్షకులకు బాగా రీచ్ అయ్యింది. హీరో ధర్మ, హీరోయిన ఐశ్వర్య తోపాటు ప్రతి క్యారెక్టర్‌ను ప్రేక్షకుల ఇష్టపడుతున్నారు. ఈ సినిమాతో దాదాపు 20 మంది కొత్త వాళ్లను ఇంట్రడ్యూస్ చేశాను. మా మూవీ రిజల్ట్ పట్ల ప్రొడ్యూసర్స్ హ్యాపీగా ఉన్నారు. థియేటర్స్ లో చిన్న సినిమాల పరిస్థితి బాగా లేదు. కానీ మా మూవీకి వసూళ్లు బాగున్నాయంటూ డిస్ట్రిబ్యూటర్స్ చెబుతున్నారు. "డ్రింకర్ సాయి" మూవీని సక్సెస్ చేసిన ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్. అన్నారు.

ప్రొడ్యూసర్ బసవరాజు లహరిధర్ మాట్లాడుతూ.. "డ్రింకర్ సాయి" కమర్షియల్‌గా మంచి సక్సెస్ సాధించింది. ఇప్పటిదాకా 5.75 కోట్ల రూపాయల గ్రాస్ కలెక్షన్స్ వచ్చాయి. ప్రేక్షకులకు మా మూవీ రీచ్ కావడంతో మీడియా మిత్రులు ఎంతో సపోర్ట్ చేశారు. మా సక్సెస్ లో భాగమైన ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్. అన్నారు.

హీరో ధర్మ మాట్లాడుతూ.. "డ్రింకర్ సాయి" సినిమాను ఆదరించడం ద్వారా చిత్ర పరిశ్రమలో యువ హీరోగా నాకో స్థానం కల్పించారు ప్రేక్షకులు. వారికి నేను కృతజ్ఞతలు చెబుతున్నాను. కొత్త వాళ్లకు ఇండస్ట్రీలో ప్రోత్సాహం ఉండదు అనేది తప్పని మీరంతా ప్రూవ్ చేశారు. హీరోగా నన్నెంతో ఎంకరేజ్ చేశారు. ఇలాంటి మంచి మూవీ నాతో చేసిన డైరెక్టర్ కిరణ్ కి, నిర్మాతలకు థ్యాంక్స్. మీడియా మిత్రులకు ఫ్యామిలీతో కలిసి చూసేలా "డ్రింకర్ సాయి" షో వేయాలని అనుకున్నాం. అందుకు మీ దగ్గర నుంచి వచ్చిన సపోర్ట్ సంతోషంగా ఉంది. మీరంతా సినిమా చూసి మీ ప్రశంసలు అందించడం హ్యాపీగా ఉంది. మీరు చెప్పినవన్నీ నా మనసులో ఉంచుకుని నా ఫ్యూచర్ ప్రాజెక్ట్స్ ప్లాన్ చేసుకుంటాను. ఇంకా పెద్ద సక్సెస్ ఫుల్ సినిమా కోసం ప్రయత్నిస్తూనే ఉంటాను. అన్నారు.

"డ్రింకర్ సాయి" సినిమా స్పెషల్ షో చూసిన మీడియా మిత్రులు సినిమా బాగుందని, మంచి ఎంటర్ టైన్ మెంట్ తో పాటు సందేశాన్ని కూడా ఇచ్చిందని ప్రశంసలు అందజేశారు.

ఈ చిత్రం లో ధర్మ, ఐశ్వర్య శర్మ, పోసాని కృష్ణమురళి, శ్రీకాంత్ అయ్యంగార్, సమీర్, ఎస్ఎస్ కాంచి, భద్రం, కిర్రాక్ సీత, రీతు చౌదరి, ఫన్ బకెట్ రాజేశ్, రాజ ప్రజ్వల్, తదితరులు నటించారు.



## రేసింగ్‌లో ప్రమాదానికి గురైన హీరో అజిత్ కారు




కోలీవుడ్ హీరో అజిత్ మంచి బైక్, కార్ రేసర్ అని తెలిసిందే. అయితే, దుబాయ్ రేసింగ్ ఈవెంట్ లో ఆయన కారుకు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో కారు ముందు భాగం డ్యామేజి అయింది. అజిత్ క్షేమంగా ఉన్నారు. దుబాయ్ లో 24హెచ్ 2025 ఎండ్యూరెన్స్ రేస్ జరగనుంది. ఈ రేసింగ్ ఈవెంట్ జనవరి 11, 12 తేదీల్లో నిర్వహిస్తున్నారు. దీంట్లో అజిత్ కూడా పార్టిసిపేట్ చేస్తున్నారు. అందుకోసం ఆయన ఇవాళ మధ్యాహ్నం 12.45 గంటల సమయంలో రేసింగ్ ట్రాక్ పై ప్రాక్టీస్ సెషన్ లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా, ట్రాక్ పై అజిత్ కారు దూసుకుపోతుండగా, ఉన్నట్టుండి అదుపు తప్పింది. గోడను ఢీకొట్టి గిర్రున తిరుగుతూ నిలిచిపోయింది. ఈవెంట్ భద్రతా సిబ్బంది వెంటనే స్పందించి అజిత్ ను మరో వాహనంలో అక్కడ్నించి తరలించారు.

## మొదలైన కలవరం

విజయ్ కనిష్క, గరిమ చౌహన్ హీరో హీరోయిన్లుగా సీఎల్ఎన్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్, హనుమాన్ దర్శకత్వంలో వస్తున్న సినిమా కలవరం. లవ్ స్టోరీతోపాటు ఒక డిఫరెంట్ కాన్సెప్ట్ తో వస్తున్న థ్రిల్లర్ ఎలిమెంట్స్ తో ఈ సినిమాని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాకి శశాంక్ కథని అందించగా సినిమాటోగ్రాఫర్ గా వెంకట్ అలాగే మ్యూజిక్ అందించింది దేవిశ్రీ ప్రసాద్ దగ్గర బ్యాక్ గ్రౌండ్ స్కోర్ చేస్తూ ఉండే వికాస్ బాడిస. ఈ సినిమా పూజా కార్యక్రమాలకు ముఖ్యతిథులుగా చదలవాడ శ్రీనివాసరావు, సి కళ్యాణ్ హాజరై ప్రారంభించారు.

ఈ సందర్భంగా చదలవాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కలవరం టైటిల్ చాలా మంచి టైటిల్. ఇది బాలచందర్, భాగ్య రాజా వంటి క్రియేటివ్ డైరెక్టర్స్ తీయగలిగే మంచి కథ ఉన్న సినిమా. ఇప్పటిదాకా చిన్న సినిమాలను పట్టించుకున్న ప్రభుత్వం లేదు. ఇప్పుడున్న ఈ రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలైన చిన్న సినిమాలకు తోడ్పాటు కల్పించాలి. చిన్న సినిమాలకి షోలు ఎక్కువ ఇవ్వడం అదేవిధంగా మినీ థియేటర్లు కట్టి సపోర్ట్ ఇవ్వాలి. ఈ సినిమా మంచి సక్సెస్ అయ్యి హీరో హీరోయిన్ల కి మూవీ టీంకి మంచి పేరు తీసుకురావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అన్నారు.

దర్శకుడు హనుమాన్ వాసంశెట్టి మాట్లాడుతూ.. ఈ కథ చెప్పిన వెంటనే నచ్చి సపోర్ట్ చేసి మనం ఈ సినిమా చేస్తున్నాం అని నిర్మాత శోభ రాణి చెప్పడం జరిగింది. వెంటనే చెన్నై వెళ్లి హీరో కి కథ చెప్పాము. హీరో విజయ్ కనిష్క కి కూడా ఈ కథ చాలా నచ్చి మనం ఈ సినిమా చేస్తున్నాము అని అన్నారు. ఈ రోజున ఇలా గ్రాండ్ గా ప్రారంభించడం ఆనందంగా ఉంది. నన్ను నా కథని నమ్మి నాకే అవకాశం ఇచ్చిన శోభ రాణికి హీరో విజయ్ కనిష్క కి కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. కచ్చితంగా ఈ సినిమా ప్రేక్షకులకు నచ్చుతుంది అని ఆశిస్తున్నాను అన్నారు.

నిర్మాత శోభారాణి మాట్లాడుతూ.. కలవరం అనే టైటిల్ ఈ సినిమాకి పర్ఫెక్ట్ గా సెట్ అవుతుంది. శశాంక్ ఇచ్చిన కథ అలాగే డైరెక్టర్ హనుమాన్ ఈ సినిమా స్క్రిప్ట్ కోసం చాలా కష్టపడ్డారు. అదే కష్టంతో ఇష్టంతో ఈ సినిమాని పూర్తి చేస్తాము. అడగగానే మా ఈ సినిమా ఓపెనింగ్ కి వచ్చిన చదలవాడ శ్రీనివాసరావు, సి కళ్యాణ్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు. ఈ చిత్రం ప్రేక్షకులు అందరూ మెచ్చే సినిమా అవుతుందని కచ్చితంగా చెప్తున్నాను అన్నారు.

నటీనటులు : విజయ్ కనిష్క(హిట్ లిస్ట్ ఫేమ్), గరిమ చౌహాన్ , రాజ్ తిరందాసు (పుష్ప ఫేమ్)



## 1000 వర్డ్స్ చూసి కన్నీళ్లు వచ్చాయి.. : రేణూ దేశాయ్



అరవింద్ కృష్ణ, బిగ్ బాస్ ఫేమ్ దివి, మేఘన శ్రీనివాస్, వినయ్ కీలక పాత్రల్లో విల్లర్ట్ ప్రొడక్షన్ హౌస్ బ్యానర్‌లో ‘1000 వర్డ్స్’ అనే సినిమా రూపొందింది. ఈ సినిమాకు రమణ విల్లర్ట్ నిర్మాతగా వ్యవహరిస్తూనే డైరెక్షన్ చేశారు. కే రవి కృష్ణా రెడ్డి కో ప్రొడ్యూసర్ గా పని చేశారు. ఈ సినిమాకు డా.సంకల్ప్ కథ, డైలాగ్స్, స్క్రీన్ ప్లే అందించగా.. శివ కృష్ణ సంగీతం అందించారు. సినిమాటోగ్రఫర్‌గా శివ రామ్ చరణ్ పని చేశారు. సోమవారం స్పెషల్‌గా ఈ మూవీని ప్రదర్శరించారు. ఈ చిత్రం స్పెషల్ ప్రీమియర్‌కు రేణూ దేశాయ్, ఎస్వీ కృష్ణారెడ్డి, అచ్చి రెడ్డి, మధుర శ్రీధర్, జ్యోతి పూర్వాజ్, సుకు పూర్వాజ్ ముఖ్య అతిథులుగా హాజరై స్పెషల్ షోను వీక్షించారు.

అనంతరం రేణూ దేశాయ్ మాట్లాడుతూ.. ‘రమణ గారు ఫోటోగ్రాఫర్‌గా నాకు తెలుసు. ఆయన ఓ కథ చెప్పాడు. బాగానే అనిపించింది. కానీ ఎలా తీసి ఉంటారా? అని అనుకున్నాను. ఈ మూవీ చూశాక అద్భుతంగా అనిపించింది. ఇది అందరికీ రీచ్ అవ్వాలి. అందరూ చూడాల్సిన, అందరికీ తెలియాల్సిన సినిమా. ఒక్క ఫోటో మీద ఇంత మంచి కథను రాసుకుని తీశారు. సినిమా చూశాక నాకు కూడా కన్నీళ్లు వచ్చాయి. ఇంత మంచి సినిమాను తీసిన టీంకు ఆల్ ది బెస్ట్. రమణకి ఇది ఆరంభం మాత్రమే. ఆయన్నుంచి ఇంకా ఇలాంటి మంచి చిత్రాలు రావాలని ఆశిస్తున్నాను’ అని అన్నారు.


ఎస్వీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ‘‘1000 వర్డ్స్’ అద్భుతమైన చిత్రం. అందరినీ కంటతడి పెట్టించారు. ఈ చిత్రానికి కచ్చితంగా అవార్డులు వస్తాయి. ప్రతీ ఒక్కరి హృదయాల్ని కుదిపేస్తుంది. చాలా రోజులకు ఓ చక్కటి సినిమాను చూశానని అనిపిస్తుంది’ అని అన్నారు.

డైరెక్టర్, నిర్మాత రమణ విల్లర్ట్ మాట్లాడుతూ.. ‘గత 20 ఏళ్లుగా నేను ఓ మంచి సినిమాను చేయాలని తపిస్తూనే ఉన్నాను. అప్పుడే సంకల్ప్ ఈ కథతో వచ్చారు. ఓ తల్లి బిడ్డను కనేప్పుడు పడే బాధను చెప్పాలని, చూపించాలనే ఈ సినిమాను తీశాం. అరకులో పూర్తిగా షూట్ చేశాం. మేఘన అమ్మ పాత్రలో అద్భుతంగా నటించారు. పురిటి నొప్పుల్ని డబ్బింగ్‌లో చూపించడంతో కన్నీళ్లు వచ్చాయి. ఇలాంటి కథకు హీరోగా ఎవరు వస్తారో అని అనుకున్నాం. ఈ కథను అరవింద్ కి చెబితే వెంటనే ఒప్పుకున్నారు. కథ వింటుంటే గూస్ బంప్స్ వస్తున్నాయని అన్నారు. ఆయన మాకు ఎంతో సహకరించారు. దివి చాలా అందంగా ఉండటమే కాదు అద్భుతంగా నటించారు. చైల్డ్ ఆర్టిస్ట్ విజయ్ అలియాస్ నూరీ నటన చూసి ముచ్చట వేసింది. లక్ష్మీ భూపాల గారు రెమ్యూనరేషన్ లేకుండా పాట రాసిచ్చారు. శివ రామ్ చరణ్ ఫ్రేమ్స్ చూసి అద్భుతంగా అనిపించింది. ఈ సినిమాకు సపోర్ట్ చేసిన వారందరికి కృతజ్ఞతలు.’ అని అన్నారు.

## క్లీంకార ముఖాన్ని రివీల్ చేసేది అప్పుడే..

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ సంక్రాంతి కానుకగా గేమ్ చేంజర్ మూవీతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఈ నెల 10న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. దీంతో చిత్ర బృందం ముమ్మరంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా రామ్ చరణ్ తాజాగా నందమూరి బాలకృష్ణ హోస్ట్‌గా వ్యవహరిస్తున్న అన్‌స్టాపబుల్ షోలో సందడి చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఈ ఎపిసోడ్ ఈ నెల 8న ఆహాలో ప్రసారం కానుంది. దాంతో నిర్వాహకులు ఎపిసోడ్ తాలూకు ప్రోమోను విడుదల చేశారు. ఇందులో తన కుమార్తె క్లీంకార ముఖాన్ని ప్రపంచానికి ఎప్పుడు చూపించబోతున్నాడో చెర్రీ పంచుకున్నారు.

ఇప్పటివరకు క్లీంకార ముఖాన్ని చూపించకుండా దాచారు కదా.. అసలు ఎప్పుడు మాకు ఆమె ముఖాన్ని చూపిస్తారు? అని బాలయ్య ప్రశ్నించారు. దానికి రామ్ చరణ్ వెంటనే స్పందించారు. "నేను ఆమె ముఖాన్ని



రివీల్ చేస్తాను. కానీ దానికి ఒక షరతు ఉంది. ఆమె నన్ను నాన్న అని పిలిచినప్పుడు నేను ఆ పని చేస్తాను" అని చెప్పారు.

ఇక రామ్ చరణ్, ఉపాసన కామినేని 2012 జూన్‌లో వివాహం చేసుకున్నారు. అయితే, దాదాపు 11 ఏళ్ల తర్వాత 2023 జూన్‌లో ఈ దంపతులకు క్లీంకార జన్మించింది. దాంతో మెగా కుటుంబం ఆనందానికి అవధుల్లేవు. అందుకే రామ్ చరణ్ కూడా తన గారాలపట్టి తన జీవితంలోనే కాకుండా తన తండ్రి చిరంజీవి జీవితంలో కూడా ఒక వరం అని అన్నారు.

## జనవరి 11 నుంచి పుష్ప-2 ది రూల్ రీలోడెడ్ వెర్షన్



'బాహుబలి2' వసూళ్లను పుష్ప2 అధిగమించిన విషయం తెలిసిందే. ఇక పుష్ప2 ది రూల్‌మరో సారి ఇండియా వైడ్‌గా హాట్‌టాపిక్‌గా మారింది. జనవరి 11 నుంచి పుష్ప 2 రీ లోడెడ్ వెర్షన్.. పుష్ప2కు మరో ఇరవై నిమిషాల పవర్‌ఫుల్ ఫుటేజ్‌ను యాడ్ చేస్తున్నారు. ఈ విషయాన్ని అధికారికంగా మంగళవారం ప్రకటించారు మేకర్స్. అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్‌ల కలయికలో రూపొందిన పుష్ప2 ది రూల్..ఈ సన్సేషన్ కాంబినేషన్‌లో అత్యున్నత నిర్మాణ సంస్థ మైత్రీ మూవీమేకర్స్ సుకుమార్ రైటింగ్ సంస్థతో కలిసి ఈ ఇండియన్ బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్ సినిమాను నిర్మించింది. విడుదలకు ముందే ప్రీరిలీజ్ బిజినెస్‌లో ఇండియాలో సరికొత్త రికార్డును నెలకొల్పిన ఈ చిత్రం సినిమా విడుదల రోజు ప్రీమియర్స్ నుంచే సన్సేషనల్ బ్లాకబస్టర్ అందుకుంది. రష్మిక మందన్నా నాయికగా నటించిన ఈ చిత్రానికి దేవి శ్రీ ప్రసాద్ అద్భుతమైన బాణీలను అందించాడు.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com